# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

సూర్య 18 వ వసంతంలోకి ...

visit us @ http://epaper.suryaa.com

శనివారం | 12 అక్టోబర్ 2024 | విజయవాడ

సంపుటి 17 | సంచిక 312

| పేజీలు 8+8 | వెల: రూ. 6.50

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi


## దసరా శుభాకాంక్షలు



పాఠకులకు, ప్రకటనకర్తలకు, ఏజెంట్లకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు సూర్య దసరా శుభాకాంక్షలు, దసరా పర్వదినం సందర్భంగా నేడు మా కార్యాలయానికి సెలవు. కావున ఆదివారం (13-10-2024) నాటి సంచిక వెలువడదు. పునర్దర్శనం సోమవారం (14-10-2024)

–సూర్య యాజమాన్యం

# సరైన సమాచారం ఇవ్వకపోతే చర్యలే

**● వాస్తవాలను మరుగున పరచొద్దని హెచ్చరిక ● విశాఖ ఇసుక వ్యవహారం, వరదల సమయంలో కొందరి అధికారుల వైఖరిపై సీఎం సీరియస్**



చంద్రబాబు సీరియస్ అయ్యారు. ఎవరి పనికి వారు పరిమితం కావాలని తేల్చి చెప్పారు. వాస్తవ పరిస్థితులు తమకు తెలియకుండా ప్రభుత్వ పెద్దల మెప్పు కోసం అంతా బాగుందనే తప్పుడు సమాచారం ఇచ్చినా సహించనని సీఎం తేల్చేసారు. అత్యుత్సాహం పనికి రాదని స్పష్టం చేసారు.

2లో






సమస్యల పరిష్కారానికి

## ప్రత్యేక చర్యలు



2లో

● ఓట్లేసి గెలిపించిన ప్రజలను మర్చిపోకుండా సేవలు ● పిఠాపురంలో ప్రత్యేక బృందాల ఏర్పాటు ● అన్ని రంగాలలో అభివృద్ధే ధ్యేయం ● డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

లోకేశ్ ప్రజాదర్బార్‌కు

## బాధితుల క్యూ



2లో

● వ్యక్తిగత సమస్యలపై ఫిర్యాదులు ● అధిక వడ్డీలతో వేధిస్తున్నారని ఆందోళనలు ● గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యంపై కంటతడి పెట్టుకున్న బాధితులు ● ఉండవల్లిలోని లోకేశ్ నివాసంలో ప్రజాదర్బార్
















# జపాన్ సంస్థకు నోబెల్ శాంతి బహుమతి

● అణుదాడి బాధితుల పక్షాన పోరాడుతున్న నిహాన్ హిడాంక్యో ● ప్రపంచాన్ని అణ్వాయుధరహితంగా చేసేందుకు కృషి

స్టాక్‌హోం: ప్రపంచ ప్రఖ్యాత నోబెల్ శాంతి బహుమతి -2024 జపాన్‌కు చెందిన నిహాన్ హిడాంక్యో సంస్థను వరించింది. జపాన్‌లోని హిరోషిమా, నాగసాకిల్లో అణుదాడి నుంచి బయటపడిన బాధితుల పక్షాన ఈ సంస్థ పోరాడుతోంది. ప్రపంచాన్ని అణ్వాయుధ రహితంగా మార్చేందుకు కృషి చేస్తుండడంతోపాటు బాధితుల జీవితగాథల్ని ఉదహరిస్తూ మరోసారి అణ్వాయుధాలను వాడకుండా ప్రయత్నాలు చేస్తున్నందుకు ఈ ప్రతిష్టాత్మక పురస్కారం దక్కింది. "హిరోషిమా, నాగసాకి అణుబాంబు నుంచి ప్రాణాలతో బయటపడిన వారు శారీరక సమస్యలు, విషాద జ్ఞాపకాలతో జీవిస్తున్నప్పటికీ వారిని గౌరవించాలని భావిస్తున్నాం. శాంతి, విశ్వాసం పెంపొందించడానికి వారి విలువైన అనుభవాలను ఉపయోగించుకునేందుకు శాంతి బహుమతిని ఇవ్వాలని నిర్ణయించాం' అని నోబెల్ బృందం పేర్కొంది. జపాన్ నగరాల్లో అణ్వాయుధాల బారిన పడిన బాధితుల ఉద్యమాన్ని హిబాకుషా గా పేర్కొంటారు. దీనిలో జపాన్‌కు చెందిన 47 రాష్ట్రాల్లో పోరాడుతున్న సంస్థల ప్రతినిధులు ఉన్నారు. మరోవైపు, వైద్య విభాగంతో మొదలైన నోబెల్ పురస్కారాల ప్రదానం అక్టోబర్ 14వరకు కొనసాగనుంది. వైద్య, భౌతిక, రసాయన శాస్త్రాలతోపాటు సాహిత్యంలో నోబెల్ గ్రహీతల పేర్లను ఇప్పటికే వెల్లడించగా.. శుక్రవారం నోబెల్ శాంతి బహుమతి ని ప్రకటించారు. అక్టోబర్ 14న అర్థశాస్త్రంలో నోబెల్ గ్రహీతల పేర్లను వెల్లడిస్తారు.

# ఇది యుద్ధాల యుగం కాదు

● దౌత్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి ● యుద్ధంతో సమస్యలకు పరిష్కారాలు లభించవు
● 19వ ఈస్ట్ ఆసియా సమ్మిట్లో ప్రధాని నరేంద్ర మోడీ ప్రసంగం ● ఘర్షణలు గ్లోబల్ సౌత్ దేశాలపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నాయి
● మానవత్వంపై విశ్వాసమున్న శక్తులన్నీ కలిసి కట్టుగా పని చేయాలి: మోడీ



లావోస్: ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న ఘర్షణలు గ్లోబల్ సౌత్ దేశాలపై అత్యంత ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నాయని భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారు. లావోస్లోని 19వ ఈస్ట్ ఆసియా సమ్మిట్లో ఆయన మాట్లాడుతూ.. నేను బుద్ధుడి బోధనలను అనుసరించే దేశం నుంచి వచ్చాను అని పేర్కొన్నారు. ఇది యుద్ధాల యుగం కాదు.. యుద్ధంతో సమస్యలకు పరిష్కారాలు లభించవు అని మోడీ వెల్లడించారు. ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న ఘర్షణలు గ్లోబల్ సౌత్ దేశాలపై అత్యంత ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నాయని నరేంద్ర మోడీ తెలిపారు. ప్రపంచ శాంతి భద్రతకు ఉగ్రవాదం సైతం తీవ్రమైన పెను సవాలుగా మారింది అని ప్రధాని నరేంద్ర మోడీ చెప్పుకొచ్చారు. దీన్ని ఎదుర్కొనేందుకు మానవత్వంపై విశ్వాసమున్న శక్తులన్నీ కలిసి కట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు. అదే విధంగా సైబర్, సముద్ర, అంతరిక్ష రంగాలలో పరస్పర సహకారాన్ని బలోపేతం చేసుకోవాలి అని ఆయన వెల్లడించారు. కాగా, సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రత, అంతర్జాతీయ చట్టాలను ప్రతి ఒక్కరు గౌరవించాలి.. సమస్యల పరిష్కారానికి చర్చలకు, దౌత్యానికి ప్రాధాన్యమివ్వాలన్నారు. యురేషియా, పశ్చిమాసియాల్లో శాంతి స్థిరత్వం పునరుద్ధరించాలని ప్రధాని మోడీ తెలిపారు. ఐక్యరాజ్యసమితి చట్టాలకు లోబడి సముద్ర కార్యకలాపాలు జరగాలి యునైటెడ్ నేషన్స్ కన్వెన్షన్ ఆన్ ది లా ఆఫ్ ది సీ(యూఎన్సీఎల్ఓఎస్)కు లోబడి సముద్ర కార్యకలాపాలను నిర్వహించాలని తాము విశ్వసిస్తున్నట్లు ప్రధాని మోడీ పేర్కొన్నారు. నావిగేషన్, ఎయిర్స్పేస్ స్వేచ్ఛను నిర్ధరించడం అవసరమన్నారు. దక్షిణ చైనా సముద్రతీరంలో శాంతిభద్రతలను, ఇండో- పసిఫిక్ ప్రాంతాల ప్రయోజనాలను కాపాడాలని ఈసందర్భంగా మోడీ కోరారు. అనంతరం ఇటీవల వియత్నాంలో యాగి తుపాను కారణంగా మరణించినవారికి మోడీ సంతాపం తెలిపారు

## మహిషాసురమర్ధిని అవతారంలో అమ్మవారు



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి ఇంద్రకీలాద్రి పై దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం నాటికి ఉత్సవాలు 9వ రోజుకు చేరుకున్నాయి. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు తొమ్మిదవ అలంకారంగ శుక్రవారం మహిషాసురమర్ధిని అవతారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. తెల్లవారుజామునుంచి పడుతున్న వర్షాన్ని సైతం లెక్కచేయకుండా భక్తులు అమ్మవారిని దర్శించుకుంటున్నారు. దూరబారాల నుండి భవానీలు ఇంద్రకీలాద్రికి కాలినడకన వస్తున్నారు. దుష్టుడైన మహిషాసరుడిని అంతమొందించిన భీకర శక్తి స్వరూపిణి మహిషాసుర మర్ధిని రూపంలో ఇంద్రకీలాద్రిపై అమ్మవారు దర్శనమిస్తున్నారు. ఎనిమిది భుజములు.. అష్ట ఆయుధాలు... సింహవాహినిగా.. రౌద్ర రూపంలో వున్న అమ్మవారిని దర్శించుకుంటే.. శత్రు భయం వుండదని భక్తుల విశ్వాసం. మహిషుడిని అంతం చేయడం ద్వారా ముల్లోకాలను అమ్మవారు కాపాడినట్లే... భక్తుల మనస్సులోని సకల దుర్గుణాలను అమ్మవారు హరించి వేస్తుందని.. అమ్మవారి విశిష్టతను పురాణాలు చెబుతున్నాయి. అజ్ఞానం మీద విజ్ఞానం, బాధల మీద విజయం పొందే తత్వమే ఈ అమ్మవారు పూజలో పరమలక్ష్యం. ముదురు నీలం రంగు వస్త్రాలు ధరించి అమ్మ మహిషాసుర మర్దినిగా భక్తులకు దర్శనమిస్తోంది. ఈరోజు అమ్మవారికి సమర్పించే నైవేద్యం పాయసాన్నం, రవ్వతో చేసి చక్కెర పొంగలి సమర్పిస్తారు. కాగా ఇంద్రకీలాద్రికి భక్తుల రాక పెరుగుతోంది. సాధారణ భక్తులతో పాటు భవానీ మాలధారులు తండోపతండాలుగా తరలివస్తున్నారు. గురువారం దుర్గాదేవి అలంకారంలో కొలువైన అమ్మవారిని దక్షిణాది రాష్ట్రాల నుంచి భారీగా వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. ఉచిత దర్శనం క్యూలో ఉన్న భక్తులకు దర్శనం పూర్తి కావడానికి 5 గంటల సమయం పట్టింది. వినాయకుడి ఆలయం నుంచి ప్రారంభమయ్యే అన్ని క్యూలు భక్తులతో నిండిపోయాయి. భక్తి గీతాలను ఆలపిస్తూ భక్తులు ముందుకు సాగారు. అమ్మవారిని కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ, ఎమ్మెల్యే సుజనా చౌదరి, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కృష్ణతేజ, విజయనగరం ఎంపీ అప్పలనాయుడు, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న తదితరులు దర్శించుకున్నారు. ఎమ్మెల్యే సుజనా చౌదరి పట్టువస్త్రాలు సమర్పించారు. సినీ దర్శకుడు ఏఎం రత్నం కుటుంబంతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. వారికి వేదపండితులు వేద ఆశీర్వచనాలు అందజేశారు.



# సరైన సమాచారం ఇవ్వకపోతే చర్యలే-సీఎం

● వాస్తవాలను మరుగున పరచొద్దని హెచ్చరిక
● విశాఖ ఇసుక వ్యవహారం, వరదల సమయంలో కొందరి అధికారుల వైఖరిపై సీఎం సీరియస్

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి ముఖ్యమంత్రి చంద్రబాబు సీరియస్ అయ్యారు. ఎవరి పనికి వారు పరిమితం కావాలని తేల్చి చెప్పారు. వాస్తవ పరిస్థితులు తమకు తెలియకుండా ప్రభుత్వ పెద్దల మెప్పు కోసం అంతా బాగుందనే తప్పుడు సమాచారం ఇచ్చినా సహించనని సీఎం తేల్చేసారు. అత్యుత్సాహం పనికి రాదని స్పష్టం చేసారు. పరిధి దాటి వ్యవహరిస్తే చర్యలు తప్పవని సీఎం హెచ్చరించారు. చంద్రబాబు ఆగ్రహం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి కీలక ఆదేశాలు ఇచ్చారు. ఈ మధ్య కాలంలో కొందరు ప్రభుత్వ అధికారుల పని తీరు పైన వస్తున్న విమర్శల పైన చంద్రబాబు స్పందించారు. అధికారులు అత్యుత్సాహంతో తమ పరిధి దాటి రాజకీయ స్టేట్మెంట్లు ఇవ్వకుండా కట్టడి చేయాలని సీఎస్ కు సూచించారు. అధికారులు మీడియా ముందు పరిపాలన సంబంధిత అంశాలు మాత్రమే మాట్లాడాలని, రాజకీయ అంశాలు నాయకులు చూసుకుంటారని వ్యాఖ్యానించారు. విశాఖ ఇసుక వ్యవహారంలో అధికారులు వాస్తవాన్ని కప్పిపుచ్చే ప్రయత్నం చేయటం పైన చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేసారు. సీఎంకు ఫిర్యాదులు కొద్ది రోజుల క్రితం అనంతపురంలో రాముల వారి రథం తగలబడిన ఘటనలో అక్కడ ఎస్పీ చేసిన ప్రకటన చంద్రబాబుకు ఫిర్యాదులు అందాయి. అదే విధంగా విజయవాడ వరదల సమయం లో కొందరు అధికారులు అత్యుత్సాహం తో చేసిన ప్రకటనలు ప్రభుత్వానికి ఇబ్బంది కలిగించాయని మంత్రి లోకేష్ ముఖ్యమంత్రికి వివరించినట్లు సమాచారం. తాజా మంత్రివర్గ సమావేశానికి ప్రారంభం వేళ ఈ పరిణామం చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఇతర మంత్రులు ఇదే తరహా అభిప్రాయం వ్యక్తం చేసారు. దీంతో.. ముఖ్యమంత్రి వెంటనే సీఎస్ కు ఈ మేరకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అధికారులు పరిధి దాటి వ్యవహరిస్తే సహించేది లేదని తేల్చి చెప్పారు. మద్యం టెండర్ల అంశంలో మద్యం టెండర్ల అంశంలోనూ చంద్రబాబు సీరియస్ అయ్యారు. టెండర్లలో ప్రజా ప్రతినిధులు జోక్యం చేసుకొని, ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చేలా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరిక చేసారు. మద్యం టెండర్లలో కూటమి నేతల జోక్యం పైన మీడియాలో పెద్ద ఎత్తున కథనాలు వచ్చాయి. ఆ తరువాత సీఎంఓ స్పందించి నేతలెవరూ ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోవద్దని స్పష్టత ఇచ్చింది. ఆ తరువాత రెండు రోజుల మద్యం దరఖాస్తులకు సమయం పొడిగించారు. నేటతో ఆ సమయం ముగియనుంది.

# భక్తుల మనోరథాన్ని అధిరోహించిన దేవదేవుడు

● వేడుకగా రథోత్సవం ● భక్తిశ్రద్ధలతో రథాన్ని లాగిన భక్తులు









తిరుమల : తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలలో ఎనిమిదో రోజైన శుక్రవారం ఉదయం 7 గంటలకు ఉభయదేవేరులతో కూడిన శ్రీ మలయప్పస్వామి వారి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి రథాన్ని లాగారు. బ్రహ్మోత్సవాలలో ఎనిమిదో రోజున ఉభయ దేవేరులతో మలయప్పస్వామిని మహోన్నత రథంపై అధిష్ఠింపజేసి ఆలయ వీధులలో విహరింపజేశారు. శ్రీవారికి భక్తులు అడుగడుగునా నీరాజనాలు సమర్పించారు. గోవిందనామస్మరణతో ఆలయ మాడవీధులు మారుమోగాయి. తిరుమలలో రథోత్సవం అన్నివిధాలా ప్రసిద్ధమైనది. "రథస్థం కేశవం దృష్ట్వా పునర్జన్మనవిద్యతే" అన్న ఆర్షవాక్కులు రథోత్సవం మోక్షప్రదాయకమని వివరిస్తున్నాయి. తిరుమాడ వీధులలో రథాన్ని లాగేటప్పుడు ప్రమాదాలు జరుగకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. రథానికి తాళ్ళకట్టి వీధులలో భక్తులు, అధికారులు అందరూ రథాన్ని ముందుకు లాగారు. రథోత్సవానికి విశిష్టమైన ఆధ్యాత్మికార్థం ఉంది. కఠోపనిషత్తులో ఆత్మకు, శరీరానికి ఉండే సంబంధాన్ని రథరూపకల్పనతో వివరించడం జరిగింది. ఆత్మ రథికుడు, శరీరమే రథం, బుద్ధి సారథి, మనస్సు పగ్గం, ఇంద్రియాలే గుర్రాలు, విషయాలే వీధులు. ఈ రీతిలో శరీరాన్ని రథంతో పోల్చడంతో %-% స్థూలశరీరం వేరనీ, సూక్ష్మశరీరం వేరనీ, ఆత్మ అందుకు భిన్నమనే ఆత్మానాత్మ వివేకం కలుగుతుంది. రథోత్సవంలో ముఖ్యంగా కలిగే తత్త్వజ్ఞానమిదే. భక్తులు రథాన్ని లాగుతారు, కానీ, అన్నమయ్య సకలజీవులలో అంతర్యామిగా ఉన్న పరమాత్మ తనరథాన్ని తానే లాగుతున్నాడని అనడం సముచితం.

# ఏపీలో స్మార్ట్ కార్డులు

ఎక్కడైనా రేషన్ తీసుకునే వెసులుబాటు



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి ఏపీలో కూటమి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. సుదీర్ఘ కాలంగా పెండింగ్ లో ఉన్న రేషన్ కార్డుల మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కొత్త కార్డుల మంజూరుకు అర్హతల ను ఖరారు చేయాలని అధికారులకు సూచించింది. నూతన దంపతులకు కార్డులు ఇవ్వాలని డిసైడ్ అయింది. అదే సమయంలో వైసీపీ రంగులతో ఉన్న పాత రేషన్ కార్డులను రద్దు చేయనుంది. వాటి స్థానంలో కొత్త కార్డుల మంజూరు పైన అధికారులు కసరత్తు చేస్తున్నారు. పాత కార్డుల రద్దు ఏపీలో కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ పైన కసరత్తు జరుగుతోంది. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చినా వైసీపీ ప్రభుత్వం పార్టీ రంగులు..జగన్ బొమ్మతో ఉన్న కార్డులే అమల్లో ఉన్నాయి. ఇప్పుడు ఈ రేషన్‌కార్డులను తొలగించి కొత్త కార్డులు ఇవ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కొత్త రేషన్‌కార్డుల రూపకల్పనపై పౌరసరఫరాల శాఖ కసరత్తు చేస్తోంది. ఇందుకోసం అధికారులు పలు డిజైన్లు పరిశీలిస్తున్నారు. లేత పసుపు రంగుతో, రాష్ట్ర ప్రభుత్వ అధికారిక చిహ్నం ముద్రించిన కార్డుల నమూనాను అధికారులు ప్రభుత్వ ఆమోదం కోసం ప్రతిపాదించారు. దాంతోపాటు మరికొన్ని నమూనాలను కూడా ప్రభుత్వ పరిశీలనకు పంపించారు. స్మార్ట్ కార్డులు స్మార్ట్ కార్డుల జారీ అంశాన్ని కూడా పరిశీలిస్తున్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల వల్ల వలస కార్మికులు, కుటుంబాలు దేశంలో ఎక్కడైనా రేషన్ సరుకులు తీసుకునే వెసులుబాటు ఉంటుంది. రాష్ట్రంలో 1,36,420 మంది జాతీయ ఆహార భద్రతా కార్డుదారులు, మరో 17,941 మంది అంత్యోదయ అన్న యోజన కార్డుదారులు కలిపి మొత్తం 1,44,361 కార్డుదారులు 6 నెలలుగా రేషన్ తీసుకోవడం లేదు. అధికారుల కసరత్తు ఆరు నెలలుగా రేషన్ తీసుకోని కార్డులను రద్దు చేసి.. వాటి స్థానంలో కొత్త వారికి కార్డులిస్తే 2,10,823 మందికి లబ్ధి చేకూరుతుందని అధికారులు సూచించారు. గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన దరఖాస్తులన్నింటినీ పరిశీలిస్తున్నారు. అందులో అర్హులైనవారికి, ముఖ్యంగా కొత్తగా పెళ్లైన జంటలకు కొత్త రేషన్ కార్డులను మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే నూతన దంపతులకు కొత్త కార్డులు ఇవ్వాలంటే ముందుగా వారి కుటుంబ రేషన్ కార్డుల నుంచి పేర్లు తొలగించాల్సి ఉంటుంది. కొత్త కార్డుల జారీ చేసినా రాష్ట్ర ప్రభుత్వంపై అదనపు ఆర్థిక భారం పడకుండా ఉండేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.



# మోడీ జీ.. జోక్యం చేసుకోండి

● లేదంటే మూడో ప్రపంచ యుద్ధమే ● శాంతి దౌత్యం జరపి సర్దుబాటు చేయండి
● లండన్ జరిగిన ప్రపంచ సదస్సులో ప్రముఖుల విజ్ఞప్తి

వియత్నాం: రెండున్నరేళ్లకుపైగా రష్యా ఉక్రెయిన్ యుద్ధం రావణ కాష్టంలా రగులుతుంటే.. ఉప్పుకు నిప్పు తోడైనట్లు గాజా, లెబనాన్లో హమాస్ పై ఇజ్రాయెల్ వరుస దాడులు.. ఇరాన్ -ఇజ్రాయెల్ మధ్య బాంబుల వర్షం తీవ్ర ఉద్రిక్తత సృష్టిస్తోంది. కిమ్ అణ్వాయుధ పాటవం.. తైవాన్ ను ఆక్రమించుకునే యోచనలో చైనా చేస్తున్న పన్నాగాలు తదితర పరిణామాలు మూడో ప్రపంచ యుద్ధం వైపు దారితీస్తుండడంపై ప్రపంచం వ్యాప్తంగా ఉన్న శాంతి ప్రముఖులు ఆందోళన వ్యక్తం చేశారు. మాటలకే పరిమితం కాకుండా కార్యాచరణకు... ప్రపంచ దేశాల మధ్య శాంతి సయోధ్య కుదిర్చేందుకు తీసుకోవాల్సిన.. చేయాల్సిన కార్యక్రమాలపై తమ గళం వినిపించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం లండన్ వేదికగా జరిగిన ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆఫ్ జ్యూరిట్స్ అండ్ రైటర్స్ ఫర్ వరల్డ్ ఫీస్ స్పందించింది. కరోనా సంక్షోభం.. రష్యా-ఉక్రెయిన్ యుద్ధ పరిణామాలు.. ఆర్థిక మాంద్యం ప్రభావాలను అధిగమించిన భారత్ ప్రపంచ దేశాలకు ఆశాదీపంలా మారింది. ప్రధాని నరేంద్ర మోడీని అమెరికా, రష్యా అధ్యక్షులతోపాటు.. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అనేక దేశాల అధ్యక్షులు, ప్రముఖులు ప్రశంసలతో ముంచెత్తుతూ.. భారత్ తమకు అండగా నిలిచేలా తమ వంతు ప్రయత్నాలు చేస్తుండడం ప్రపంచ వ్యాప్తంగా అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్, లెబనాన్, ఇరాక్ దేశాల మధ్య పోరు రోజూ రోజుకు తీవ్రతరం అవుతుండడం పలు దేశాల మధ్య సంబంధాలు సైతం ఉప్పు నిప్పు తరహాలో రగులుకుంటుండడం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా యుద్ధంతో విసిగిపోయిన పుతిన్ తరచూ అణ్వాయుధాలను ప్రయోగించేందుకు వెనుకాడం అంటూ చేస్తున్న హెచ్చరికలకు తోడు.. ఉత్తర కొరియా నియంత కిమ్ సైతం అణ్వాయుధాలను బలోపేతం చేస్తూ.. పొరుగున ఉన్న దాయాది దక్షిణ కొరియాతో కయ్యానికి కాలుదువ్వుతూ.. ఏకంగా అమెరికానే సవాల్ చేస్తుండడం వంటి పరిణామాలు మూడో ప్రపంచ యుద్ధం దిశగా అడుగులు పడుతున్నాయన్న సంకేతాలు ఇస్తోంది. అందుకే ప్రపంచ వ్యాప్తంగా ఉన్న శాంతి ప్రముఖులు.. ఈ ఘర్షణలను నిలుపుదల చేసేందుకు శాంతి దౌత్యం జరపాలని ప్రధాని మోడీకి లండన్ లో జరిగిన ప్రపంచ సదస్సు వేదికగా విజ్ఞప్తి చేశారు. అందుకోసం వెంటనే రంగంలోకి దిగాలని వారు సూచించారు. లేకుంటే మూడో ప్రపంచ యుద్ధం వచ్చే అవకాశముందని వారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

# పిఠాపురం సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

● ప్రత్యేక బృందాల ఏర్పాటు



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ డిప్యూటీ సీఎం గా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి తన శాఖల పరిధిలో కీలక మార్పుల దిశగా అడుగులు వేస్తూనే మరోవైపు తనకు ఎమ్మెల్యేగా డిప్యూటీ సీఎం గా మారడానికి అవకాశం ఇచ్చిన పిఠాపురం ఓటర్ల విషయంలో కూడా ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. పిఠాపురంలో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక బృందాలు పిఠాపురం నియోజకవర్గ ప్రగతికి ఎప్పటికప్పుడు కీలక నిర్ణయాలను తీసుకుంటున్న పవన్ కళ్యాణ్ తాజాగా మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. పిఠాపురం నియోజకవర్గంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని నిర్ణయం తీసుకున్న పవన్ కళ్యాణ్ దీనిపై దృష్టి సారించి నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. వారికి పవన్ ఆదేశాలు మొత్తం పిఠాపురం నియోజకవర్గంలో 52 గ్రామాలు, రెండు మునిసిపాలిటీలలో క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలపై నివేదిక ఇవ్వాలని ఆ ప్రత్యేక బృందాలకు ఆదేశాలు జారీ చేశారు పవన్ కళ్యాణ్. అంతేకాదు పిఠాపురం నియోజకవర్గంలో సమస్యల పరిష్కారం కోసం చేయవలసిన అభివృద్ధి పనుల గురించి సమగ్రంగా అధ్యయనం చేయాలని వారికి సూచించారు. పవన్ రాజకీయ ప్రస్తానం ఇలా ఏపీలో జనసేన పార్టీ స్థాపించి రాజకీయాలు మొదలుపెట్టిన పవన్ కళ్యాణ్ రాజకీయాలలో నిలదొక్కుకునేందుకు సుదీర్ఘ పోరాటమే చేశారు. తొలిసారి ఎన్నికలలో రెండు చోట్ల పోటీ చేసిన పవన్ కళ్యాణ్ గాజువాక, భీమవరం లలో పోటీ చేసి రెండు చోట్ల ఓటమిపాలయ్యారు. పవన్ కళ్యాణ్ మాత్రమే కాకుండా జనసేన పార్టీ నుంచి ఒకే ఒక ఎమ్మెల్యే మినహాయించి మిగతా ఎవరు గెలవలేదు. పిఠాపురం నుండి పవన్ కు పట్టం గెలిచిన ఎమ్మెల్యే కూడా పవన్ కళ్యాణ్ కు షాక్ ఇస్తూ వైసిపి భజన చేశారు. అయినప్పటికీ పవన్ కళ్యాణ్ ప్రజా సమస్యల పట్ల పోరాటానికి తన వంతుగా ముందుకు వచ్చి ముందుకు సాగారు. దీంతో గత ఎన్నికల్లో పిఠాపురం నియోజకవర్గం నుంచి పోటీ చేసిన పవన్ కళ్యాణ్ కు అత్యధిక మెజారిటీ ఇచ్చి ప్రజలు పట్టం కట్టారు. పిఠాపురం ప్రజల కోసం పవన్ కీలక నిర్ణయం ఒక్క పిఠాపురం నియోజకవర్గం లోనే కాదు రాష్ట్ర వ్యాప్తంగా జనసేన పార్టీ నుంచి పోటీ చేసిన అన్ని స్థానాల్లోనూ విజయకేతనం ఎగరవేశారు. పిఠాపురం నియోజకవర్గంలో పవన్ కళ్యాణ్ గెలవడాన్ని ప్రతిష్టాత్మకంగా భావించిన జనసేన అధినేత తనను ఓట్లేసి గెలిపించిన ప్రజలను మర్చిపోకుండా తన వంతుగా వారికి వెన్నుదన్నుగా నిలిచారు. ఈ క్రమంలోనే పిఠాపురం నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి కీలక నిర్ణయం తీసుకున్నారు.

# డీఎఫ్‌వోపై విచారణకు ఆదేశాలు



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి కాకినాడ డీఎఫ్‌వో రవీంద్రనాథ్‌రెడ్డిపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ విచారణకు ఆదేశించారు. వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సూచించారు. కాకినాడ అటవీశాఖ అధికారిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రవీంద్రనాథ్‌రెడ్డి మైనింగ్ వాహనాల విషయంలో కొన్ని రకాల ఆంక్షలు విధించారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో పాటు ఆయన పేషీలోని ఉన్నతాధికారులతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని వారి పేర్లు చెప్పి మైనింగ్, అటవీశాఖ అధికారులకు ఫోన్ చేసి బెదిరిస్తున్నట్టు అభియోగాలున్నాయి. ఈ వ్యవహారంపై డిప్యూటీ సీఎంకు పలు ఫిర్యాదులు అందాయి. దీనిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన పవన్ విచారణకు ఆదేశించారు. తన పేరు, కార్యాలయం పేరుతో అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.



# లోకేశ్ ప్రజాదర్బార్‌కు బాధితుల క్యూ

● సమస్యలు పరిష్కరించాలంటూ వినతులు

మంగళగిరి : అధిక వడ్డీ పేరుతో తీవ్ర వేదింపులకు గురి చేస్తున్నారని విజయవాడకు చెందిన ఓ బాధితుడు మంత్రి నారా లోకేశ్కు ఫిర్యాదు చేశాడు. అధిక వడ్డీ వసూలుతో తీవ్రంగా నష్టపోయాయని తమకు తగిన న్యాయం చేయాలని కోరారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలోని లోకేశ్ నివాసంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ క్రమంలో విజయవాడకు చెందిన జక్క వీరస్వామి మంత్రి లోకేశ్ వద్ద తన గోడు వెళ్లబుచ్చుకున్నారు.
ఓ మహిళ వద్ద 4 ఏళ్ల క్రితం రూ.2 లక్షల అప్పు తీసుకున్నానని కానీ దానికి అసలుగా రూ.7.50 లక్షలు వసూలు చేశారని, ఇంకా మరో రూ.4 లక్షలు చెల్లించాలంటూ వేధిస్తున్నారని వీరస్వామి మంత్రి లోకేశ్కు వివరించారు. మంత్రి నారా లోకేశ్ తన నివాసంలో నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ కార్యక్రమాని రాష్ట్రవ్యాప్తంగా వివిధ సమస్యలతో బాధపడుతున్న ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ప్రతి ఒక్కరి నుంచి విజ్ఞప్తులను స్వయంగా తీసుకున్న లోకేశ్ సమస్యలను సంబంధిత శాఖలకు పంపి పరిష్కరానికి కృషి చేస్తామని వారికి హామీ ఇచ్చారు. పలు సమస్యలపై సంబంధిత అధికారులు, పోలీసులతో మాట్లాడి పరిష్కారం దిశగా చర్యలు తీసుకున్నారు.

**అందుకున్న ఫిర్యాదులు:** అనారోగ్యంతో బాధపడుతున్న తనకు సీఎం సహాయ నిధి కింద ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని ఉండవల్లికి చెందిన కె. మంగ విజ్ఞప్తి చేశారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న తన భర్తకు పెన్షన్ మంజూరు చేసి ఆదుకోవాలని తాడేపల్లిలోని సుందరయ్య నగర్కు చెందిన నాగేశ్వరమ్మ కోరారు. గత 9 దశాబ్దాలుగా గ్రామంలో కొనసాగుతున్న ప్రభుత్వ పాఠశాలను గత ప్రభుత్వం మూసివేసిందని, దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని దానిని తిరిగి పునరుద్ధరించాలని కోరుతూ ప్రకాశం జిల్లాలోని తూర్పు పెద్దివారిపాలెం, పడమర పెద్దివారిపాలెం గ్రామస్థులు లోకేశ్ను కలిసి వినతిపత్రం అందజేశారు. తీవ్ర అనారోగ్యంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న తమ కుమారుడి వైద్యానికి ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం పురుషోత్తమపట్నానికి చెందిన గాదె గోపాలకృష్ణ విజ్ఞప్తి చేశారు. దివ్యాంగురాలినైన తనకు ఎలాంటి ఆధారం లేదని, పెన్షన్ మంజూరు చేసి ఆదుకోవాలని కృష్ణా జిల్లా ఉల్లిపాలెంకు చెందిన జి.సుగుణ విన్నవించారు. సమస్యలు తీరుస్తామని హామీ: ఫిర్యాదులు అన్నీ స్వీకరించిన మంత్రి నారా లోకేశ్ తమ సమస్యలు తీరుస్తామని హామీ ఇచ్చారు. సంబంధిత అధికారులకు ఫోన్లు చేసి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు.



# పాఠశాలలకు కరెంటు బిల్లు ప్రభుత్వమే కడుతుంది

● ఇప్పటికీ వున్న ఎస్సీ- ఎస్టీ రెసిడెన్షన్సియల్ స్కూల్స్ కొనసాగిస్తాం ● డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



తెలంగాణ బ్యూరోప్రతినిధిః ప్రభుత్వ పాఠశాలలకు కరెంటు బిల్లు ప్రభుత్వమే కడుతుందని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ప్రభుత్వ పాఠశాల స్కూల్స్ బాగుకోసం కోట్ల రూపాయలు కేటాయించామన్నారు.
ఇప్పటికీ వున్న ఎస్సీ, ఎస్టీ రెసిడెన్షన్సియల్ స్కూల్స్ కొనసాగిస్తామన్నారు. ఏవి కూడా ముసేసిది లేదన్నారు. అన్నింటికీ శాశ్వత భవనాలు కల్పిస్తామన్నారు. అడ్డంకులు సృష్టించేందుకు కొంత మంది ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. ఉడుత ఊవులకు ఎవ్వరూ భయపడే పరిస్థితి లేదన్నారు. ఎవరు కూడా మేము చేసే అభివృద్దిని అడ్డుకోనివ్వం అన్నారు. పాఠశాలలకి మంచి రోడ్ల ను కూడా వేస్తున్నామన్నారు. ప్రజలకు మంచి ఏమి చేస్తే బాగుంటుంది అని ఎవ్వరూ సలహాలు ఇచ్చిన తీసుకుంటామన్నారు.
మంచి వుంటే అనుసరిస్తాం.. అమలు చేస్తామని తెలిపారు. ఇందిరమ్మ ప్రభుత్వం ప్రజల కోసం అంకితంగా పని చేస్తుందన్నారు.
మన విద్యా వ్యవస్థ ప్రపంచంతో పోటీ పడే విధంగా సిలబస్ తయారు చేసి విద్యార్థులను తయారు చేస్తామన్నారు. కులాలకు మతాలకు అతీతంగా అందరినీ కలువుకుని వుండే విధంగా స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇది సాధ్యంకాదని ప్రతిపక్షాలు అనుకున్నాయని అన్నారు. విద్య, వైద్య కు మా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తామన్నారు.
గత ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ కు 73 కోట్లు కేటాయించిందన్నారు. ఈ ఏడాది 5000 కోట్లు మా ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. సంకల్పం చిత్తశుద్ధి వుంటే ఏది సాధ్యం కాదు.. అదే మేము నిరూపిస్తున్నామని అన్నారు. మంత్రి మండలి అంతా కూర్చొని 28 స్కూల్స్ ఫౌండేషన్ వేయాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నాటి కి భవనాలు పూర్తి చేస్తామన్నారు

# ప్రభుత్వ స్థలాలను మింగి.. పార్టీ కార్యాలయాలు కట్టాడు

● బానిసలుగానే బడుగులను చూడాలనుకున్న కేసీఆర్ ● పేదలను చదువుకు దూరం చేసి బర్లు, గొర్లు కాసుకోమన్నాడు
● నీ కొడుకు, మనవడితో ఆ పని చేయిస్తావా ● గడీలు నిర్మించి.. బడులను మరిచాడు
● విద్యావ్యవస్థలో సంపూర్ణ ప్రక్షాళన తెస్తా ● రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి








రంగారెడ్డి/షాద్‌నగర్, మేజర్‌న్యూస్ (అక్టోబరు 11) : పది జిల్లాలుగా ఉన్న తెలంగాణను విభజించి 33 జిల్లాలుగా చేసిన కేసీఆర్ పేద విద్యార్థుల చదువును పక్కన పెట్టి ప్రభుత్వ స్థలాలను మింగి అక్కడ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాలను నిర్మించాడని తెలంగాణ సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి విరుచుకుపడ్డారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గంలోని కొందుర్గు మండల కేంద్రంలో నూతనంగా నిర్మించబోయే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ పదేళ్ల కాలంలో పేద విద్యార్థులు చదువుకు దూరమయ్యారని, గత ప్రభుత్వం ఐదు వేల పాఠశాలలను మూసి వేసిందన్నారు. ప్రపంచాన్ని ఏలే తెలివి తెలంగాణ ప్రజలకు ఉన్నప్పటికీ వారికి కావాల్సిన విద్యను అందించే బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు చదువుకోవడం ద్వారా ప్రశ్నించే తత్వం అలవాటు చేసుకుంటారని భావించిన కేసీఆర్ వారిని చదువుకు దూరం చేసి బానిసలుగానే ఉండే విధంగా ముందుకు పోయాడన్నారు. తెలంగాణలో ఉన్న బడుగు, బలహీనవర్గాలకు బర్రెలు, గొర్రెలు ఇచ్చి వాటి ద్వారా జీవనం సాగించాలని చెప్పిన కేసీఆర్ చదువుకున్న వారికి ఉద్యోగాలు ఇవ్వకుండా పాలన సాగించాడన్నారు. 2003 డిసెంబరు 7న తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం ఆవిర్భవించిందని, ఆనాడే నిరుద్యోగ సమస్య, నాణ్యమైన విద్య, పేదలకు వైద్యం అందిస్తామని ప్రతిజ్ఞ చేసినట్లు గుర్తుచేశారు. ఆరోగ్యవంతమైన తెలంగాణను తీర్చి దిద్దుకోవడమే తమ లక్ష్యమన్నారు. విద్యా వ్యవస్థలో సంపూర్ణమైన మార్పులు తెచ్చి పేదలకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఆ శాఖను తనవద్దే ఉంచుకున్నట్లు తెలిపారు. ఎవరితోనైనా చెలగాటం ఆడవచ్చు గానీ టీచర్లతో చెలగాటం ఆడరాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 21 వేల మంది టీచర్లకు ప్రమోషన్లు, 38 వేల మంది టీచర్లకు ఎవరికీ ఇబ్బంది కలగకుండా బదిలీలు చేశామన్నారు. ఈ ప్రయాణంలో విద్యాశాఖ అధికారులు ఎంతో కసరత్తు చేశారని వారికి ధన్యవాదాలు తెలిపారు. ప్రజల కోసం పనిచేసే అధికారులకు ఉన్నత గౌరవం లభిస్తుందని అన్నారు. బీఆర్ఎస్ పాలనలో విద్య కోసం 22 లక్షల కోట్లు ఖర్చు పెట్టిన కేసీఆర్ కనీసం గ్రామీణ ప్రాంత పాఠశాలల్లో, గురుకులాల్లో మౌలిక సదుపాయాలు కల్పించలేదన్నారు. మాజీ ప్రధాని పి.వి. నరసింహ్మా రావు 1972లో నల్గొండ జిల్లాలోని మునుగోడు మండలంలో ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలను ప్రారంభించారన్నారు. ఆ పాఠశాలలో చదివిన పేద విద్యార్థులు ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లుగా ఎదిగారని తెలిపారు. ప్రస్తుతం విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెకటరీగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఐఏఎస్ బొర్రా వెంకటేషం, గతంలో తెలంగాణ డీజీపీగా పనిచేసిన మహేందర్ రెడ్డి కూడా అదే గురుకులంలో చదివారన్నారు. కేసీఆర్ నిర్మించిన గురుకులాల్లో అగ్గిపెట్టెలో పుల్లలు పెట్టినట్లు విద్యార్థులను ఇరుకు గదుల్లో పెట్టి సరైన సదుపాయాలు కల్పించలేదన్నారు. పేద విద్యార్థుల కోసం యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేస్తుంటే బీఆర్ఎస్ నాయకులు ఓర్వలేకపోతున్నారన్నారు. బీఎస్పీ పార్టీ నుండి బీఆర్ఎస్‌లో చేరిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గురుకులాలకు సెక్రెటరీగా పనిచేసిన అనుభవముందన్నారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌పై మంచి అభిప్రాయం ఉండేదని బీఆర్ఎస్‌లో చేరగానే అతనూ వారిలా మారిపోయాడన్నారు. కేసీఆర్ ఆశించినట్లు బడుగు బలహీనవర్గాలు చదువుకు దూరంగా ఉండి బానిసల్లా బతకాలని ఆర్ఎస్ ప్రవీణ్ కోరుకుంటున్నారా అని ప్రశ్నించారు. ఇటీవల జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు ఆ పార్టీకి గుండు సున్నా ఇచ్చినా జ్ఞానోదయం కాలేదన్నారు. పేద విద్యార్థులకు కల్మషం లేకుండా నాణ్యమైన విద్యను అందించేందుకు ముందుకు వచ్చామని, అందులో భాగంగానే ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో ఈ పాఠశాలల్లో 2500 మంది పేద పిల్లలు 12వ తరగతి వరకు అన్ని వసతులతో చదువుకోవచ్చన్నారు. షాద్‌నగర్ నియోజకవర్గం అంటే తనకు ఎంతో ఇష్టమని, కొడంగల్ వెళ్లకుండా షాద్‌నగర్‌కు వచ్చానంటే మీరే అర్థం చేసుకోవాలన్నారు.



**మీ ఆలోచన నచ్చింది సార్.. :** సీఎం రేవంత్ రెడ్డి సభా ప్రాంగణంపైకి వచ్చిన కొందుర్గు జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న మణితేజ్, శృతి ముఖ్యమంత్రిని ఉద్దేశించి మాట్లాడారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక గురుకులాలు కాకుండా భిన్నత్వంలో ఏకత్వంలా సమీకృత గురుకులాలు ఏర్పాటు చేయాలనుకున్న మీ ఆలోచన మాకెంతో నచ్చింది సార్ అంటూ వారు మాట్లాడిన మాటలకు ముఖ్యమంత్రి ముగ్ధులయ్యారు. సభా సాక్షిగా ప్రమాణం చేసి చెబుతున్నాం సార్ పేద విద్యార్థుల కోసం ఇంత చేస్తున్న మీకు రుణపడి ఉంటామని ఈ రెసిడెన్షియల్ స్కూల్‌లో చదువుకొని తెలంగాణ గర్వపడేలా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, పరిగి ఎమ్మెల్యే రాంమోహన్ రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్రా వెంకటేషం, జిల్లా కలెక్టర్ శశాంక, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రజలకు దసరా శుభాకాంక్షలు

## సీఎం రేవంత్ రెడ్డి



తెలంగాణ బ్యూరోప్రతినిధిః దసరా పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సాంస్కృతిక జీవన విధానంలో దసరాకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. విజయానికి చిహ్నంగా దసరా పండుగను విజయదశమి పేరుతో దేశవ్యాప్తంగా జరువుకుంటారని తెలిపారు. దసరా రోజున కుటుంబంలోని సభ్యులందరూ ఒకే చోట చేరి సామూహికంగా సంబురాలు జరువుకోవడం తెలంగాణ సబ్బండ వర్గాల ఐక్యతకు నిదర్శనంగా నిలుస్తుందన్నారు.
శమిపూజ చేసి జమ్మి ఆకును బంగారంగా భావించి అలాయ్ బలాయ్ తీసుకోవడం.. పెద్దల ఆశీర్వాదం తీసుకోవడం.. శుభసూచకంగా భావించే పాలపిట్టను దర్శించుకోవడం తెలంగాణ ప్రాంతానికి ప్రత్యేకమని సీఎం గుర్తు చేశారు. తెలంగాణకు నిత్య విజయాలు కలిగాలని, ప్రజలందరికీ సుఖసంతోషాలను ప్రసాదించాలని సీఎం దుర్గామాతను ప్రార్థించారు.

# సిరాజ్‌కు డీఎస్‌పి పోస్టు



తెలంగాణ బ్యూరోప్రతినిధిః హైదరాబాదీ, టీమిండియా క్రికెటర్ మహ్మద్ సిరాజ్కు ఇంటి స్థలం, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని సీఎం రేవంతడ్డి అధికారులను ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది ఆగస్టు నెలలో జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 78లో 600 చదరవు గజాల స్థలాన్ని సిరాజ్కు కేటాయిస్తూ రెవెన్యూ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. తాజాగా సిరాజ్కు డీఎస్పీ పోస్టు కేటాయించారు. ఈ మేరకు రాష్ట్ర డీజీపీ జితేందర్ సిరాజ్కు డీఎస్పీ నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు శాఖకు సిరాజ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అంతర్జాతీయ క్రికెట్ భారత దేశానికి, మన తెలంగాణ రాష్ట్రనికి గొప్ప పేరు, గౌరవాన్ని తెచ్చాడంటూ మొహమ్మద్ సిరాజ్ను సీఎం అభినందించారు. టీ20 వరల్డ్ కప్ను గెలిచిన అనంతరం హైదరాబాద్కు చేరిన సిరాజ్ మంగళవారం ఉదయం రేవంతడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సిరాజ్ను సీఎం ఘనంగా సన్మానించారు. సిరాజ్ అంతర్జాతీయ క్రికెట్లో తన అద్భుతమైన ప్రతిభను ప్రదర్శిస్తున్నాడని, అందుకే ఈ రోజు అత్యున్నత స్థాయి క్రికెటర్లలో ఒకడిగా పేరు సంపాధించాడని సీఎం ప్రశంసించారు. భారత ప్లేయర్గా ఏడేండ్లుగా సేవలు అందిస్తుండటమేకాక, ఐసీసీ టీ20 వరల్డ్ కప్ టీమిండియా గెలువు బృందంలో సిరాజ్ ఉన్నారు. ఆ తర్వాత హైదరాబాద్లో అడుగుపెట్టిన సిరాజ్కు హైదరాబాద్లో క్రికెట్ అభిమానులు ఘన స్వాగతం పలికారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా సిరాజ్ను సన్మానించింది.

# పేదల ఇళ్లను కూల్చడం సరికాదు

● మూసీ పేదలకు బీజేపీ అండగా ఉంటుంది ● అన్ని అనుమతులు ఇచ్చి ఎలా కూలుస్తారు
● సీఎం రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలి ● కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి...



తెలంగాణ బ్యూరోప్రతినిధిః మూసీ పరివాహక ప్రాంతాల్లో పేదోళ్ల ఇళ్లు కూల్చడాన్ని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి మరోసారి ఖండించారు. వారికి బీజేపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో ప్రజలు ఎంతో కష్టపడి చిన్నచిన్న స్థలాలు కొనుక్కున్నారని, వారికి ప్రభుత్వమే అన్నీ అనుమతులు ఇచ్చి ఇప్పుడు కూలుస్తామని చెప్పడం దారుణమని ఆయన అన్నారు. కూల్చివేతలు అంత ఈజీ కాదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే స్వయంగా మూసీ ప్రాంతంలో పర్యటించి ప్రజలను ఒప్పించాలని డిమాండ్ చేశారు. మూసీ రిటర్నింగ్ వాల్ నిర్మించి కూడా సుందరీకరణ చేయెచ్చని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. అన్నీ డ్రైనేజీలు మూసీలోనే కలుస్తున్నాయని, కనీసం శుద్ధి జరగకుండా నేరుగా నదిలోనే మురుగునీరు కలుస్తోందని ఆయన చెప్పారు. గంగా నదిపై కేంద్ర ప్రభుత్వం అతి తక్కువ ఖర్చుతో శుద్ధి చేస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. మూసీ సుందరీకరణకు రూ.1.50లక్షల కోట్లు అవసరం లేదని స్పష్టం చేశారు. రేస్ కోర్స్ స్థలం అమ్మేసి మరీ సుందరీకరణ చేయడం సరైంది కాదని అభిప్రాయపడ్డారు. ప్లాన్ లేకుండా ఇళ్లు కూల్చివేస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పడం సరైన పద్ధతి కాదన్నారు. సీఎం దుందుడుకుగా వ్యవహరిస్తానంటే కుదరదని కేంద మంత్రి హెచ్చరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా ఇలాగే ప్రజలపై బెదిరింపులకు పాల్పడిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. హైడ్రాకు గవర్నర్ చట్టబద్ధత కల్పించడం సాధారణ ప్రక్రియ అని, బాధితులు ఎవరూ భయపడొద్దని చెప్పారు. మూసీ బాధితుల కోసం బీజేపీ పోరాటం చేస్తోందని ఆయన మరోసారి చెప్పుకొచ్చారు. ప్రజలు బలహీనులు కాదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. హైడ్రా అంటే భూతం కాదని, గతంలోనూ అక్రమ నిర్మాణాలను ప్రభుత్వం కూల్చేదని ఆయన చెప్పారు. అయితే ప్రస్తుతం దాని పేరును మార్చారని, అదే హైడ్రా అని చెప్పారు. హైడ్రా ముందుగా మూసీ నదిలో ఉన్న బస్ డిపో, మెట్రో పిల్లర్స్ను కూల్చాలని కేంద్ర మంత్రి డిమాండ్ చేశారు. వాటిని కూల్చకుండా ముందుగా పేదవారి ఇళ్లు ఎలా పడకొడతారంటూ ఆయన ప్రశ్నించారు. ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలోకి వెళ్లి అభిప్రాయాలు తెలుసుకునేందుకు సీఎం రేవంత్ రెడ్డి రావాలని డిమాండ్ చేశారు. మూసీలో కలిసే మురుగునీరు ఏం చేస్తారో ముందు సమాధానం చెప్పాలని సీఎంను డిమాండ్ చేశారు. నగరంలోని అన్ని ప్రాంతాల మురుగునీరు వచ్చి మూసీలోనే కలుస్తోందని తెలిపారు. దీనిపై సీఎం ముందుగా వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నేతలు తనను సంప్రదించారని వస్తున్న వార్తలను కిషన్ రెడ్డి ఖండించారు. తనను ఇప్పటివరకూ ఎవరూ సంప్రదించలేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జమ్మూకాశ్మీర్ ఎన్నికలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. ఆ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో 98శాతం హిందువుల ఓట్లు తమకే వచ్చాయని కిషన్ రెడ్డి చెప్పారు. కశ్మీరీ పండిట్లు మొత్తం తమకే ఓట్లు వేశారని చెప్పారు. ఆర్టికల్ 370రద్దు ఓ చరిత్ర అని, దాన్ని తిరిగి తీసికొని వచ్చే అవకాశమే లేదన్నారు. చిన్న ఘటనా చోటు చేసుకోకుండా 60 శాతం ఓటింగ్ జరిగిందని ఆయన చెప్పారు. ఫేక్ నోట్లు నియంత్రించామని, టెర్రరిజాన్ని అరికట్టగలిగామని కిషన్ రెడ్డి చెప్పుకొచ్చారు. ఐఎస్ఐపై కఠిన చర్యల కారణంగానే ఇదంతా జరిగిందని కేంద్ర మంత్రి చెప్పారు. జార్ఖండ్లో జరిగే ఎన్నికల్లోనూ తామే గెలవబోతున్నట్లు ఆశాభావం వ్యక్తం చేశారు. పాకిస్థాన్ను ప్రపంచ దేశాల ముందు దోషిగా నిలబెట్టామని, చైనా ఆహారం, ఆయుధాలు పాకిస్థాన్కు ఇస్తోందని మండిపడ్డారు. కాశ్మీర్లో పాక్ ఆటలు ఇకపై సాగనివ్వమని కిషన్ రెడ్డి హెచ్చరించారు

# నాగార్జున వ్యాఖ్యలు సరికాదు

● మంత్రి కొండా సురేఖ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకున్నారు
● మంత్రి పదవి నుంచి తప్పిస్తారన్న ప్రచారం తప్పు
● టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్



తెలంగాణ బ్యూరోప్రతినిధిః బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్పై విమర్శలు గుప్పిస్తున్న క్రమంలో హీరో అక్కినేని నాగార్జున కుటుంబంపై చేసిన వ్యాఖ్యలను తెలంగాణ అటవీ శాఖ మంత్రి కొండ సురేఖ వెనక్కి తీసుకున్నారని పీసీసీ అధ్యక్షుడు బి. మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ ఇష్యూ ఆ రోజే క్లోజ్ అయిందన్నారు. రేవంత్ కేబినెట్ నుంచి కొండా సురేఖను తప్పిస్తాంటూ జరుగుతున్న ప్రచారంలో ఏ మాత్రం వాస్తవం లేదన్నారు. ఈ అంశంపై పార్టీ అధిష్టానం సైతం ఎటువంటి వివరణ తమను కోరలేదని చెప్పారు. శుక్రవారం హైదరాబాద్లోని గాంధీ భవన్లో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ విలేకర్లతో మాట్లాడుతూ.. హీరో అక్కినేని నాగార్జున కుటుంబంపై కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు కావాలని చేసినవి కావని ఆయన స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి కేటీఆర్ వైఖరి వల్లే కొండా సురేఖ అలాంటి వ్యాఖ్యలు చేయాల్సి వచ్చిందన్నారు. అయినా ఆమె అలా మాట్లాడాల్సింది కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఇక ఇదే అంశంలో హీరో నాగార్జున కోర్టును ఆశ్రయించారని గుర్తు చేశారు. ఈ కేసులో కోర్టు ఏం చెబుతుందో చూద్దామన్నారు. అలాగే ఫిరోజ్ ఖాన్పై ఎంఐఎం దాడి ఘటనపై సైతం పీసీసీ చీఫ్ స్పందించారు. ఎంఐఎంతో స్నేహం వేరు, శాంతిభద్రతలు వేరని ఆయన పేర్కొన్నారు. ఫిరోజ్ ఖాన్పై దాడి విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లినట్లు చెప్పారు. అయితే దాడుల విషయంలో తమ ప్రభుత్వం చాలా కఠినంగా వ్యవహరిస్తుందన్నారు. అయితే ఇతర పార్టీల నుంచి పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరిన నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో కొంత ఇబ్బందికర వాతావరణం ఎదురవుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో చేరికలకు ప్రస్తుతానికి బ్రేక్ వేశామన్నారు. ఇక దసరా పండగ వేళ.. రెండో విడత కార్పొరేషన్ పదవులు కేటాయించాలని ముందుగా అనుకున్నామన్నారు. కానీ కుదరలేదని చెప్పారు. అయితే దీపావళి లోపు మాత్రం రెండో విడత కార్పొరేషన్ పదవులు కేటాయిస్తామని ఆయన స్పష్టం చేశారు. త్వరలోనే తాను జిల్లాల పర్యటనకు వెళ్తానని ఆయన ప్రకటించారు. అయితే భావితరాల భవిష్యత్ కోసమే హైడ్రా ఏర్పాటు చేశామన్నారు. మూసీ అభివృద్ధికి రూ. లక్షా యాభై వేల కోట్ల కేటాయించినట్లు వస్తున్న వార్తల్లో ఎక్కడా నిజం లేదన్నారు. అలా అని తాము ఎక్కడ ప్రకటించ లేదన్నారు. పదేళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వందేళ్ల దోపిడీ జరిగిందని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ మండిపడ్డారు

# విద్యను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్తాం

● రాష్ట్రంలో 25 వేల పాఠశాలలకు రూ.1100 కోట్లతో మౌలిక వసతులు ● జీవో 190 ద్వారా నాలుగు గురుకులాలు ఒకే కాంప్లెక్సు విద్య ● యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలకు భూమి పూజ సందర్భంగా మంత్రి పొన్నం



తెలంగాణ బ్యూరోప్రతినిధిః తెలంగాణలో నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం ముందుకు సాగుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హుస్నాబాద్కు అంతర్జాతీయ స్థాయిలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ కాంప్లెక్స్ రావడంతో విద్యా రంగంలో హుస్నాబాద్ మరింత ముందుకు తీసుకువెళతామని,.. హుస్నాబాద్ నియోజకవర్గం, కోహెడ మండలం, తంగలపల్లి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలకు భూమి పూజ చేసుకున్నామని అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ.. విద్యార్థి నాయకుడిగా మీ అందరి ఆశీర్వాదంతో హుస్నాబాద్ ఎమ్మెల్యే అయి మంత్రి అయ్యానని, విద్యా , వైద్యం , టూరిజం, పరిశ్రమలు, వ్యవసాయం, ఉపాధి కల్పన అన్నింటిపై దృష్టి సరించామని చెప్పారు. జీవో 190 ద్వారా నాలుగు గురుకులాలు ఒకే కాంప్లెక్సు విద్యను అంతర్జాతీయ స్థాయిలో తీసుకుపోవడానికి ఏర్పాటు చేశామన్నారు. నాలుగవ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు ఇక్కడే చదువుకునేల భవనాల నిర్మాణం జరుగుతుందన్నారు. విద్యా శాఖ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్ద ఉన్నప్పటికీ వివిధ విద్యా కార్యక్రమాల్లో తాను కూడా భాగస్వామిని అయ్యానని మంత్రి పొన్నం తెలిపారు. రాష్ట్రంలో 25 వేల పాఠశాలలకు రూ.1100 కోట్లతో మౌలిక వసతులు కల్పించామని, స్కూల్స్కు ఉచిత విద్యుత్, డ్రింకింగ్ వాటర్, శానిటేషన్ సిబ్బందికి జీతాలపై ప్రత్యేక చొరవ తీసుకోవడం జరిగిందన్నారు. దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న ఉపాధ్యాయులకు19 వేల ప్రమోషన్లు, 35 వేల బదిలీలు చేశామని, డీఎస్సీ ద్వారా 10 వేల మందికి నియామక పత్రాలు అందించామని చెప్పారు. గురుకులలో మెస్ బకాయిలు చెల్లించడంతో పాటు, అద్దె బకాయిలు కూడా చెల్లిస్తున్నామని, రూ. 5 వేల కోట్లతో ఈ పాఠశాలల ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవనాల నిర్మాణం జరుగుతుందన్నారు. రూ.180 కోట్లతో ఒక్కో పాఠశాల నిర్మాణం జరుగుతుందని మంత్రి తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరంలోపు ఈ పాఠశాల భవనం నిర్మాణం పూర్తి చేస్తామని, అన్ని రకాల వాతావరణానికి తగిన విధంగా ఈ భవన నిర్మాణం జరుగుతుందని మంత్రి పొన్నం స్పష్టం చేశారు. అన్ని రకాల వసతులు అంతర్జాతీయ స్థాయిలో కల్పించి తీర్చిదిద్దుతామన్నారు. ఈ ప్రాంతం అంతా ఎడ్యుకేషన్ హబ్గా మారాలని.. కస్తూర్బా పాఠశాల, మోడల్ స్కూల్ ఆ రోజులోనే తెచ్చామని చెప్పారు. ఇన్నోవేషన్ పార్క్ త్వరలోనే భూమి పూజ కార్యక్రమం ఉంటుందని, బస్వపూర్లో కృషి విజ్ఞాన కేంద్రంకు స్థల పరిశీలన చేశామని, త్వరలోనే భూమి పూజ కార్యక్రమం చేసుకుంటామన్నారు. సర్వాయి పేటలో టూరిజం హబ్, ఎల్లమ్మ చెరువు అభివృద్ధికి రూ. 37 కోట్లు కేటాయించుకున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు

# రాష్ట్ర వ్యాప్తంగా 28 ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌కు శంకుస్థాపన

● గత ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు చేసింది ఏమిలేదు
● పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తాం
● మంత్రి పొంగులేటి

తెలంగాణ బ్యూరోప్రతినిధిః లంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 28 ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ కు శంకుస్థాపన చేసుకుంటున్నామని, పేదల పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధతో పనిచేస్తోందని, విద్య వైద్యానికి ఇందిరమ్మ ప్రభుత్వం పెద్దపీట వేసిందని రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఖమ్మం రూరల్ మండలం, పొన్నెకల్లో నూతనంగా నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం అమ్మ ఆదర్శ పథకంతో రూ. 657 కోట్లతో ప్రభుత్వం వచ్చిన మూడునెల్లోనే చేపట్టి సౌకర్యాలు కల్పించిందని చెప్పారు.
గత ప్రభుత్వం 10 సంవత్సరాల్లో రాష్ట్ర ప్రజలకు చేసింది ఏమిలేదని మంత్రి పొంగులేసి విమర్శించారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు 10 వేల 6 పోస్టులు డీఎస్సీ ద్వారా ఇచ్చామని చెప్పారు. ఉపాధ్యాయుల బదిలీలతో పాటు ఉద్యోగ ఉన్నతి ఇందిరమ్మ ప్రభుత్వం కల్పించిందని, గత ప్రభుత్వం అనేక స్కూల్స్ పెట్టిందే తప్ప పక్క వసతి కల్పించడంలో విఫలమైందని ఆరోపించారు. అంతర్జాతీయ స్టా అండ్‌తో ఇందిరమ్మ ప్రభుత్వం కులమతాలకు అతీతంగా ఇంటిగ్రేటెడ్ స్కూలకు శ్రీకారం చుట్టిందన్నారు. రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాల్లో 125 నుంచి 150 కోట్లతో అద్భుతమైన స్కూల్ ఈ ప్రభుత్వం నిర్మాణం చేయబోతోందని అన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి ప్రజల నెత్తిన భారం మోపిందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రూ. 300 కోట్లతో అనేక కంపెనీలతో స్కిల్ డవలప్ మెంట్ నైపుణ్యం పెంపొందించే అవకాశం కలిపించిందన్నారు. మాటలతో కాదు ఇందిరమ్మ ప్రభుత్వం చేతలతో చేసి చూపిస్తుందని.. ప్రవేటుకు దీటుగా పేద విద్యలకు కార్పొరేట్ విద్యానందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. పేద విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి నాణ్యతతో కూడిన విద్యను అందించాలన్న లక్ష్యంతో సమీకృత గురుకులాల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. తొలి దశలో 28 నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ను తీసుకురావాలని నిర్ణయించింది. ప్రస్తుతం ఉన్న గురుకులాలను కొనసాగిస్తూనే.. అత్యాధునిక వసతులతో సమీకృత భవనాలను నిర్మించే దిశగా అడుగులు వేస్తోంది. ఈ మేరకు గురువారం ఆయా నియోజకవర్గాలతో కూడిన జాబితాను విడుదల చేయడంతోపాటు సంబంధిత ఉత్తర్వులను జారీ చేసింది. కొడంగల్, మధిర, హుస్నాబాద్, నల్లగొండ, హుజూర్నగర్, మంథని, ములుగు, పాలేరు, ఖమ్మం, వరంగల్, కొల్లాపూర్, ఆంథోల్, చాంద్రాయణగుట్ట, మంచిర్యాల, భూపాలపల్లి, అచ్చంపేట, స్టేషన్ ఘన్పూర్, తుంగతుర్తి, మునుగోడు, చెన్నూరు, షాద్నగర్, జడ్చర్ల, పరకాల, నారాయణఖేడ్, దేవరకద్ర, నాగర్కర్నూలు, మానకొండూరు, నర్సంపేటలో సమీకృత భవనాలను నిర్మించనున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. పేద విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి నాణ్యతతో కూడిన విద్యను






అందించాలన్న లక్ష్యంతో సమీకృత గురుకులాల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. తొలి దశలో 28 నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ను తీసుకురావాలని నిర్ణయించింది. ప్రస్తుతం ఉన్న గురుకులాలను కొనసాగిస్తూనే.. అత్యాధునిక వసతులతో సమీకృత భవనాలను నిర్మించే దిశగా అడుగులు వేస్తోంది. ఈ మేరకు గురువారం ఆయా నియోజకవర్గాలతో కూడిన జాబితాను విడుదల చేయడంతోపాటు సంబంధిత ఉత్తర్వులను జారీ చేసింది. కొడంగల్, మధిర, హుస్నాబాద్, నల్లగొండ, హుజూర్నగర్, మంథని, ములుగు, పాలేరు, ఖమ్మం, వరంగల్, కొల్లాపూర్, ఆంథోల్, చాంద్రాయణగుట్ట, మంచిర్యాల, భూపాలపల్లి, అచ్చంపేట, స్టేషన్ ఘన్పూర్, తుంగతుర్తి, మునుగోడు, చెన్నూరు, షాద్నగర్, జడ్చర్ల, పరకాల, నారాయణఖేడ్, దేవరకద్ర, నాగర్కర్నూలు, మానకొండూరు, నర్సంపేటలో సమీకృత భవనాలను నిర్మించనున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది.

## తెలంగాణకు నిధులు తేవడంలో

# కాంగ్రెస్, బీజేపీ విఫలం



తెలంగాణ బ్యూరోప్రతినిధి : తెలంగాణకు రావాల్సిన నిధుల కోసం పోరాడడంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఘోరంగా విఫలమయ్యాయని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. గోదావరి పుష్కరాలకు తెలంగాణకు కేంద్రం మొండి చెయ్యి చూపడంపై ఎక్స్ వేదికగా ఆయన స్పందించారు. గోదావరి పుష్కరాల కోసం కేంద్రం ఆంధ్రప్రదేశ్కి రూ.100 కోట్ల నిధులు ఇచ్చింది.. కానీ తెలంగాణకు గుండు సున్న ఇచ్చింది. మన రాష్ట్రంలో 8 మంది బీజేపీ ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా.. ఒక్క రూపాయి కూడా కేంద్రం తెలంగాణకు ఇవ్వలేదని మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్కు ప్రత్యేక నిధుల కింద రూ. 15 వేల కోట్లు మంజూరు కాగా.. తెలంగాణకు మాత్రం దక్కింది గుండు సున్నా అన్నారు. లోక్సభలో బీఆర్ఎస్ బలమైన స్థానంలో ఉండి ఉంటే.. ఈ అన్యాయాన్ని మేము ఎప్పటికీ సహించేవాళ్లం కాదన్నారు. ఎప్పటికైనా ఇంటిపార్టీ బీఆర్ఎస్సే తెలంగాణకు రక్షణ కవచం అన్నారు. తెలంగాణకు జరిగిన అన్యాయాలపై ఇప్పటికైనా ఆ పార్టీలు స్పందించాలని డిమాండ్ చేశారు.

అనాదిగా హిందువుల పండుగలన్నింటిలో అత్యంత ప్రాముఖ్యతను, గొప్పతనాన్ని, మహాత్యాన్ని సంతరించుకున్న అతి పెద్ద పండుగ ఈ విజయదశమి.ముఖ్యంగా యావత్తు హిందూ ప్రజానీకం ఈ దసరా పండుగను అత్యంత శోభయానంగా జరుపుకోవడం వెనుక ఎంతో మహత్యం, మహిమ దాగి వుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు.ఒక్క మాటలో చెప్పాలంటే ఈ దసరా పండుగ చెడు పై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా చెప్పవచ్చు.ప్రత్యేకంగా ఈ దసరా పండుగకు 9 రోజుల ముందు ప్రారంభం అయ్యే ఈ దేవీ నవరాత్రులను ఆధ్యాత్మికంగా అత్యంత మహిమాన్వితమైనవిగా హిందూ సోదర,సోదరీమణులు భావిస్తారు. అదేవిధంగా ఈ 9 రోజులు యావత్తు హిందూ సమాజం ఎంతో భక్తి,శ్రద్ధలతో ఆ జగన్మాత అయిన దుర్గాదేవిని పూజిస్తూ తమలో దాగి వున్న కామ,క్రోధ,మధ, మస్సర,మోహ,లోభ,స్వార్ధ,అన్యాయ, అసమానత,అహంకారం వంటి దుర్గుణాలను తొలగించి తమకు జ్ఞానోదయం కలిగించి మంచి బుద్ధిని ప్రసాదించమని మనసా,వాచ,కర్మణ అత్యంత త్రికరణశుద్ధితో ఆ జగన్మాతను వేడుకుంటూ వుంటారు. అయితే ఈ విజయదశమి పండుగ వెనుక ఎంతో అద్భుతమైన,అత్యంత

## అతి పెద్ద వేడుక ఈ దసరా!

పురాతనమైన చరిత్ర,వైభవం దాగి వుంది అనే మాట అక్షర సత్యం. అంతేగాకుండా ఈ దసరా పండుగ యొక్క గొప్పతనం మూడు ప్రధాన మహిమలతో ముడిపడి వుంది. ఒకటి రావణుడిపై ఆ శ్రీరామచంద్రుడు సాధించిన అఖండ విజయానికి గుర్తుగా,మరొకటి పాండవులు వనవాసానికై వెళ్తూ జమ్మి చెట్టుపై ఉంచిన ఆయుధాలను తిరిగి తీసుకోవడానికి గుర్తుగా,మూడవది బ్రహ్మ, విష్ణు,మహేశ్వరులు కలగలిసిన జగన్మాత అయిన దుర్గాదేవి మహిసాసురుడనే రాక్షసుణ్ణి వదించిన దానికి గుర్తుగా ఈ విజయదశమిని యావత్తు హిందూ సమాజం అనాదిగా అత్యంత వైభవంగా, అంచెలంచెల భక్తిభావంతో కనుల పండుగగా,అత్యంత విశేషంగా జరుపుకుంటూ వస్తున్నారు. ముఖ్యంగా ఈ దసరా పండుగ ఇంతగా అత్యంత అశేష హిందూ భక్తులచే ఆరాధింపబడటానికి కారణం ఘోర తపస్సు గావించి ఏకంగా బ్రహ్మతోనే వరాలు పొందిన మహిసాసు-రుడు అనే రాక్షసుడు విపరీతమైన,మదమెక్కిన గర్వంతో,అహంకారంతో దేవతలతో ఘోర యుద్ధం గావించి చివరకు ఇంద్ర స్థానాన్ని కైవసం చేసుకుంటాడు. దీంతో దిక్కుతోచని దేవేంద్రుడు ఈ రాక్షసుని పీడ ఎలాగైనా విరగడ గావించాలని ఈ అనంత విశ్వానికే సృష్టికర్తలు అయిన ఆ త్రిమూర్తులు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరలను వేడుకున్నాడు,వారికి తమ బాధను మొరపెట్టుకున్నాడు,విన్న వించుకున్నాడు. దీంతో ఆ త్రిమూర్తులు బ్రహ్మ,విష్ణు,మహేశ్వరలు దుర్గాదేవి రూపంలో ఉగ్రరూపం గావించి మహిసాసురుడితో ఏకంగా 9 రోజులు భీకర యుద్ధం చేసి మరీ ఎట్టకేలకు ఆ రాక్షసుణ్ణి 10 వ రోజు వదించారు. అందుకే యావత్తు హిందూ సోదర, సోదరీమణులు చెడుపై మంచి విజయం సాధించిన రోజుగా, అన్యాయంపై న్యాయం విజయకేతనం ఎగురవేసిన రోజుగా ఈ 10 వ రోజును అత్యంత గొప్పగా,అంగ,రంగ,వైభవంగా, కనుల పండుగగా,వినుల విందుగా, శోభయానంగా, అడుగడుగునా ఆధ్యాత్మికత ఉట్టిపడేలా నభూతో న భవిష్యత్ అన్న విధంగా జరుపుకుంటూ వుంటారు అనే మాట సత్య దూరం కాదు.

ఏదిఏమైన ఎవరైతే చెడు ధోరణిలో వెళ్తూ,అన్యాయమైన పంథాలో కొనసాగుతూ,తమకున్న అంగ,అర్ధ బలంతో సామాన్యులను వంచిస్తూ అందలం ఎక్కుతారో అటువంటి వారి వైభవం,అధికారం కొంత కాలమే. చివరకు ఏదో ఒక రోజు ఆ సర్వేశ్వరుని ఆగ్రహానికి, ఉగ్ర రూపానికి వారంతా గురి కావాల్సిందే,ఆ దేవ దేవుడి ముందు తల వంచాల్సిందే. అంతిమంగా వారు పతనం అయిపోవడం తథ్యం అనే వాస్తవానికి,నిగూడ రహస్యానికి ప్రబల నిదర్శనం,తార్కాణం ఈ విజయ దశమి పండుగ,వేడుక. ఏమైనా మంచి నడవడికతో,నీతి,నిజాయితీతో మసలుకునే వారికి,న్యాయమైన పంథాలో ముందడుగు వేసే వారికి తాత్కాలికంగా ఇబ్బందులు, ఆటంకాలు ఎదురైనా ఆ దేవ దేవుడి అనంత ఆశీర్వాదబలంతో వాటన్నింటిని వారు సమర్ధవంతంగా అధిగమించి ఏదో ఒక రోజు వారు విజయదుందుభి మ్రోగించడం,ఈ సమాజంలో అందరి చేత మన్ననలు పొందడం తథ్యం అనే అక్షర సత్యానికి ఓ ప్రబల నిదర్శనం ఈ విజయదశమి పండుగ. జయ జయహెూ జగన్మాత దుర్గాదేవి! జయ జయహెూ యావత్తు భారతదేశ ప్రజానీకం!

## సంక్షేమ హాస్టళ్లను సంస్కరించాలి

“నిరుపేద విద్యార్థులకు ఉత్తమ విద్యతోపాటు వసతి సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్లను ఏర్పాటు చేసింది. పాలకుల నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపంతో సంక్షేమ హాస్టళ్లు సమస్యలకు నిలయాలుగా మారాయి. దశాబ్దాల క్రితం నిర్మించిన భవనాల్లోనే నేటికీ వసతి గృహాలను కొనసాగిస్తున్నారు. ఎప్పుడు కూలుతాయోనని భయం గుప్పిట్లో విద్యార్థులు కాలం వెల్లదీస్తున్నారు. మరి కొన్ని చోట్ల అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా గదులు, మరుగుదొడ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలుచోట్ల సరిపడా సిబ్బంది లేక పర్యవేక్షణ కొరవడింది. ఏ ఒక్క హాస్టల్లో మెనూ పాటించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. అపరిశుభ్ర వాతావరణం, నాసిరకం సామగ్రితో విద్యార్థులు తరచూ ఫుడ్ ఫాయిజన్ కు గురవుతున్నారు. ఇప్పటికైనా భావిభారత పౌరులను తీర్చుదిద్దే సంక్షేమ హాస్టళ్లను చక్కదిద్దాల్సిన అవసరం ఎంతైనా వుంది.”

**అప్పన్న గొనప, 9440733620**

# అనైతికతకు అక్షరాలా బ్రాండ్ ఎంబాసిడర్

**నీరుకొండ ప్రసాద్**
**9849625610**

- అవినీతి, అబద్దాలతో పుట్టిన పత్రిక
- వరద బాధితులను ఆదుకోక పోగా రూ.వందల కోట్లు దోచేసారంటూ రాతలు
- కూటమి ప్రభుత్వం పై విషం కక్కుతూ విషపు కట్టు కథలు
- ఇంగితం జ్ఞానం లేకుండా నోటికొచ్చిన కాకి లెక్కలు
- స్వరాజకీయ ప్రయోజనాల కోసం ఇష్టానుసారం వక్రీకరణ కథనాలు

రాష్ట్ర ప్రజలు నిజాలు గ్రహించి అబద్దపు రాజును మూలన కూర్చో బెట్టినా ఆయనలో మార్పు కనబడటం లేదు.అబద్దాలతో అధికారంలో కొనసాగుదామని అనుకొనేవారి అబద్దాలు ప్రజలు అర్ధం చేసుకోవాలి.బుడమేరు వరదల కారణంగా నష్టపోయిన 4,06 లక్షల బాధిత కుటుంబాలకు రూ 602 కోట్లు ఆర్ధిక సహాయం పారదర్శకంగా అందించింది కూటమి ప్రభుత్వం. వరద భాదితులకు రూ 602 కోట్ల సాయం అందజేస్తే అందులో రూ 534 కోట్లు దుర్వినియోగం చేశారని జగన్ సాక్షి పత్రిక ఇష్టానుసారం తప్పుడు రాతలు రాయడం గర్హనీయం. కనీవినీ ఎరుగని వరద బీభత్సానికి అతలాకుతలమైన బాధితులను ఆదుకోవడానికి సియం చంద్రబాబు ఎంత శ్రమించారో దేశమంతా చూసింది.కానీ జగన్ రోత పత్రిక మాత్రం బాధితులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫల మయిందంటూ రోత రాతలు రాసింది. బుడమే-రు, వరదలో పేరుకు పోయిన అవినీతి బురదను చూసి జనం అసహ్యించుకుం టున్నా రని,సహాయ, పునరావాస చర్యల్లో టిడిపి ప్రభుత్వం ఘోరంగా విఫల మైందని, వరదలు అతలాకుతలం చేసినా ప్రభుత్వం ఎక్కడా పునరావాస కేంద్రాలు తెరవ లేదని,విజయవాడలో సగం ప్రాంతం మునిగిపోయినా పునరావాస కేంద్రాలు లేక జనం దాబాలపైన, అపార్ట్ మెంట్స్ పైనా వారం రోజులపాటు గడిపారని,పునరావాస కేంద్రాలు కాగితాల్లో తప్ప ఎక్కడా లేవని ఇలా ఇష్టాను సారం కాకి లెక్కలు, కట్టు కథలతో కూటమి ప్రభుత్వం పై విషం కక్కుతూ విషపు రాతలు రాసింది రోత సాక్షి,వరద బాధితులను ఆదుకోక పోగా వారి పేరుతో రూ.వందల కోట్లు దోచేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని,వరద బాధితులను ఆదుకోవడానికి దాతలు భారీగా ఇచ్చిన రూ.500 కోట్ల విరాళాలు హుష్ కాకే అని, విరాళాలు బారీగా వచ్చాయనుకుంటే.వాటికి మించి రూ.557కోట్ల ఖర్చుల లెక్కలు చూపించడంపై ఆరోపణలు వెల్లు వెత్తుతున్నాయని, రాష్ట్రాన్ని కుంగదీసిన వరద చంద్రబాబు ప్రభుత్వానికి కాసులు కురిపించినట్టు స్పష్టమవుతోందని ఇష్టాను సారం బరితెగించి నగ్నంగా రోత రాతలు రాసింది దిక్కుమాలిన పత్రిక.

అవినీతి, అబద్దాలతో పుట్టిన పత్రిక అబద్దాలతోనే బతుకుతుంది. నిత్యం అబద్దాలు, కట్టుకథలు, కాకి లెక్కలు రాయడానికి కూడా ఇంగితం ఉండాలి. రాజకీయ ప్రయోజనాలకోసం అవినీతి సొమ్ముతో రూ1246 కోట్ల విలువైన మీడియా సామ్రాజ్యం స్థాపించి గిట్టని ప్రభుత్వం, రాజకీయ పక్షం,పత్రికల పై విషపు రాతలు రాస్తున్నారు.సొంత మీడియా ద్వారా కూటమి ప్రభుత్వం పై వక్రీకరణ కథనాలు రాయడానికి రెండు,మూడు పేజీలు కేటాయిస్తూ నిరాధారా ఆరోపణలతో కథనాలు రాస్తున్నారు. నిజాలు దాచి నీచపు రాతలు రాయడం,ప్రత్యర్థుల పై విషం చిమ్మడం జగన్ రోత పత్రిక సాక్షికి అలవాటు అయింది. జగన్ అధికారంలో ఉన్నప్పుడు ప్రజల్ని మభ్యపెట్టేందుకు రాసిన తప్పుడు రాతలే, ఓడిపోయిన తరువాత కూడా అవే అబద్దపు నీచ,నికృష్ట రాతలు రాయడం శోచనీయం .ప్రజా ప్రయోజనాల కోసం కాకుండా తన రాజకీయ ప్రయోజనాలకోసం మీడియాను ఏర్పాటు చేసుకొని తాను ఏదో ప్రజలను ఉద్ధరిస్తున్నట్లు ప్రచారం చేస్తూ జగన్ రాజకీయ ప్రయోజ నం పొందుతున్నారు. పచ్చిగా నిజా,నిజాలతో నిమిత్తం లేకుండా పత్రికా విలువలకు తిలోదకాలు ఇచ్చి అరాచక రాతలు రాస్తున్నది రోత పత్రిక.వున్నది, లేనిది గాలి పోగేసి విషం



కక్కుతూ కథనాలు రాస్తున్నది. సాక్షి పత్రీక రాస్తున్న రోత రాతలు కింద కింద నిజం కప్పబడింది. ఇటువంటి ఉగ్ర రాతలు వల్ల ఉగ్రవాదులు వల్ల వచ్చే ప్రమాదం కన్నా,అబద్దాల రాతలు రాస్తూ ప్రజలను తప్పుదారి పట్టించాలని చూస్తున్న పత్రిక వల్లనే ప్రమాదం పొంచి వున్నది.ప్రతి అంశాన్నివక్రీకరిస్తూ తమ విధానాలే గొప్పవని,తాము మాత్రమే జనం కోసం అన్నట్లు, తమరచనా కౌసల్యం ద్వారా ప్రజలను నమ్మిం చడానికి ప్రయత్నిస్తున్నారు. అబద్దాలతో,కుతర్క వాదనలతో తాము మాత్రమే ప్రజా పక్షమని, ప్రభుత్వాన్ని బదనాం చేయడానికి పూను కొని తప్పుడు రాతలు రాస్తున్నారు.

వరద బాధితులను ఆదుకోవడానికి వచ్చిన విరాళాలు, బాధితులకు అందించిన సాయంలో అవినీతి జరిగిందంటూ జగన్ రోత మీడియా రోత రాయడం చూసి ప్రజలు ఛీ కొడుతున్నారు. దొంగ సాక్షిని అడ్డుపెట్టు కొని కోట్లు దోపిడీ చేశారని తప్పుడు రాతలు రాస్తున్నారు. కూటమి ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా బాధితులను ఆదుకొని నష్టపరిహారం అందించినా జగన్ రోత మీడియా దుష్ప్రచారం చేస్తున్నది. సీఎం చంద్రబాబు క్షేత్ర స్థాయిలో స్వయంగా నడుము లోతు నీళ్లలో జేసీబీ ల పై నిలబడి తిరిగారు. ప్రజల కష్టాలు తెలుసుకొని వారిని ఆదుకొనేందుకు రాత్రి పగలు ఎంత కష్ట పడ్డారో దేశమంతా చూసింది.నీట మునిగిన ప్రతి ఇంటినీ కూడా కడిగించారు ఆయన . తొమ్మిది రోజులు ఇంటికి ముఖం చూడకుండా కలక్టరేట్ లో ఉండి వరద బాధితులను ఆదుకున్నారు. కానీ మాజీ సియం జగన్ రెడ్డి మాత్రం ఇలా వచ్చినీళ్లలో ఫొటోల కు పోజు ఇచ్చి అలా వెళ్లిపోయారు. చుట్టపు చూపు గా ఒకసారి వచ్చి వెళ్లిన జగన్ రెడ్డి కి క్షేత్ర స్థాయి వాస్తవాలు ఏమి తెలుస్తాయి. ఎన్నడూ లేని విధంగా నెల రోజుల వ్యవధిలోనే బాధి తులకు పరిహారం అందించడాన్ని,చంద్రబాబుకు మంచిపేరు రావ డాన్ని జగన్ రెడ్డిజీర్ణించుకో లేకదొంగసాక్షితో అసత్యప్రచారం చేయిస్తున్నారు. దిగజారిరోతరాతలు రాస్తున్నారు..స్వతంత్రభారత దేశంలో ఏరాజకీయ నాయకుడు ఎదుర్కొ నన్నఅవినీతి కేసులువున్న వ్యక్తిజగన్.న్యాయప్రక్రియన ఎఅడ్డుకొంటూ 3014టైమ్స్కోర్టువాయిదాలకువెళ్లకుండా తప్పించుకొంటున్న జగన్ రెడ్డి పత్రిక బుద్ధి,జ్ఞానం లేకుండా బాబు జమానా అవినీతి ఖజానా అంటూ ఇష్టాను సారం రోత రాతలు రాయడం చూసి గురివిందలు సిగ్గు పడుతున్నాయి. జగన్ హయాం లో ప్రతిపక్షాలను తిట్టినందుకు కూడా రూ. కోట్లలో ప్రజాధనం దుర్వినియోగం చేసారు. ప్రతిపక్ష నేతలను, వారి కుటుంబంలోని మహిళలను తిట్టడమే లక్ష్యగా నెలకు లక్షల్లో వేతనాలు ఇచ్చింది రోత పత్రికకు తెలియదా?

వైసీపీ హయాంలో గోదావరి వరదల్లో మునిగిపోయిన వారికి రెండు బంగాళా దుంపలు, రెండు టమాటాలు ఇచ్చి జగన్ చేతులు దులుపుకొన్నవిషయం ఆ రోత పత్రిక గుర్తు తెచ్చుకోవాలి. సర్వే రాళ్లపై తన బొమ్మ వేసుకోవడానికి జగన్ రూ.700 కోట్లు ఖర్చు చేశారు. రుషికొండ ప్యాలెసకు రూ.600 కోట్లు, పాసు పుస్తకాలపై తన బొమ్మ వేసుకోవడానికి రూ.13 కోట్లు, సొంత పత్రికలో ప్రభుత్వ ప్రకటనలకు రూ.500 కోట్లు, ఇంట్లో ఎగ్ పఫ్‌లకు రూ.3.5 కోట్లు, తాడేపల్లిలో ప్యాలెస్ విలాసాలకు రూ.15 కోట్లు ఖర్చు చేసినట్లు సమాచారం.దీనికి ఏమి సమాధానం చెబుతుంది రోత పత్రిక. రాష్ట్ర ప్రయోజనాలు, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం చంద్రబాబు ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులను కలిసేందుకు ఢిల్లీ వెళ్లారు. జగన్ మాత్రం తన స్వప్రయోజనాల కోసం ఢిల్లీ వెళ్లారు. చంద్రబాబు ఢిల్లీ వెళ్లినప్పుడల్లా మీడియా సమావేశం ఏర్పాటు చేసి, తన పర్యటనలో సాధించిన విషయాలు వెల్లడించారు. కానీ జగన్ ఏనాడైనా ఢిల్లీ లో సాధించిన అంశాలు వెల్లడించారా? గత ఐదేళ్లలో 29 సార్లు ఢిల్లీ వెళ్లారు.వెళ్లిన ప్రతిసారి అవే అభ్యర్ధనలతో తేదీ లు మార్చి అవే ప్రకటనలు విడుదల చేస్తూ ప్రజలను మభ్యపెట్టడం తప్ప ఏమి సాదించారు.ఢిల్లీ వెళ్లిన ప్రతిసారీ శున్య హస్తాలతో తిరిగి రావడం తప్ప ఏరోజూ కూడా తాను రాష్ట్రానికి ఇది సాధించుకొచ్చానని జగన్ గర్వంగా చెప్పుకొన్న పరిస్థితి ఉన్నదా? ఆయన జగన్ సొంత ప్రయోజనాలు చూసుకున్నారే తప్ప,రాష్ట్ర, ప్రజా ప్రయోజనాలకు సంభందించిన అంశాలు ఒక్కటి సాధించలేదు. తుఫానుకి నష్టపోయిన రైతులను పరామర్శించడానికి వెళ్ళి ఒక చక్రవర్తి లాగా నీరున్న పొలంలోకి దిగి పంటలను పరిశీలించకుండా నష్టాన్ని హెలికాప్టర్ ద్వారా పరిశీలించారు . నేలపై కాలు మోపకుండా , కనీసం పొలం గట్టు కైనా వెళ్లకుండా జాతీయ రహదారి పై నుంచే పంట నష్టాన్ని పరిశీలించడానికి వీలుగా తుఫాను బాధిత రైతులను పరామర్శించడానికి వచ్చిన జగన్ హెలిప్యాడ్‌లో రెడ్‌కార్పెట్‌తో స్వాగతం పలికించుకొన్నారు.. ఇప్పుడు వరదలతో రాష్ట్రం అతలాకుతలమైపోతుంటే జగన్ రెడ్డి అడ్రస్ ఎక్కడా కనిపించలేదు. కానీ జగన్ రోత మీడియా మాత్రం వికృతంగా విషపు రాతలు రాస్తుంది.బురద రాజకీయం చేసి బతకాలనుకోవడం వైసీపీ గతిమాలిన రాజకీయాలకు నిదర్శనం.రోత పేపర్ ఎన్ని రోత రాతలు రాసినా ఆపద సమయంలోఅండగా నిలబడి ఆదుకున్నది ఎవరో ప్రజలు గ్రహించలేనంత అమాయకులు మాత్రం కాదు. ప్రజలు ఛీ కొట్టినా మీ బుద్ధి మారక పోవడం మీ ఖర్మ.

# అసమానతల భారతం - అస్తవ్యస్తంగా ఆర్థిక వ్యవస్థ

**విద్య వెంకట్**
**తెలంగాణ బ్యూరో 9391618181**

- పౌష్టిక ఆహార లోపంతో నిరుపేదలు
- నిరుద్యోగంతో కొట్టుమిట్టాడుతున్న యువత
- నిరాశ నిస్పృహలకు లోనవుతున్న ప్రజలు
- పేదవాడి ఆర్థిక స్థితిగతులు ఎక్కడ వేసిన గొంగళే
- కార్పొరేట్ల ఆదాయం నానాటికి రెట్టింపవుతున్న వైనం
- చక్క పెట్టాల్సిన కేంద్ర ప్రభుత్వం చోద్యం చూస్తున్న తీరు

దేశ ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. దేశ ఆర్థిక వ్యవస్థను పరుగులు పెట్టిస్తున్నామని పదేపదే ప్రగల్భాలకు పోతున్న ఎన్డీఏ సర్కార్ దీనికి భిన్నంగా దేశంలో భారీగా నిరుద్యోగం పెరుగుతోంది. ద్రవ్యోల్బణం అదుపు తప్పింది. పిల్లలకు పోషకాహారం దొరకడం లేదు. ఫారెక్స్ నిల్వలు హరించుకుపోతున్నాయి. వాణిజ్య లోటు పెరిగిపోయింది. పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపి) ఐదు మాసాల కనిష్టానికి పడిపోయింది. 2015-2023 మధ్యకాలంలో 18 లక్షల సూక్ష్మ చిన్న మధ్యతరహ పరిశ్రమలు (యంఎస్‌యంఇ) మూతపడి 54 లక్షల మంది ఉపాధి కోల్పోయారు. శ్రామిక శక్తి గణనీయంగా తగ్గింది. రుణభారం పెరిగిపోతుంది. విదేశీ నిధులు రావడం లేదు. రూపాయి మారక విలువ పడిపోయింది. ప్రజల ఆదాయాలు తగ్గడంతో ప్రజల కొనుగోలు శక్తి క్షీణించింది. పర్యవసానంగా పేదల సంఖ్య పెరిగిపోతుంది. 2023-24లో వృద్ధిరేట్ 8.2 శాతం ఉండగా ఆర్థిక సర్వే 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఆర్థిక వృద్ధిరేట్‌ను 6.5 నుంచి 7 శాతానికి పరిమితం చేసిందని తెలుస్తోంది. పేదరికం, రుణభారం అధిగమించకుండా ఆర్థికాభివృద్ధి అసాధ్యమని ప్రపంచ బ్యాంక్ అభివృద్ధి నివేదిక-2024 పేర్కొంది. కాలం చెల్లిపోయిన విధానాలపై ఆధారపడడం అభివృద్ధికి ఆటంకంగా ఉందని ప్రపంచ బ్యాంక్ పేర్కొంది. అమెరికా తలసరి ఆదాయంలో కేవలం మూడోవంతు చేరుకోవాలన్నా భారత్‌కు సుమారు 75 సంవత్సరాలు పడుతుందని బ్యాంక్ తెలిపింది. బ్రిటిష్ వలసవాదుల నుండి అధికార బదిలీ జరిగి 77 సంవత్సరాలు గడిచినా నిరుద్యోగం, పేదరికం, అసమానతలు, విద్యా, వైద్యం, జీవన భద్రత వంటి సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. అంతర్జాతీయంగా ఎన్ని సూచనలు చేసినా పాలకులు పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా బిజెపి ప్రభుత్వం సమస్యల తీవ్రతను పెంచుతుంది. సామాజిక అసంతృప్తి పెరుగుతోంది. భారత ఆర్థిక వ్యవస్థ అద్భుతంగా పురోగమిస్తోందని, వినియోగదారులు, ఉత్పత్తిదారులు భవిష్యత్తు పట్ల ఆశాజనకంగానూ, విశ్వాసంగాను ఉన్నారని ఆర్‌ఎస్‌ఎస్, గోడీ మీడియా విస్తృతంగా ప్రచారం సాగిస్తోన్నారు. ఇందుకు భిన్నంగా వాల్‌స్ట్రీట్ జర్నల్ భిన్నమైన కథనాన్ని రాసింది. భారత ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, ప్రజల కొనుగోలు శక్తి గణనీయంగా తగ్గిందని దీని ప్రభావం మార్కెట్‌పైన, ఉత్పత్తిపైన పడుతుందని పేర్కొంది. 2024-25 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో జిడిపి వృద్ధి 6.5 శాతానికి పడిపోయిందని పేర్కొంది. మార్కెట్‌లో కొనుగోళ్లు తగ్గడం వల్ల ఉత్పత్తి కార్యక్రమాలపై ప్రభావం చూపుతోందని, నిరుద్యోగానికి ఉపాధి రహిత స్థితికి కారణమవుతోందని వాల్‌స్ట్రీట్ జర్నల్ విశ్లేషణ చేసింది.

ఎన్డీయే కూటమి ప్రభుత్వం మూడోసారి కూడా అధికారంలోకి వచ్చింది. స్వంత బలం లేకున్నా సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. కానీ దేశ ఆర్థికవ్యవస్థ మాత్రం గాడిలో పడటం లేదు. ప్రజలు పీకల్లోతు అప్పుల్లో, కష్టాల్లో కూరుకుపోతున్నా సర్కారు కార్పొరేట్లకే జై కొడుతోంది. ఆర్థిక వృద్ధి అంటే సెన్సెక్స్ పరుగులు పెట్టడం కాదన్న విషయాన్ని ప్రభుత్వతం అర్థం చేసుకోలేకపోతోంది. ఫలితంగా దేశ ఆర్థికవ్యవస్థ రోజురోజుకూ దిగజారుతూనే ఉంది. ప్రజల వినియోగ వ్యయం గణనీయంగా పడిపోతోంది. దూరపు కొండలు ఎప్పుడూ నునుపే. దూరం నుండి చూస్తే అంతా అందంగా, అత్యద్భుతంగా ఉన్నట్లు కన్పిస్తుంది. ‘మేడి పండు చూడ మేలిమై ఉండును... పొట్ట విప్పి చూడు పురుగులుండు’ అన్న చందంగా మన ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది..భారత ఆర్థిక వ్యవస్థ మందగించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) ఏప్రిల్ నుంచి జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో స్థూల దేశీయోత్పత్తి (జిడిపి) వృద్ధి 6.7 శాతానికి పడిపోయింది.15 నెలల కనిష్టానికి క్షీణించిందని స్వయంగా కేంద్ర ప్రభుత్వ గణాంకాల మంత్రిత్వ శాఖనే వెల్లడించింది. ఆర్‌బిఐ అంచనాలు మించి జిడిపి పతనం కావడం ఆర్థిక వ్యవస్థ పట్ల ఆందోళన కలిగిస్తోంది. జూన్ త్రైమాసికంలో భారత జిడిపి 7.1 శాతం పెరగొచ్చని ఇటీవలే ఆర్‌బిఐ అంచనా వేసింది. 2024-25లో స్థూలంగా 7.2 శాతంగా ఉండొచ్చని తెలిపింది. దీనికి భిన్నంగా కేంద్ర గణాంకాల మంత్రిత్వ శాఖకు చెందిన నేషనల్ స్టాటిస్టికల్ ఆఫీసు (ఎన్‌ఎస్‌ఒ) ఫలితాలను వెల్లడిరచడం విశేషం. జిడిపి పడిపోతుందంటే దేశంలో ఆర్థిక కార్యకలాపాలు సన్నగిల్లుతున్నాయని అర్థం. ఎన్‌ఎస్‌ఒ గణాంకాల ప్రకారం... గడిచిన క్యూ1లో వ్యవసాయ రంగం వృద్ధి ఏకంగా 2 శాతానికి పడిపోవడం ఆందోళకరర అంశం. ఈ రంగం 2023-24 ఇదే త్రైమాసికంలో 3.7 శాతం వృద్ధిని కనబర్చింది. ఇదే సమయంలో ఆర్థిక సేవలు, రియల్ ఎస్టేట్, ప్రొఫెషనరల్ సర్వీసెస్ రంగాలు 12.6 శాతం వృద్ధిని కనబర్చగా గడిచిన క్యూ1లో 7.1 శాతానికి మందగిం చాయి. ఆరోగ్యవంతులు కలిగిన దేశంలో అభివృద్ధి వేగంగా జరుగుతుంది. ఆరోగ్యతంలో



పోషకాహారం కీలకపాత్ర వహిస్తుంది. పౌష్టికాహార లోపం భారంతో మనదేశం గణనీయమైన సవాలును ఎదుర్కొంటోంది. ఈ సమస్య దేశంలోని సామాజిక, ఆర్థిక సాంస్కృతిక వ్యత్యాసాల సంక్లిష్ట మిశ్రమంతో ముడిపడి ఉంది. పోషకాహార లోపం అనేది ఐదేళ్ల కంటే తక్కువైన పిల్లల్లోను, గర్భిణీ స్త్రీలలోనూ, యుక్త వయస్సు వారిలో ఎక్కువగా ఉంటుంది. ఒక వ్యక్తి ఒక సంవత్సరం వ్యవధిలో రోజువారీ కనీస ఆహార శక్తి అవసరాలను తీర్చడానికి తగినంత ఆహారాన్ని పొందలేకపోవడాన్ని పౌష్టికాహార లోపం అని అంతర్జాతీయ సంస్థలు నిర్వచించాయి. పోషకాహార లోపాన్ని వేస్టింగ్ (ఎత్తుకు తగ్గ బరువు లేకపోవడం), స్టంటింగ్ (వయసుకు తగ్గ ఎత్తు లేకపోవడం), తక్కువ బరువు కలిగి ఉండడం, విటమిన్లు మినరల్స్ లోపాలు అనే నాలుగు రకాలుగా వర్గీకరించవచ్చు. ముఖ్యంగా మౌలిక సదుపాయాల కల్పన, పరిశ్రమలలో ప్రభుత్వ వ్యయం, యువతలో నైపుణ్యాభివృద్ధి, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడం, ఉపాధి అవకాశాలను సృష్టించడం వంటి సకారాత్మక చర్యలు చేపడితేనే, ప్రపంచ పారిశ్రామిక ఉత్పాదక శక్తిగా దేశాన్ని కీలకస్థానంలో నిలపడంతో ప్రధాన పాత్ర పోషిస్తాయి. మోడీ 10 సంవత్సరాల పాలనలో దేశం పారిశ్రామిక, ఉత్పాదకతకు దారితీయలేదు సరికదా, స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించడం, పెట్టుబడులను ఆకర్షించడం - మేక్ ఇన్ ఇండియా ప్రచారం వంటి పథకాలు ప్రారంభానికి కూడా నోచుకోలేదు. దేశంలో నెలకొన్న పేదరికాన్ని తగ్గించే విషయంలో కేవలం ఉత్పాదకత ఒక్కటే సరిపోదు. వివిధ రంగాలను వివిధ ప్రాంతాలలో అభివృద్ధి చేయవలసి ఉంది. ముఖ్యంగా అభివృద్ధి అత్యధికంగా పట్టణ ప్రాంతాలలో కేంద్రీకృతమై ఉండకూడదు. ఆర్థిక అభివృద్ధి దీర్ఘకాలిక ప్రక్రియ వృద్ధిగా మాత్రమే కాకుండా, నిర్మాణాత్మకతో కూడినదై ఉండాల్సింది.

విద్యుత్, గ్యాస్, నీటి సరఫరా, ఇతర యుటిలిటీ సర్వీసెస్ రంగాలు 10.4 శాతం పెరిగాయి. ఈ రంగాలు గతేడాది ఇదే జూన్ త్రైమాసికంలో 3.2 శాతం మాత్రమే వృద్ధిని కలిగి ఉన్నాయి. వాణిజ్యం, హెూటళ్లు, రవాణా, కమ్యూనికేషన్స్ అండ్ సర్వీసెస్ విభాగాల వృద్ధి ఏకంగా 5.7 శాతానికి మందగించింది. ఈ రంగం గతేడాది ఏకంగా 9.7 శాతం వృద్ధిని నమోదు చేసింది. దేశ ఆర్థిక వ్యవస్థలో అత్యంత ముఖమైన ఎనిమిది కీలక రంగాలు డిమాండ్ లేకపోవడంతో పడకేశాయి. ప్రస్తుత ఏడాది జూలైలో కీలక రంగాల వృద్ధి 6.1 శాతానికి పరిమితమయ్యింది. 2023 ఇదే మాసంలో బొగ్గు, ముడి చమురు, సహజ వాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువులు, స్టీల్, సిమెంట్, విద్యుత్ లాంటి ఎనిమిది కీలక రంగాలు 8.5 శాతం వృద్ధిని నమోదు చేశాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జూలై కాలంలో ఈ రంగాలు 6.1 శాతం మాత్రమే పెరిగాయి. మొత్తం పారిశ్రామిక ఉత్పత్తి సూచీలో ఈ రంగాలు ఏకంగా 40.27 శాతం వాటాను కలిగి ఉన్నాయి. ఇంతటి ప్రాధాన్యత గల రంగాల వృద్ధి పడిపోవడం ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపనుంది. ఎన్డీయే ప్రభుత్వం సామాన్యులనే కాదు నిరుద్యోగ యువతనూ నిలువునా ముంచేసింది. వారి ఆశలపై నీళ్లు చల్లింది. 2014లో సంవత్సరానికి కోటి ఉద్యోగాలు ఇస్తామంటూ తీయని కబుర్లు చెప్పి చివరికి మొండిచేయి చూపింది. మోడీ పాలనలో ఉద్యోగాలు వస్తాయని, తమ జీవితాలు బాగుపడతాయని, కుటుంబాలు చల్లగా ఉంటాయని ఎన్నో కలలు కన్న యువతను తీవ్రంగా నిరాశ పరిచింది. దేశంలోని నిరుద్యోగ యువతలో మూడిరట రెండు వంతుల మంది విద్యావంతులే. అయినప్పటికీ వారి అర్హతలకు తగిన ఉద్యోగాలు లభించడం లేదు. చదివిన చదువులకు, చేస్తున్న ఉద్యోగానికి సంబంధమే లేకుండా పోతోంది. జీవనోపాధి కోసం ఏదో ఒక ఉద్యోగం సంపాదించినా ఆదాయం అంతంత మాత్రంగానే ఉంటోంది. బతుకు బండి లాగడమే దుర్భరంగా మారింది. పొరుగు దేశాలతో పోలిస్తే గత సంవత్సరంలో మన దేశంలోనే నిరుద్యోగ రేటు అధికంగా ఉన్నదని ప్రపంచ బ్యాంక్ తెలిపింది. నిరుద్యోగ రేటు మన పొరుగున ఉన్న పాకిస్తాన్‌లో 11.3 శాతం, బంగ్లాదేశ్‌లో 12.9 శాతం, భూటాన్‌లో 14.4 శాతం ఉండగా మనదేశంలో 23.22 శాతంగా ఉంది. దేశంలో నిరుద్యోగమే అతి పెద్ద సమస్య అని చెప్పవచ్చు. ఐక్యరాజ్యసమితి ప్రపంచ ఆహార భద్రత పోషకాహార స్థితి తాజా నివేదిక 2024 ప్రకారం దేశజనాభాలో 55.6 శాతం ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం అందుబాటులో లేదు. ఐదేళ్ల వయస్సు కంటే తక్కువ ఉన్న పిల్లల్లో వేస్టింగ్ 18.7 శాతం, స్టంటింగ్ 31.7 శాతం. తక్కువ బరువు 27.4 శాతం పిల్లలు ఉన్నారని తెలిపింది. 15 నుండి 49 మధ్య వయస్సు మహిళలో పోషకాహారలోపం 18.7 శాతం ఉంది. దేశ జనాభాలో సరైన ఆహారం లభ్యంకాక 16.6 శాతం పోషకాహార లోపంతో ఉన్నారని, కనీసం 38 శాతం అనారోగ్యకరమైన ఆహారాన్ని తింటున్నారని ఈ యేడాది మే 29న విడుదల చేసిన గ్లోబల్ ఫుడ్ పాలసీ రిపోర్టు 2024 తెలిపింది. అనాథ పిల్లలు, వృద్ధులు ఎక్కువ శాతంలో పోషకాహార లోపానికి గురవుతారు. గిరిజనులు, సామాజికంగా వెనుకబడినవారు. మురికివాడ నివాసితులు, సంచార జాతులు తదితర వారికి తగినంత ఆర్థిక పరిపుష్టి లేక సమతుల్య ఆహారాన్ని పొందలేకపోతున్నారు. పారిశుద్ధ్యం, పరిశుభ్రత పద్ధతులు వ్యాధులకు కారణమయ్యే పరాన్న జీవులకు గురికావడాన్ని పెంచుతుంది. ఇవి శరీరంలోని పోషకాల శోషణ వినియోగాన్ని ప్రభావితంచేసి పోషాకాహార లోపాన్ని పెంచుతున్నాయి. జాతీయ ఆరోగ్య విధానం 2025 నాటికి ప్రభుత్వ ఆరోగ్య వ్యయాన్ని జిడిపిలో ప్రస్తుతమున్న 1.2 శాతం నుండి 2.5 శాతానికి పెంచాలన్న సిఫార్సును అమలుచేయాలి. పోషకాహారం, ఆహారభద్రత, పేదరికం ఒకదానితో మరొకటి విడదీయరాన్ని సంబంధం కలిగి ఉంటాయి. ముఖ్యంగా పిల్లల్లో శారీరక, మానసిక అభివృద్ధి జరగక అభ్యాస సామర్థ్యాలు, విద్యాపనితీరు సరిగా జరగదు. యుక్త వయస్సులో పోషకాహార లోపం వల్ల ఉత్పాదకత తగ్గి దేశ జిడిపి తగ్గుతుంది. రక్తహీనత తల్లులు అనారోగ్య శిశువులకు జన్మనిచ్చి పోషకాహార లోపం తరచుగా ఆర్థికంగా అట్టడుగు, వెనుకబడిన వర్గాలను ప్రభావితం చేస్తుంది. ఇది సామాజిక అసమానతలను పెంచుతుంది.

సామాజిక, రాజకీయ, సాంస్కృతిక, ఆర్థిక పరమైన అంశాల ఉమ్మడి ఫలితమే ఆర్థికాభివృద్ధి. ఆర్థిక కారకాలు, సంస్థలు, వ్యవస్థలు ఉమ్మడి ప్రగతి వ్యూహంతో ముందుకు సాగితేనే ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుంది. ఆర్థికవృద్ధి అనేది పరిణామాత్మక మార్పులను సూచిస్తే, ఆర్థికాభివృద్ధి అనేది గుణాత్మక మార్పులనూ సూచిస్తుంది. అయితే, ఒక దేశంలో అభివృద్ధి ఏ మేరకు జరిగిందో తెలుసుకోవడానికి ఉపయోగించే వాటిని అభివృద్ధి సూచికలు అంటారు. సమగ్ర అభివృద్ధి సూచీని ఆర్థికవేత్తలు 11 కొలమానాల ఆధారంగా రూపొందించారు. అవి... ఆరోగ్యం, పౌష్టికాహారం, విద్య, ఉద్యోగిత, కమ్యూనికేషన్స్, మౌలిక పారిశ్రామిక వస్తువుల వినియోగం, మన్నిక గల వస్తువుల వినియోగం, పట్టణీకరణ, తలసరి ఆదాయం, సామాజిక వ్యక్తిగత సంక్షేమం, ఇతర సేవలు. జాతీయ ఆదాయం పెరుగుదల ఆర్థికాభివృద్ధి సూచి కాదని చెప్పాలి. సంక్షేమం ఆర్థిక శాస్త్రం (వెల్ఫేర్ ఎకనామిక్స్) మొత్తం సమాజ శ్రేయస్సును సూక్ష్మ ఆర్థిక పద్ధతుల ద్వారా అంచనా వేస్తుంది. సమాజ సంక్షేమం, ప్రజల శ్రేయస్సును కొలువడానికి ఉపయోగపడుతుంది. ఆర్థికాభివృద్ధి అనేది ఒక దేశం సామర్థ్యాలను అంచనా వేయడానికి, అందుబాటులో ఉన్న వనరులను ఉపయోగించడం కోసం కార్యచరణను రూపొందించడానికి, తద్వారా సమాజ శ్రేయస్సును మెరుగుపరచడానికి దోహదపడుతుంది.

(మిగతా రేపటి సంచికలో)

పాఠకులు, విశ్లేషకులు, రచయితలు తమ రచనలు క్రింది చిరునామాకు గానీ సూర్య దినపత్రిక ఎడిటోరియల్ మెయిల్ ఐడికి గాని పంపవలసినదిగా మనవి మెయిల్ :
suryaeditpage@gmail.com


SPR publications, Surya Soudha, Plot.No: 185, M.C.H. NO.258/1/185, siddi vinayaka nagar, Ayyappa Society Opp: Hi-Tech City, Hyderabad - 500 072.

# నష్టాల్లో ముగిసిన సూచీలు

**సెన్సెక్స్ 230 పాయింట్లు, నిఫ్టీ 34 పాయింట్లు నష్టం.**

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు, ఫైనాన్షియల్ స్టాక్స్లో అమ్మకాల ఒత్తిడి సూచీలను పడేశాయి. క్యూ2 ఫలితాల్లో అంచనాలు అందుకోక పోవడంతో టీసీఎస్ షేర్లు 1.93 శాతం నష్టంతో రూ.4,146 వద్ద ముగిశాయి. టాటా ట్రస్ట్ ఛైర్మన్గా నోయల్ టాటా నియామకం నేపథ్యంలో ట్రెంట్ షేర్లు 3 శాతం మేర రాణించి రూ.8231 వద్ద స్థిరపడ్డాయి. సెన్సెక్స్ ఉదయం 81,478.49 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 81,611.41) వద్ద నష్టాల్లో ప్రారంభమైంది. కాసేటికి స్వల్ప లాభాల్లోకి వచ్చినప్పటికీ.. తర్వాత నష్టాల్లోకి జారుకుంది. చివరికి 230.05 పాయింట్ల నష్టంతో 81,381.36 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 34.20 పాయింట్ల నష్టంతో 24,964.25 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ జీవనకాల కనిష్ఠ స్థాయి అయిన 84.07 డాలర్లకు చేరింది.

సెన్సెక్స్లో టీసీఎస్, మహీంద్రా అండ్ మహీంద్రా, ఐసీఐసీఐ బ్యాంక్, మారుతీ సుజుకీ, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. హెచ్సీఎల్ టెక్నాలజీస్, టెక్ మహీంద్రా, జేఎస్డబ్ల్యూ స్టీల్, హిందుస్థాన్ యూనిలీవర్, ఇన్ఫోసిస్ షేర్లు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 78.95 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 2654.90 డాలర్ల వద్ద కొనసాగుతోంది.




## డైసన్ వెట్ ఫ్లోర్ క్లీనర్ వచ్చేసింది




డైసన్ తమ మొట్టమొదటి పూర్తి కార్డ్-ఫ్రీ వెట్ ఫ్లోర్ క్లీనర్ అయిన డైసన్ వాష్జి 1 ని విడుదల చేస్తున్నట్లు వెల్లడించింది. పరిశుభ్రమైన స్వచ్ఛత మరియు నిర్వహణ కోసం రూపొందించబడిన, డైసన్ వాష్జి1 వెట్ ఫ్లోర్ క్లీనర్, పూర్తి స్వచ్ఛత అనుభూతి కోసం తడి మరియు పొడి చెత్త సమస్యలను ఒకేసారి పరిష్కరిస్తుంది. 1-లీటర్ క్లీన్-వాటర్ ట్యాంక్తో, డైసన్ వాష్జి1 తడి మరియు పొడి చెత్తను ఒకేసారి తొలగించడానికి ఆర్ద్రీకరణ, శోషణ మరియు వెలికితీత సాంకేతికతల కలయికను ఉపయోగిస్తుంది-ఆటోమేటిక్గా దానిని వేరు చేస్తుంది, కాబట్టి నిర్వహణ మరింత పరిశుభ్రంగా ఉంటుంది. అలాగే, ఇది ఒక్కసారి ఛార్జింగ్ చేస్తే 3100చ.అడుగులను శుభ్రం చేస్తుంది. డైసన్ వద్ద డైసన్ హోమ్ ఇంజనీరింగ్ వైస్ ప్రెసిడెంట్, చార్లీ పార్క్ మాట్లాడుతూ "మనలో చాలా మంది తమ ఇళ్లను క్రమం తప్పకుండా వాక్యూమ్ క్లీనింగ్ చేస్తుంటారు. తడి బట్టతో శుభ్రపరచడం అనేది ప్రపంచవ్యాప్తంగా అవసరమైన పనిగా పరిగణించబడుతున్నప్పటికీ, పరిశుభ్రత యొక్క అస్పష్టమైన భావనకు మించి మనం ఆ పని ఎందుకు చేస్తున్నామో మనలో చాలా మందికి తెలియదు. నిజానికి, నీటితో శుభ్రపరచడం అనేది రీహైడ్రేట్ చేయడం కోసం మరియు కఠినమైన, మొండి మరకలను తొలగించడానికి అది అవసరం. సంవత్సరాలుగా, ఈ పనిని చేయటంలో మనకు సహాయపడటానికి వెట్ ఫ్లోర్ క్లీనింగ్ ఫార్మాట్లకు సంబంధించి విస్తృత శ్రేణి ఉద్భవించింది, అయితే మరకలను తొలగించటం, పిక్-అప్ పనితీరు మరియు ఫ్లోర్ ఫినిషింగ్ విషయంలో వినియోగదారుల అంచనాలు తరచుగా చేరుకోలేవు. ఇతరులు విస్మరించే సమస్యలను డైసన్ ఇంజనీర్లు పరిష్కరిస్తారు. మెరుగైన సాంకేతికతను సృష్టించే సవాలుతో మేము అభివృద్ధి చెందాము. ఈ ప్రయత్నాల ఫలితం, డైసన్ వాష్జి1 బీ కఠినమైన నేలను సరిగ్గా మరియు పరిశుభ్రంగా శుభ్రపరచటానికి మా మొదటి వెట్ మెషీన్ ఇది' అని అన్నారు.

## ఫరెవర్ న్యూ బ్రాండ్ అంబాసిడర్గా త్రిప్తి డిమ్రీ




హైదరాబాద్ : మెల్బోర్న్కు చెందిన ప్రీమియం మహిళల ఫ్యాషన్ బ్రాండ్ ఫర్ఎవర్ న్యూ, బాలీవుడ్ నటి త్రిప్తి డిమ్రీని తమ కొత్త గ్లోబల్ బ్రాండ్ అంబాసిడర్గా ప్రకటించింది. ఆమె ఆకర్షణీయమైన ఆన్-స్క్రీన్ ఉనికి మరియు ఆకట్టుకునే శైలికి ప్రసిద్ధి చెందిన త్రిప్తి ఇప్పుడు భారతదేశం, ఆస్ట్రేలియా, కెనడా, దక్షిణాఫ్రికా మరియు యూరప్తో సహా ప్రధాన మార్కెట్లలో ఫరెవర్ న్యూకు ప్రాతినిధ్యం వహించనుంది. ఆమె తాజా, ఆకర్షణీయమైన , యవ్వన శక్తి , ఫరెవర్ న్యూ లక్ష్యంగా చేసుకున్న వినియోగదారులు - చక్కదనం మరియు సమకాలీన శైలికి విలువ ఇచ్చే యువ, ఫ్యాషన్-ఫార్వర్డ్ మహిళల నడుమ సంపూర్ణంగా ప్రతిధ్వనిస్తుంది. తాజా ఫ్యాషన్ ధోరణుల పట్ల త్రిప్తి కి ఉన్న అవగాహన మరియు యువతతో కనెక్ట్ అయ్యే ఆమె సామర్థ్యం, బ్రాండ్కు ఆమెను ఆదర్శ ప్రాయమైన ఎంపికలా మలిచింది, ఆధునిక చిక్ లుక్ తో శాశ్వత అధునాతనతను మిళితం చేసే ఫరెవర్ న్యూ యొక్క తత్వానికి సజావుగా సరిపోతాయి. ఆమె ప్రభావం బ్రాండ్ యొక్క ఉనికిని విస్తృత శ్రేణి ప్రేక్షకులకు చేరువ చేస్తుంది మరియు ప్రముఖ ఫ్యాషన్ బ్రాండ్గా దాని స్థానాన్ని పటిష్టం చేస్తుంది. ఈ భాగస్వామ్యంపై త్రిప్తి మాట్లాడుతూ, "నేను ఎల్లప్పుడూ కొత్త సొబగులు మరియు ఆధునిక ఫ్యాషన్ల సమ్మేళనంగా నిలిచే ఫరెవర్ ను ఆరాధిస్తాను-ఇది నిజంగా నా వ్యక్తిగత శైలిని ప్రతిబింబిస్తుంది. నేను నిజంగా ఇష్టపడే బ్రాండ్కి గ్లోబల్ బ్రాండ్ అంబాసిడర్గా మారడం నాకు లభించిన ఒక అద్భుతమైన గౌరవంగా భావిస్తున్నాను. నేను ఈ ప్రయాణంలో భాగమైనందుకు నేను థ్రిల్డా ఉన్నాను మరియు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఫ్యాషన్ ప్రేమికులకు ఈ అద్భుతమైన సేకరణను కలెక్షన్ పరిచయం చేయడానికి ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను " అని అన్నారు.

## యూపిఐతో ట్రూ కాల్లో పేరు ధృవీకరణ




బెంగళూరు : దేశము ప్రీమియం యూజర్స్ అందరికి ట్రూకాలర్ బ్లూ టిక్ ధృవీకరణను ప్రారంభించింది. యూజర్స్ వారి సరైన పేర్లను ధృవీకరించుటకు ప్రభుత్వ-మద్దతు ఉన్న యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్ఫేస్ (యూపిఐ) ద్వారా తమ గుర్తింపును ధృవపరచుటకు కొత్త వెరిఫైడ్ బ్యాడ్జ్ సర్వీస్ వీలుకలిగిస్తుంది. ఈ కొత్త ఫీచర్ ప్రారంభము గురించి మాట్లాడుతూ, రిషిత్ ఝున్?ఝున్?వాలా, చీఫ్ ప్రాడక్ట్ ఆఫీసర్ మరియు ఎండి, ఇండియా, ట్రూకాలర్ ఇలా అన్నారు, "కొత్త వెరిఫైడ్ బ్యాడ్జ్ తమ గుర్తింపులను ఏర్పరచుకొనుటకు ధృఢమైన మరియు నమ్మకమైన విధానాలను కోరుకునే మా పీమియం యూజర్స్ నుండి వచ్చిన ఫీడ్?బ్యాక్ కు ప్రత్యక్ష స్పందన. యూపిఐ-ఆధారిత ధృవీకరణను ఏకీకృతం చేయడం ద్వారా, మేము మా ప్లాట్ఫార్మ్ పై ఉన్న గుర్తింపులు ప్రామాణికమైనవి మరియు విశ్వసనీయమైనవని నిర్ధారించుటకు ఎక్కువగా అంగీకరించబడే మరియు సురక్షితమైన విధానాన్ని మేము అందిస్తున్నాము. ఈ ఫీచర్ ఉత్తమ-శ్రేణి సర్వీసులను అందించడమే కాకుండా యూజర్స్ తమ డిజిటల్ ఉనికిని ధైర్యంగా నియంత్రించుకునే సాధికారతను కూడా అందించాలనే మా నిబద్ధతను పునరుద్ఘాటిస్తుంది. కమ్యూనికేషన్ అందరికి సురక్షితమైనదిగా చేయాలనే మా కలను సాకారం చేసుకొనుటలో ఇది ఒక ముఖ్యమైన ముందడుగు అని మేము నమ్ముతున్నాము. ఇది భారతదేశములో ప్రారంభించబడుతోంది కాని తొందరలోనే ఇతర దేశాలకు కూడా విస్తరిస్తుంది. ఈ ప్రారంభముతో, ట్రూకాలర్ ప్రపంచవ్యాప్తంగా యూజర్ ప్రొఫైల్స్ యొక్క అత్యంత విశ్వసనీయమైన ఐడెంటిఫైయ్యర్ అవుతుంది." అన్నారు.

## అమెజాన్లో దుర్గా పూజ స్టోర్



బెంగళూరు : దేశవ్యాప్తంగా దుర్గా పూజ స్ఫూర్తి ఊపందుకోవడంతో, అమెజాన్లో దుర్గా పూజ స్టోర్ ఇప్పుడు లైవ్ లో ఉంది. కస్టమర్లు స్నేహితులు మరియు కుటుంబం కోసం సంప్రదాయబద్ధమైన అవుట్ ఫిట్స్, పూజ-సంబంధమైన సదుపాయాలు, బహుమతులు సహా ట్రెండీ ఎలక్ట్రానిక్స్ ను ప్రముఖ బ్రాండ్స్ పై ఉత్తేజభరితమైన డీల్స్ మరియు ఆఫర్లతో పండగకు తప్పనిసరిగా ఉండవలసిన విస్తృత శ్రేణి కోసం షాపింగ్ చేయవచ్చు. మీరు పండగను స్టైల్ గా సంబరం చేయడానికి అవసరమైన ప్రతి దాని కోసం దుర్గా పూజ స్టోర్ సమగ్ర పరిష్కారం అందిస్తోంది. అందంగా తయారు చేయబడిన ఎథ్నిక్ వేర్ నుండి పండగ కోసం, మీరు ఉండే చోటును మెరుగుపరచడానికి హోమ్ డెకార్ వరకు, పూజ కోసం తప్పనిసరిగా కావలసిన వాటి కోసం, మరియు మిమ్మల్ని అప్ టు డేట్ గా ఉంచే గాడ్జెట్స్ కోసం, ప్రతి ఒక్కరి కోసం తప్పనిసరిగా ఏదో ఒకటి ఉంది. దవచ్చు.

## ఐపిఓలో 570 కోట్లను సేకరించనున్న జారో ఎడ్యుకేషన్

ముంబై: జారో ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మేనేజ్మెంట్ అండ్ రీసెర్చ్ (జారో ఎడ్యుకేషన్) రూ 570 కోట్ల ప్రారంభ పబ్లిక్ ఆఫర్ (ఐపిఓ) కోసం మార్కెట్ రెగ్యులేటర్ సెబికి డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ (డిఆర్హెచ్పి)ని దాఖలు చేసింది. ఐపిఓ ను నిర్వహించడానికి నియమించబడిన మర్చంట్ బ్యాంకర్లు నువామా వెల్త్ మేనేజ్మెంట్, మోతీలాల్ ఓస్వాల్ ఇన్వెస్ట్మెంట్ అడ్వైజర్స్ మరియు సిస్టమాటిక్స్ కార్పొరేట్ సర్వీసెస్. ఆన్లైన్ ఉన్నత విద్య మరియు నైపుణ్యం పెంచే ప్రదేశంలో ఒక ప్రారంభ కదలిక, జరో ఎడ్యుకేషన్ను 2009లో సిఎండి మరియు విద్యా రంగంలో 17 సంవత్సరాల అనుభవం ఉన్న మొదటి తరం వ్యవస్థాపకుడు సంజయ్ సలుంఖే స్థాపించారు. విద్యా రంగంలో 15o సంవత్సరాల అనుభవం ఉన్న సిఈఓ డైరెక్టర్ రంజితా రామన్ అతనికి మద్దతు ఇస్తున్నారు. ఈ సంస్థ విద్యార్థులకు మరియు సి-సూట్ సిబ్బందికి దాని భాగస్వామి సంస్థల సహకారంతో వ్యక్తిగతీకరించిన, సాంకేతికతతో నడిచే డిగ్రీ ప్రోగ్రామ్లు మరియు ధృవీకరణ కార్యక్రమాలను అందిస్తుంది.

### 3ఏ కాంపోజిట్స్ ఫ్లాగ్షిప్ బ్రాండ్ అలుకోబాండ్ నుంచి

## ప్రీమియం ఉత్పాదన అలుకోడ్యూయల్ ఆవిష్కరణ



ముంబై, : స్విస్ అగ్రగామి సంస్థ, గ్లోబల్ ఇన్నోవేటర్, హై-క్వాలిటీ అల్యూమినియం కాంపోజిట్ మెటీరియల్స్ ప్రముఖ తయారీదారు అయిన 3ఏ కాంపోజిట్స్ ఫ్లాగ్షిప్ బ్రాండ్ అలుకోబాండ్ తన సాంకేతిక ప్రీమియర్ పోర్ట్ఫోలియోను విస్తరించడానికి ఉన్నత స్థాయి, నూతన తరం క్లాడింగ్ సొల్యూ షన్స్ 'అలుకోడ్యూయల్' అని లేబుల్ చేయబడిన ఒక వినూత్న ఉత్పత్తిని ఆవిష్కరించింది. అలుకోడ్యూ యల్ అనేది డిజైన్, పనితీరు కీలక పాత్ర పోషించే ఆర్కిటెక్చరల్ వినియోగం కోసం కంపెనీ అందించే తాజా ఉత్పాదన. భారతదేశంలోని మహారాష్ట్రలోని పుణె సమీపంలోని రంజన్గావ్లోని 3ఏ కాంపోజిట్స్ అత్యాధునిక ప్లాంట్లో పూర్తిగా పరిశోధించబడి, రూపొందించబడి, అభివృద్ధి చేయబడి, తయారు చేయబడింది. అలుకోడ్యూయల్ అనేది లామినేటెడ్ అల్యూమినియం స్కిన్ల పొరలతో ప్రి-కోటెడ్ ఇంజనీర్డ్ సాలిడ్ షీట్. ఇది ఫకేడ్స్, క్లాడింగ్ మరియు కర్టెన్ వాల్స్, ఇంటీరియర్ వాల్స్, పైకప్పులు, సోఫిట్స్, కాలమ్ డెకరేషన్ ఇంకా మరెన్నో రకాల ఉపయోగాల కోసం అనువైంది. నిర్మాణ దృక్కోణం నుండి క్లాడింగ్ అవసరాలు, వినియోగం, స్పెసిఫికేషన్లను విశ్లేషిస్తూ, 'పర్ఫెక్ట్ ఫ్లాట్నెస్' అత్యంత ప్రముఖ లక్షణాన్ని అందించడానికి అలుకోడ్యూయల్ రూపొందించబడింది. సాధారణంగా ప్రామాణిక పోస్ట్-కోటెడ్ సాలిడ్ షీట్లతో 'పర్ఫెక్ట్ ఫ్లాట్నెస్' సాధించడం సవాలుగా ఉంటుంది. అంతేకాకుండా, ఇదే మందం కలిగిన అల్యూమినియం సింగిల్ షీట్తో పోలిస్తే, అలుకోడ్యూయల్ ప్యానెల్స్ మెరుగైన స్టిఫ్ నెస్, దృఢత్వాన్ని అందిస్తాయి. ఈ నిర్మాణ స్థిరత్వం ఈ ఉత్పాదనను పెద్ద క్యాసెట్స్, ప్యానెల్లలో ఉపయోగించ డానికి వీలు కల్పిస్తుంది. జాయింట్స్ సంఖ్యను, మొత్తం ఖర్చులను సమర్థవంతంగా తగ్గిస్తుంది. ఈ ఉత్పా దన బహుళ మరియు సంక్లిష్టమైన 'ఆన్-సైట్' క్లాడింగ్ అప్లికేషన్ అవసరాలకు అనుగుణంగా రూపొందించ బడింది. అలుకోడ్యూయల్ తుప్పు - రహిత మెరైన్ గ్రేడ్ మిశ్రమం ఈ ఉత్పాదన దీర్ఘకాలిక మన్నికకు వీలు కల్పిస్తుంది. ఈ ఆవిష్కరణ గురించి 3ఏ కాంపోజిట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రెసిడెంట్, సీఈఓ రంజీత్ శర్మ మాట్లాడుతూ, "మా సరికొత్త ఆవిష్కరణ అలుకోడ్యూయల్ అనేది స్వదేశీ పరిశోధన. దేశీయంగా అభివృద్ధి చేసిన 'మేక్-ఇన్-ఇండియా' ఉత్పాదన. ఇది ఇప్పుడు భారతదేశం, ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయడానికి సిద్ధంగా ఉంది. అలుకోడ్యూయల్ ఆర్కిటెక్ట్లను సన్నగా, దృఢంగా డిజైన్ చేయడాన్ని, ఉపయోగించడాన్ని సులభతరం చేస్తుందిబీ మెగా నిర్మాణాలను నిర్మించడానికి అత్యంతగా వీలైన క్లాడింగ్ మెటీరియల్. ఇది విమానాశ్రయాలు, షాపింగ్ మాల్స్, స్టేడియంలు, ఎత్తైన వాణిజ్య, నివాస భవనాలు మొదలైన ప్రాజెక్టులలో కొత్త డిజైన్ మరియు అప్లికేషన్ ట్రెండ్ని తీసుకువస్తుంది. మేం భారతదేశంలోని మా తయారీ కేంద్రాన్ని ప్రపంచవ్యాప్తంగా మరీ ముఖ్యంగా ఆసియా-పసిఫిక్, పశ్చిమాసియా దేశాలకు అలుకోడ్యూయల్ ని సరఫరా చేయడానికి గ్లోబల్ హబ్గా చేస్తున్నాం" అని అన్నారు.

### " ఇండియా-మాల్దీవ్స్ బిజినెస్ ఫోరమ్ సమావేశాలలో

## అసోచామ్కు కటారు రవి కుమార్ రెడ్డి ప్రాతినిధ్యం

బెంగుళూరులో జరిగిన ఇండియా-మాల్దీవ్స్ బిజినెస్ ఫోరమ్లో అసోచామ్ తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ స్టేట్ డెవలప్మెంట్ కౌన్సిల్ చైర్మన్ మరియు యాక్సిస్ ఎనర్జీ గ్రూప్ సిఎండి కటారు రవి కుమార్ రెడ్డి ప్రాతినిధ్యం వహించారు. రిపబ్లిక్ ఆఫ్ మాల్దీవ్స్ ప్రెసిడెంట్ హిస్ ఎక్సలెన్సీ డాక్టర్ మొహమ్మద్ ముయిజు గౌరవార్థం ఈ కార్యక్రమం జరిగింది. ఫోరమ్ భారతదేశం మరియు మాల్దీవుల మధ్య వ్యాపార సంబంధాలను బలోపేతం చేయడం, వివిధ రంగాలలో సహకారం కోసం అవకాశాలను హైలైట్ చేయడం లక్ష్యంగా పెట్టుకుంది. రాష్ట్రపతి భారత్లో కొనసాగుతున్న రాష్ట్ర పర్యటన సందర్భంగా ఈ ఫోరం జరిగింది. అసోసియేటెడ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ & ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా దేశంలోని పురాతన అపెక్స్ ఛాంబర్. ఇది భారతీయ పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడానికి కార్యాచరణ అంతర్దృష్టులను అందిస్తుంది, దాని 4,50,000 కంటే ఎక్కువ మంది సభ్యుల నెట్వర్క్ను ప్రభావితం చేస్తుంది, వీటిలోఎంఎస్ఎంఈలు పెద్ద విభాగానికి ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. రాష్ట్రాలు మరియు ప్రపంచవ్యాప్తంగా కీలక నగరాల్లో బలమైన ఉనికిని కలిగి ఉన్న ఈసోచామ్ 400 కంటే ఎక్కువ సంఘాలు, సమాఖ్యలు మరియు ప్రాంతీయ ఛాంబర్లను కలిగి ఉంది. నూతన భారతదేశాన్ని సృష్టించే దృక్పథంతో అసోచామ్ పరిశ్రమకు మరియు ప్రభుత్వానికి మధ్య వాహికగా పనిచేస్తుంది. ఛాంబర్ ఒక చురుకైన మరియు ముందుకు చూసే సంస్థ, దేశీయ పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేస్తూనే భారతీయ పరిశ్రమ యొక్క ప్రపంచ పోటీతత్వాన్ని పెంపొందించడానికి వివిధ కార్యక్రమాలకు నాయకత్వం వహిస్తుంది.



## త్వరలో మార్కెట్లోకి గెలాక్సీ ఏ16 5జి




గురుగ్రామ్ : దేశంలో అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ సామ్సంగ్ , త్వరలో తమ గెలాక్సీ ఏ16 5జి స్మార్ట్ఫోన్ను విడుదల చేయబోతున్నట్లు వెల్లడించింది. భద్రతా నవీకరణలను అందించడం ద్వారా మధ్య-శ్రేణి స్మార్ట్ఫోన్లలో గణనీయమైన పురోగతిని సూచిస్తుంది. సామ్సంగ్ గెలాక్సీ ఏ16 5జి వినియోగదారులకు అసాధారణమైన విలువను అందిస్తూనే ఈ విభాగాన్ని పునర్నిర్వచించే ఫీచర్లను సైతం అందిస్తుంది. గెలాక్సీ ఏ16 5జి ప్రీమియం గెలాక్సీ ఏ -సిరీస్ డిజైన్ను 'కీ ఐలాండ్' సౌందర్యంతో అలంకరించడానికి సిద్ధంగా ఉంది. కొత్త గ్లాస్టిక్ బ్యాక్ ప్యాటర్న్, పెద్ద డిస్ప్లే మరియు సన్నటి బెజెల్స్తో జతచేయబడి, గెలాక్సీ ఏ16 5జి ని నిజంగా లీనమయ్యే వినోద పరికరంగా మారుస్తుంది, ఇది దృశ్య కంటెంట్ను ప్రసారం చేయడానికి సరైనది. గెలాక్సీ ఏ16 5జి గోల్డ్, లైట్ గ్రీన్ మరియు బ్లూ బ్లాక్ అనే మూడు అద్భుతమైన రంగులలో అందుబాటులో ఉండనుంది. తమ విభాగంలో సాటిలేని రీతిలో 6 తరాల ఓఎస్ అప్గ్రేడ్లు మరియు 6 సంవత్సరాల భద్రతా అప్డేట్లను అందించడం ద్వారా, గెలాక్సీ ఏ16 5జి భారతదేశ స్మార్ట్ఫోన్ పరిశ్రమలో విలువ ప్రతిపాదనను పునర్నిర్వచించటానికి మరియు మధ్య-శ్రేణి స్మార్ట్ఫోన్లలో సాటిలేని అనుభవాన్ని అందించడానికి నిర్దేశించబడినది, వినియోగదారులకు చాలా కాలం పాటు సరికొత్త ఫీచర్లను ఆస్వాదించడానికి వీలు కల్పిస్తుంది.

## రైట్స్ ఇష్యూతో మయూఖ్ డీల్ రూ.49 కోట్లు సేకరణ

ముంబై : ముంబైకి చెందిన వివిధ రకాల బర్నర్లు తయారుచేసే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీ మయూఖ్ డీల్ ట్రేడ్ లిమిటెడ్ ఆగస్టు 30, 2024న కంపెనీలో అర్హులైన వాటాదారులకు ఈక్విటీ షేర్లను రైట్ ఇష్యూ ద్వారా జారీ చేయడం ద్వారా రూ .49 కోట్ల వరకు నిధులను సేకరించే ప్రతిపాదనకు ఈ సంస్థ డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలిపింది. కన్సల్టెంట్లను నియమించి సరైన ఇష్యూ ప్రక్రియను ప్రారంభించడానికి మేనేజింగ్ డైరెక్టర్, సీఎఫ్ఓలకు బోర్డు అధికారం ఇచ్చింది. 5-ఫర్-1 స్టాక్ విభజన ప్రతిపాదనకు కూడా బోర్డు ఆమోదం తెలిపింది. కంపెనీ సర్వసభ్య సమావేశంలో వాటాదారుల ఆమోదానికి లోబడి రూ.5 ముఖ విలువ కలిగిన ఒక్కో ఈక్విటీ షేరును రూ.1 ముఖ విలువ కలిగిన 5 ఈక్విటీ షేర్లుగా విభజించే ప్రతిపాదనను బోర్డు చర్చించి ఆమోదించింది. కంపెనీ సర్వసభ్య సమావేశంలో వాటాదారుల ఆమోదానికి లోబడి ఒక్కోటి రూ.1 విలువ గల 30 కోట్ల ఈక్విటీ షేర్లుగా విభజించి, రూ.30 కోట్లుగా ఉన్న అధీకృత షేర్ క్యాపిటల్ను ఇప్పుడు రూ.1 విలువ గల 63 కోట్ల ఈక్విటీ షేర్లుగా విభజించి రూ.1 చొప్పున అదనంగా 33 కోట్ల ఈక్విటీ షేర్లను సృష్టించేందుకు బోర్డు చర్చించి ఆమోదం తెలిపింది.

## ఓలా ఎలక్ట్రానిక్ ఎస్1 పై రూ 30,000 వరకు తగ్గింపు



ఓలా ఎలక్ట్రానిక్ విభిన్న శ్రేణి అవసరాలతో కస్టమర్లకు అందించే ఆకర్షణీయమైన ధరల పాయింట్లలో ఆరు ఆఫర్లతో విస్తృతమైన ఎస్ 1 పోర్ట్ఫోలియోను అందిస్తుంది. ప్రీమియం ఆఫర్లు S1 Pro మరియు S1 ఎయిర్ల ధర వరుసగా రూ 1,34,999 మరియు రూ 1,07,499, మాస్ మార్కెట్ ఆఫర్లలో ఎస్1 ఎక్స్ X పోర్ట్ఫోలియో (2 కిలోవాట్, 3 మరియు కిలోవాట్) ధర రూ 74,999, రూ 87,999. , మరియు రూ 101,999.గా ఉంది. ఓలా ఎలక్ట్రానిక్ ఇటీవలే చ హైప్ సర్వీస్ ప్రచారాన్ని ప్రకటించింది. ప్రచారం కింద, కంపెనీ ఈ ఏడాది డిసెంబర్ నాటికి తన సర్వీస్ నెట్వర్క్ను 1,000 కేంద్రాలకు రెట్టింపు చేయాలని యోచిస్తోంది. అదనంగా, భారతదేశం అంతటా తన విక్రయాలు మరియు సేవా నెట్వర్క్ను విస్తరించేందుకు నెట్వర్క్ పార్ట్నర్ ప్రోగ్రామ్ను కూడా ప్రకటించింది. కార్యక్రమంలో భాగంగా, ఓలా ఎలక్ట్రానిక్ 2025 చివరి నాటికి నెట్వర్క్ను 10,000కి పెంచాలని యోచిస్తోంది. అదనంగా,ఓలా ఎలక్ట్రానిక్ భారతదేశం లోని ప్రతి మెకానిక్కు ఈవీ-సిద్ధంగా చేయడానికి 1 లక్ష మంది థర్డ్-పార్టీ మెకానిక్లకు శిక్షణ ఇస్తుంది.

## ఇండెక్స్ ఫండ్లను ప్రారంభించిన బంధన్ మ్యూచువల్ ఫండ్

హైదరాబాద్ : బంధన్ మ్యూచువల్ ఫండ్ బంధన్ నిఫ్టీ 500 వాల్యూ 50 ఇండెక్స్ ఫండ్ మరియు బంధన్ నిఫ్టీ 500 మొమెంటం 50 ఇండెక్స్ ఫండ్లను ప్రారంభించినట్లు ప్రకటించింది. ఇవి వరుసగా నిఫ్టీ 500 వాల్యూ 50 ఇండెక్స్ మరియు నిఫ్టీ 500 మొమెంటం 50 ఇండెక్స్ను ట్రాక్ చేసే ఓపెన్-ఎండ్ ఇండెక్స్ స్కీమ్లు. నిఫ్టీ 500 వాల్యూ 50 ఇండెక్స్ నిఫ్టీ 500 యూనివర్స్లోని 50 అండర్వాల్యూడ్ కంపెనీలపై దృష్టి పెడుతుంది, అయితే నిఫ్టీ 500 మొమెంటం 50 ఇండెక్స్ 50 స్టాక్లపై వారి బలమైన ఇటీవలి పనితీరు ధోరణి ఆధారంగా దృష్టి పెడుతుంది. కొత్త ఫండ్ ఆఫర్లు సోమవారం, 14 అక్టోబర్ 2024న తెరవబడతాయి మరియు 24 అక్టోబర్ 2024 గురువారం ముగుస్తాయి. బంధన్ నిఫ్టీ 500 వాల్యూ 50 ఇండెక్స్ ఫండ్ మరియు బంధన్ నిఫ్టీ 500 మొమెంటం 50 ఇండెక్స్ ఫండ్ రెండింటిలోనూ పెట్టుబడులు లైసెన్స్ పొందిన వారి ద్వారా చేయవచ్చు. బంధన్ ఏఎంసి సిఈఓ విశాల్ కపూర్ మాట్లాడుతూ "చారిత్రాత్మకంగా నడిచే రిస్క్ లేదా రాబడిని కలిగి ఉన్న నిర్దిష్ట లక్షణాలను లక్ష్యంగా చేసుకున్నందున ఫ్యాక్టర్ ఇన్వెస్టింగ్ గణనీయమైన ట్రాక్షన్ను పొందింది. బంధన్ నిఫ్టీ 500 వాల్యూ 50 ఇండెక్స్ ఫండ్ వారి అంతర్గత విలువ కంటే తక్కువ ట్రేడింగ్ చేసే అనుకూలత లేని స్టాక్లకు బహిర్గతం చేయడం మరియు వాటి సంభావ్య పునరుద్ధరణపై పెట్టుబడి పెట్టడం లక్ష్యంగా పెట్టుకుంది. ఇంతలో, బంధన్ నిఫ్టీ 500 మొమెంటం 50 ఇండెక్స్ ఫండ్, స్వల్పకాలికంలో పైకి ట్రెండ్ కొనసాగుతుందనే అంచనాతో, బలమైన ఇటీవలి పనితీరుతో స్టాక్లపై దృష్టి పెడుతుంది.

### అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ 2024 ప్రారంభించిన

## 48 గంటల్లో రికార్డు స్థాయిలో 11 కోట్ల మంది కస్టమర్లు

అమెజాన్ ఇండియా అతిపెద్ద షాపింగ్ ఫెస్టివల్ ప్రారంభమైంది. అపూర్వ స్పందనను ఇది అందుకుంటుంది. ఈ ఫెస్టివల్ ప్రారంభించిన మొదటి 48 గంటలలో అసాధారణంగా 11 కోట్లకు పైగా సందర్శనలు నమోదయ్యాయి. ఈ కాలంలో మా మొత్తం అమ్మకాలలో 65% కంటే ఎక్కువ టైర్ 2 మరియు 3 నగరాల నుండి చూశాము. స్మార్ట్ఫోన్లు, గృహోపకరణాలు, ఫ్యాషన్ మరియు బ్యూటీ ప్రొడక్టు వంటి కేటగిరీలకు అమిత డిమాండ్ కన్పించింది. సంఖ్యల పరంగా చెప్పాలంటే, 200,000 మంది కస్టమర్లు మొదటిసారిగా మొబైల్ ఫోన్ని కొనుగోలు చేసారు, ప్రీమియం ఉత్పత్తులకు అధిక గిరాకీ ఉంది, ప్రీమియం స్మార్ట్ఫోన్లు ఇయర్ ఆన్ ఇయర్ 30% వృద్ధిని చూస్తే, హై- ఎండ్ గేమింగ్ ల్యాప్టాప్ల అమ్మకాలలో 35 ఎక్స్ పెరుగుదలను కనిపించింది. వీటితో పాటుగా పెద్ద ఉపకరణాలు ఎక్స్ఛేంజ్ ఆఫర్లను ఉపయోగించటం ఈసారి ఎక్కువగా కనిపించింది. ఈ విభాగంలో 1.7 రెట్ల వృద్ధి నమోదు చేస్తే, ప్రీమియం గడియారాలు మరియు ఆభరణాల పరంగా 2 రెట్ల వృద్ధి వుంది. కిరాణా, రోజువారీ నిత్యావసర వస్తువులు మరియు గృహాలంకరణలో కూడా మేము గణనీయమైన వృద్ధిని గమనిస్తున్నాము, అమెజాన్ పే స్వీకరణ పెరిగింది. ఇలా విధంగా చూసినా అపూర్వమైన వృద్ధి కనిపిస్తుంది.

## టొయోటా కిర్లోస్కర్ మోటార్ 'ఫెస్టివల్ లిమిటెడ్ ఎడిషన్'




బెంగుళూరు : టొయోటా కిర్లోస్కర్ మోటార్ (టికెఎం) ఈ రోజు అర్బన్ క్రూయిజర్ హైరైడర్ 'ఫెస్టివల్ లిమిటెడ్ ఎడిషన్'ని పరిచయం చేసింది, ఇందులో ప్రత్యేకమైన టొయోటా జెన్యూన్ యాక్సెసరీస్ (టిజిఏ) ప్యాకేజ్లు ఉన్నాయి. 022లో విడుదల అయినప్పటి నుండి, అర్బన్ క్రూయిజర్ హైరైడర్ దాని అత్యాధునిక సాంకేతికత, డైనమిక్ పనితీరు మరియు అత్యుత్తమ ఇంధన సామర్థ్యంతో దేశవ్యాప్తంగా వినియోగదారుల హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. టొయోటా కిర్లోస్కర్ మోటార్, సేల్స్-సర్వీస్-యూజ్డ్ కార్ బిజినెస్ వైస్ ప్రెసిడెంట్ శబరి మనోహర్ మాట్లాడుతూ , "2022లో విడుదల చేసినప్పటి నుండి , అర్బన్ క్రూయిజర్ హైరైడర్ స్థిరమైన మొబిలిటీని అందించడంలో టికెఎం యొక్క నిబద్ధతకు చిహ్నంగా ఉంది. అధిక కస్టమర్ సంతృప్తితో అపూర్వమైన ప్రజాదరణను పొందింది. పెరుగుతున్న డిమాండ్ మరియు సానుకూల ఆదరణ మా ఆఫర్లను నిరంతరం మెరుగుపరచడానికి మమ్మల్ని ప్రోత్సహించాయి. ప్రత్యేకమైన టిజిఏ ప్యాకేజీని కలిగి ఉన్న అర్బన్ క్రూయిజర్ హైరైడర్ ఫెస్టివల్ లిమిటెడ్ ఎడిషన్ పరిచయంతో, మేము మా కస్టమర్లకు మరింత వ్యక్తిగతీకరించిన మరియు ప్రీమియం డ్రైవింగ్ అనుభవాన్ని అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ ప్రత్యేక ఆవిష్కరణలో భాగంగా, 31 అక్టోబర్ 2024 వరకు భారతదేశంలోని డీలర్షిప్లలో అందుబాటులో ఉంచబడిన అర్బన్ క్రూయిజర్ హైరైడర్ ఫెస్టివల్ లిమిటెడ్ ఎడిషన్ను ఎంచుకునే కస్టమర్ల కోసం రూ. 50,817 విలువైన కాంప్లిమెంటరీ ప్యాకేజీని టికెఎం అందిస్తోంది.

## నోద కంటెంట్ను ఆవిష్కరించిన వార్నర్ బ్రదర్స్ డిస్కవరీ



వాస్తవిక, జీవనశైలి వినోదాన్ని అందించడంలో అగ్రగామిగా ఉన్న వార్నర్ బ్రదర్స్ డిస్కవరీ, స్ట్రీమింగ్ మరియు లీనియర్ ఛానెల్ల కోసం, భారతీయ ఒరిజినల్లకు చక్కని ప్రాధాన్యత ఇచ్చేలా తన కంటెంట్ స్లేట్ను ప్రకటించింది. డిస్కవరీ ఛానెల్, యానిమల్ ప్లానెట్ మరియు టీఎల్సీతో సహా డిస్కవరీం వ్యాప్తంగా ప్రోగ్రామింగ్ను గణనీయంగా మెరుగుపరచాలని కంపెనీ యోచిస్తోంది. ఈ ఏడాది చివరి నాటికి, వాస్తవిక, జీవనశైలి క్లస్టర్ లీనియర్ ఛానెళ్లు, డిస్కవరీం వ్యాప్తంగా 3,000 గంటల తాజా కంటెంట్ను అందుబాటులో ఉంచుతోంది. వీక్షకులను ఆకర్షిస్తూ, ఆకట్టుకునేలా ఈ కంటెంట్ను రూపొందించారు. అదనంగా, పునర్నిర్మించిన డితమిళ్ ఛానెల్ తమిళ భాషలో హాలీవుడ్ బ్లాక్బస్టర్ సినిమాలు మరియు సిరీస్లతో సహా టాప్ గ్లోబల్ ఎంటర్టైన్మెంట్ కంటెంట్ను ప్రదర్శిస్తూ డబ్బింగ్ చిత్రాలకు గో-టు డెస్టినేషన్గా నిలువనుంది. వార్నర్ బ్రదర్స్ డిస్కవరీలో ఫ్యాక్చువల్ మరియు లైఫ్స్టైల్ క్లస్టర్ హెడ్ సాయి అభిషేక్ దీని గురించి మాట్లాడుతూ, "నాన్ ఫిక్షన్ కంటెంట్ జానర్లో కేటగిరీ లీడర్లుగా, వీక్షకుల ఎంగేజ్మెంట్ను మెరుగుపరచడం, మా కంటెంట్ ఆఫర్ను విస్తరించడంపై మేము దృష్టిసారించాము. కొత్తగా ప్రకటించిన ఇండియా ఒరిజినల్లు, లీనియర్ మరియు స్ట్రీమింగ్ ప్లాట్ఫారమ్లలో మా వ్యూహాత్మక ప్రోగ్రామింగ్ క్రాస్-ప్లాట్ఫారమ్ అనుభవాలను రూపొందించడంలో మా నిబద్ధతకు నిదర్శనం. డితమిళ్ ఇటీవలి పునరుద్ధరణ కాగా, తమిళ ప్రేక్షకులకు ప్రాంతీయ భాషలలోని అత్యుత్తమ గ్లోబల్ కంటెంట్ని తీసుకురావడంపై మా అంకితభావాన్ని తెలియజేస్తుంది. మేము మా కంటెంట్ లైబ్రరీని బలోపేతం చేయడం, భారతీయ వీక్షకుల ప్రయోజనాలను ప్రతిబింబించే, భారతదేశం మరియు దక్షిణాసియా వ్యాప్తంగా విలువను సృష్టించే బలమైన మరియు ఆకట్టుకునే కథనాలను అందించడం కొనసాగిస్తాము" అని వివరించారు.

## అపోహలను పరిష్కరించిన ఈ-గేమింగ్ ఫెడరేషన్

హైదరాబాద్, అక్టోబర్ 11, 2024: భారతదేశపు అగ్రగామి నైపుణ్య-గేమింగ్ పరిశ్రమ సంస్థ అయిన ఇ-గేమింగ్ ఫెడరేషన్ (ఈజీఎఫ్) ఇటీవల ఒక రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించింది. అందులో ప్రధానంగా భారతదేశంలో ఆన్లైన్ గేమింగ్ రంగం శరవేగంగా వృద్ధి చెందుతున్న విషయాన్ని ప్రస్తావించి, అదే సమయంలో, ఈ రంగంపై ఉన్న అపోహలను పరిష్కరిస్తూ, భారత ఆర్థికాభివృద్ధిలో పరిశ్రమ కీలక పాత్రనూ స్పష్టం చేసింది. దేశంలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పరిశ్రమల్లో ఒకటైన ఆన్లైన్ గేమింగ్ వచ్చే ఐదేళ్లలో 3.1 బిలియన్ డాలర్ల నుంచి 8.92 బిలియన్ డాలర్లకు పెరుగుతుందని అంచనా. గ్రాంట్ థార్న్టన్ భారత్, ఇ-గేమింగ్ ఫెడరేషన్ తాజా నివేదిక ప్రకారం, భారతీయ గేమింగ్ పరిశ్రమ 2018 నుంచి 2023 వరకు శ్రామిక శక్తి పెరుగుదలలో 20 రెట్లు పెరిగింది. సమాచార లోపం కారణంగా ఆన్లైన్ స్కిల్ గేమింగ్, జూదం మధ్య గందరగోళం నెలకొంది. ఈ సందర్భంగా ఈజీఎఫ్ సీఈఓ అనురాగ్ సక్సేనా మాట్లాడుతూ, ఆన్ లైన్ గేమింగ్ పరిశ్రమ విషయంలో ఉన్న సవాళ్లు, చట్టపరమైన, నైతిక సందిగ్ధతలు, ముఖ్యంగా ఆన్ లైన్ నైపుణ్య ఆధారిత ఆటలు తరచుగా జూదం అనుకుని గందరగోళానికి గురయ్యే అపోహలపై మాట్లాడారు. పరిశ్రమ యొక్క దీర్ఘకాలిక సాధ్యాసాధ్యాల కోసం మరింత సమాచారంతో కూడిన చర్చలు జరగాలని ఆయన అభిలషించారు. నైపుణ్య ఆధారిత గేమింగ్, ఆఫ్షోర్ అక్రమ బెట్టింగ్, గ్యాంబ్లింగ్ ప్లాట్ఫాంల మధ్య వ్యత్యాసాన్ని నొక్కి చెప్పారు. భారతదేశంలో గేమింగ్ పై దృక్పథాన్ని పునరాలోచించాల్సిన అవసరాన్ని అనురాగ్ ప్రధానంగా తెలిపారు. బాధ్యతాయుతమైన గేమింగ్ పద్ధతులను నిర్ధారిస్తూ పరిశ్రమకు వృద్ధిని ప్రోత్సహించే అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించే అంశాలను సూచించారు.



# విశాఖకి రూ.40000 కోట్ల ప్రాజెక్టు-77

విశాఖపట్నం ఏపీ ఆర్థిక రాజధాని విశాఖపట్నానికి పెట్టుబడులు తరలివస్తున్నాయి. విశాఖలో లులు మాల్, మల్టీప్లెక్స్ ఏర్పాటు చేస్తామని లులు గ్రూప్ ఇప్పటికే ప్రకటించింది. అటు టీసీఎస్ సైతం విశాఖపట్నానికి తరలిరానున్నట్లు ఏపీ ఐటీశాఖ మంత్రి నారా లోకేష్ ఇటీవల వెల్లడించారు. ఇప్పుడు విశాఖను ఆర్థికంగా మరింత బలోపేతం చేసే విధంగా కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. దీర్ఘకాలిక ప్రణాళికలో భాగంగా అణుశక్తితో దాడి చేయగలిగే రెండు జలాంతర్గాములను దేశీయంగా అభివృద్ధి చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఈ ప్రాజెక్టుతో పాటుగా 31 ఆయుధాలతో కూడిన %హీ-9డీ% ప్రిడేటర్ డ్రోన్లను అమెరికా నుంచి కొనుగోలు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో బుధవారం జరిగిన భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ ఇందుకు ఆమోదం తెలిపింది. చైనా దూకుడు కళ్లెం వేయడానికి న్యూక్లియర్ పవర్డ్ అటాక్ సబ్ మెరైన్లు ఉండాలని కేంద్రం భావిస్తోంది. ఈ నేపథ్యంలో వీటిని దేశీయంగా తయారు చేయాలని భావిస్తోంది. ఇక ఈ ప్రాజెక్టుకు.. ప్రాజెక్ట్ -77గా నామకరణం చేశారు. రూ.40000 కోట్లతో ఈ ప్రాజెక్టు చేపట్టనున్నారు. అయితే సుదీర్ఘకాలంగా దీనికి ఆమోదం లభించలేదు. అయితే ఇటీవల జరిగిన భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశంలో ఆమోదం లభించింది. ప్రాజెక్ట్ -77లో భాగంగా అణుశక్తితో దాడి చేయగలిగే రెండు జలాంతర్గాములను అభివృద్ధి చేయనున్నారు. నౌకాదళ పరిభాషలో వీటిని %హాచీ% అని పిలుస్తారు. ఇక ఇందులో క్షిపణులు, టార్పెడోలు, ఇతరత్రా ఆయుధాలు కూడా ఉంటాయి. అయితే ఇంతటి ప్రతిష్టాత్మకమైన ఈ రూ.40000 కోట్ల ప్రాజెక్టుకు కేంద్రం విశాఖపట్నాన్ని ఎంచుకున్నట్లు తెలుస్తోంది. విశాఖలోని షిప్ బిల్డింగ్ సెంటర్లో ఈ జలాంతర్గాములను తయారు చేయనున్నట్లు సమాచారం.

# ఏపీలో రెడ్ బుక్ చర్యలు ప్రారంభం అయ్యాయి

● పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామిక వేత్తలు వస్తున్నారు ● రేషన్ కార్డులపై వైసీపీ గుర్తుల తొలగింపు

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి ఆంధ్రప్రదేశ్ లో రెడ్ బుక్ యాక్షన్ మొదలైందని, చట్టాన్ని ఉల్లంఘించి ఫేక్ న్యూస్ ప్రచారం చేసే వాళ్లపై కఠిన చర్యలు ఉంటాయని, చట్టాన్ని ఉల్లంఘించిన బ్యాచ్‌కు రెడ్ బుక్‌లో తమ పేరు ఉందో లేదో అనే కంగారు ఉందని విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన అమరావతిలో మీడియాతో మాట్లాడుతూ.. యాక్షన్ అయితే అనివార్యమని, వైసీపీ వాళ్లు ఏ పుస్తకం పెట్టుకున్నారో వాళ్లకే స్పష్టత లేదని.. కానీ తన నుంచీ ఇన్స్పైర్ అయ్యారని అర్థమైందన్నారు. రాయలసీమ తయారీ రంగానికి, ఉత్తరాంధ్ర సేవా రంగానికి కేంద్రాలుగా మారనున్నాయని, పరిపాలన ఒకే దగ్గర ఉండాలి, అభివృద్ధి వికేంద్రీకరణ అన్ని ప్రాంతాలకు జరగాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వంపై నమ్మకంతో ఇప్పుడిప్పుడే పరిశ్రమలు పెట్టేందుకు పారిశ్రామిక వేత్తలు ముందుకొస్తున్నారని, బ్లూ బ్యాచ్ ఆగడాల వల్ల పరిశ్రమల స్థాపనకు ఇబ్బంది అనిపిస్తే ఎంతమాత్రం ఉపేక్షించమని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు. వరదలొస్తే జగన్‌లా పరదాలు కట్టుకునట్లు.. సీఎం చంద్రబాబు అండ్ టీమ్ ఇంట్లో కూర్చోలేదన్నారు. మాజీ సీఎం జగన్‌కు ఆత్మలతో మాట్లాడే అలవాటు ఇంకా పోనట్లుందని ఎద్దేవా చేశారు. గతంలో ఇలానే ఆత్మలతో మాట్లాడి కియా తమ ఘనతే అన్నారని, ఇప్పుడు టీసీఎస్ గురించి ఏ ఆత్మతో మాట్లాడారని ప్రశ్నించారు. జగన్ హయాంలో తరిమేసిన పరిశ్రమలన్నీ మళ్లీ తెస్తున్నామని.. ఇందుకు లూలూ, అశోక్ లైల్యాండ్ లే ఉదాహరణ అని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. కాగా రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి మంత్రి లోకేశ్ ఇటీవల ముంబైలో టాటా సన్స్ బోర్డు చైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్‌తో సమావేశం అయ్యారు. రాష్ట్రంలో ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్, ఆటోమొబైల్ రంగాల్లో పెట్టుబడుల అవకాశాలపై ఇరువురు చర్చించారు. ఇంకోవైపు.. హీరానందానీ సంస్థల డైరెక్టర్ హర్ష్ హీరానందానీతో సమావేశం అయినట్లు నారా లోకేశ్ ప్రకటించారు. రాయలసీమలో ఇండస్ట్రియల్ టౌన్‌షిప్ ఏర్పాటు, విశాఖలో గ్రేడ్ ఏ ఆఫీస్ స్పేస్‌లకు ఉన్న అవకాశాలపై చర్చించానని లోకేశ్ పేర్కొన్నారు. కాగా గత వైసీపీ ప్రభుత్వం ప్రచార పిచ్చితో రేషన్ కార్డులను కూడా తమ పార్టీ రంగులతోనే నింపేసింది. వాటిపై ఒకవైపు వైఎస్ రాజశేఖరరెడ్డి, మరోవైపు జగన్ బొమ్మలు ముద్రించి లబ్ధిదారులకు పంపిణీ చేసింది. రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 4 నెలలు అవుతున్నా ఇప్పటికీ ఆ కార్డులపైనే రేషన్ సరుకులు సరఫరా చేస్తున్నారు. దీనిపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో పాత రేషన్‌కార్డులను తొలగించి కొత్త కార్డులు ఇవ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. కొత్త రేషన్‌కార్డుల రూపకల్పనపై రాష్ట్ర పౌరసరఫరాలశాఖ కసరత్తు చేస్తోంది. ఇందుకోసం



అధికారులు పలు డిజైన్లు పరిశీలిస్తున్నారు. లేత పసుపు రంగుతో, రాష్ట్ర ప్రభుత్వ అధికారిక చిహ్నం ముద్రించిన కార్డుల నమూనాను అధికారులు ప్రభుత్వ ఆమోదం కోసం ప్రతిపాదించారు. దాంతోపాటు మరికొన్ని నమూనాలను కూడా ప్రభుత్వ పరిశీలనకు పంపించారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం 'వన్ నేషన్ – వన్ రేషన్ కార్డు' నినాదంతో జాతీయ ఆహార భద్రత పథకంలో భాగంగా అమలు చేస్తున్న స్మార్ట్ కార్డులు జారీ చేస్తున్న అంశాన్ని కూడా పరిశీలిస్తున్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల వల్ల వలస కార్మికులు, కుటుంబాలు దేశంలో ఎక్కడైనా రేషన్ సరుకులు తీసుకునే వెసులుబాటు ఉంటుంది. ఈ నేపథ్యంలో స్మార్ట్ రేషన్‌కార్డుల జారీపై ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

# పీపీపీలపై కమిటీ

● ఈఎన్సీ ఆధ్వర్యంలో ఐదుగురు సభ్యులు



● రెండు నెలల కాలవ్యవధి

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన పీపీపీ(ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం) రహదారుల ప్రాజెక్టులపై అధ్యయనం కోసం నిపుణుల కమిటీ ఏర్పాటైంది. ఆర్అండ్‌బీ ఇంజనీరింగ్ చీఫ్ నేతృత్వాన ఐదుగురు సభ్యులతో ఈ కమిటీ ని ఏర్పాటుచేస్తూ ఆ శాఖ ముఖ్యకార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. రహదారి అభివృద్ధి సంస్థ ఎండీ, చీఫ్ ఇంజనీర్, కమిటీ కన్వీనర్, జాతీయ రహదారులు, సీఆర్ఎఫ్ చీఫ్ ఇంజనీర్, ఆర్థిక శాఖ ఉప సలహాదారు సురేంద్ర దట్టీ, ఆర్థికశాఖలో పీపీపీ నిపుణుడు షాలెం రాజు ఈ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. వచ్చే రెండు నెలల్లో అధ్యయనం పూర్తిచేసి నివేదిక ఇవ్వాలని కమిటీని ప్రభుత్వం ఆదేశించింది

# ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలు

● కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు
● బాలాత్రిపుర సుందరీ కాలభైరవ ఆలయాన్ని దర్శించుకున్న కేంద్రమంత్రి, ఎమ్మెల్యే శంకర్



శ్రీకాకుళం మేజర్ న్యూస్ : ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. నగరంలోని బలగలోని బాలాత్రిపుర సుందరీ కాలభైరవ ఆలయాన్ని దర్శించుకున్న కేంద్రమంత్రి, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌లు గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ నాగావళి నది ఒడ్డున ప్రశాంత వాతావరణంలో ఆలయ నిర్మాణం అద్భుతంగా ఉందన్నారు. అమ్మవారి ఆలయం దినదినాభివృద్ధి చెందడం ఆనందంగా ఉందని, ఆలయానికి వచ్చే భక్తులకు సౌకర్యాలను కల్పించాలని చెప్పారు. నేటి పోటీ ప్రపంచంలో మనుషులు ఒత్తిడిని తగ్గించుకునేందుకు ఆలయాలకు వస్తుంటారని వారి మానసిక స్థితిని తెలుసుకొని వారిని సరైన మార్గంలో నడిచేలా ఆలయ అర్చకులు సూచనలు చేయాలని చెప్పారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు గణేష్ గురూజీ కేందమంత్రితో మాట్లాడుతూ దేవీ శరన్నవ రాత్రులు సందర్భంగా ఆలయ ఆవరణలో అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రతీరోజూ ప్రత్యేక, కుంకుమ పూజలు, లలితా సహస్ర పారాయణం, గాజులు, కలాలతో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. అదే విధంగా ప్రతీ రోజూ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నటు చెప్పారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహిస్తున్న గోశాలను కేంద్ర మంత్రి పరిశీలించి ఆలయ నిర్వాహకులకు అభినందించారు. ఈ సందర్భంగా నిర్వహించి అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులు అన్నప్రసాదాన్ని అందజేశారు. అనంతరం అమ్మవారి మొక్కులు తీర్చుకుని గణేష్ గురూజీ వద్ద ఆశీస్సులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి బాలా త్రిపుర సుందరీదేవి అని తెలిపారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని అమ్మవారి అనుగ్రహాన్ని పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు రెడ్డి గిరిజాశంకర్, తెలుగు యువత జిల్లా అధ్యక్షులు మెండ దాసునాయుడు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఆలయ సిబ్బంది, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇద్దరు మావోస్టుల లొంగుబాటు

● పలు కేసుల్లో నిందితులు ● చింతూరు ఏఎస్పీ పంకజ్ కుమార్ మీనా వెల్లడి




ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి అల్లూరి సీతారామరాజు జిల్లా మన్యంలో ఇద్దరు మావోయిస్ట్ పార్టీ సభ్యులు గురువారం చింతూరు ఏఎస్పీ పంకజ్ కుమార్ మీనా ఎదుట లొంగిపోయారు. చింతూరు సబ్ డివిజనల్ పోలీస్ కార్యాలయంలో ఏఎస్పీ వివరాలు వెల్లడించారు. ఆంధ్రా సరిహద్దులోని చత్తీస్‌ఘడ్ రాష్ట్రం సుకుమా జిల్లా బెజ్జి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కుంట తాలూకా దంతెస్పురం గ్రామానికి చెందిన సీపీఐ మావోయిస్ట్ పార్టీ, కిష్టారం ఏరియా కమిటీ, 8 ప్లాటూన్ పార్టీ సభ్యుడు ముచ్చిక ఐత, కింద్రెల్పాడ్ గ్రామానికి చెందిన కుంట ఏరియా కమిటీ, ఎల్‌వోఎస్ పార్టీ సభ్యురాలు మడకం హింగ లొంగిపోయారని తెలిపారు. ముచ్చిక ఐత 16వ ఏట కిష్టారం ఏరియా కమిటీ కమాండర్ మడకం జోగా ప్రోద్భలంతో మావోయిస్ట్ మిలీషియా సభ్యుడిగా మావోయిస్ట్ పార్టీలో చేరాడు. 2020 వరకు మిలీషియా సభ్యుడిగా పని చేశాడు. 2021లో కిష్టారం ఏరియా కమిటీ సభ్యుడుగా బాధ్యతలు స్వీకరించారు. ఈయన 2023 మే నెలలో సిల్గర్, కుందర్ మధ్య ఆకస్మిక దాడిలో, 2024 జూలై నెలలో ఈవోఎఫ్ దాడుల్లో పాల్గొన్నాడు. మడకం హింగ 2017లో మావోయిస్ట్ పార్టీలో చేరి శిక్షణ తీసుకుని ఎల్‌వోఎస్ సభ్యురాలిగా పని చేస్తోంది. ఈమె 2019 మే నెలలో కన్నాయి గూడెం ప్రజాకోర్టు నిర్వహించి ఇద్దరు విద్యార్థులను హతమార్చిన ఘటనలో, 2023 మార్చి నెలలో మురళి గూడ గ్రామంలో వాహనాలు దహనం కేసులో 2018 ఆగస్టు నెలలో ఈవోఎఫ్ ఘటనలో, 2021 డిసెంబర్ నెలలో బందర్పదర్ వద్ద బలగాలపై కాల్పుల ఘటనలలో నిందితురాలు. ఈ కార్యక్రమంలో చింతూరు సీఐ దుర్గా ప్రసాద్, ఎస్ఐ పేరూరి రమేష్, సీఆర్పీఎఫ్ సీఐ ఎస్ మాత్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మద్యం దుకాణాల తొలి అంకంలోనే రూ.1300 కోట్ల ఆదాయం

● అనూహ్యంగా పెరిగిన డిమాండ్ ● దరఖాస్తుల సమర్పణకు గడువు పొడగింపుతో పెరిగిన ఆదాయం

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధిః ఏపీ ప్రభుత్వానికి దసరా వేళ కాసుల పంట పండింది. మద్యం షాపుల టెండర్ల ప్రక్రియలో తొలి అంకంలోనే ఏకంగా రూ.1300 కోట్ల ఆదాయం సంపాదించింది. ఇవాళ్టితో మద్యం షాపుల టెండర్ల ప్రక్రియ పూర్తి కానుంది. ఈ నెల 14న మద్యం షాపుల కోసం వేలం నిర్వహిస్తారు. దీంతో టెండర్ల దశలోనే రూ.1300 కోట్లు సంపాదిస్తే ఇక వేలంలో ఎన్ని వేల కోట్లు సంపాదించబోతున్నారనే చర్చ రాష్ట్రవ్యాప్తంగా జరుగుతోంది. ఈసారి ఏపీలో మద్యం షాపులకు ఎక్కడా లేని డిమాండ్ నెలకొంది. రాష్ట్రంలో కొత్త మద్యం విధానం అమల్లోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్న ప్రభుత్వం.. మద్యం షాపుల లైసెన్స్ ల కోసం టెండర్ దరఖాస్తులను ఆహ్వానించింది. ఈ నెల 1న ప్రారంభించిన దరఖాస్తుల ప్రక్రియ ఇవాళ సాయంత్రం ముగియనుంది. సాయంత్రం 7 గంటల వరకూ ఆన్ లైన్ లో టెండర్ దరఖాస్తులు సమర్పించేందుకు వీలుందని అధికారులు ప్రకటించారు. ఇప్పటివరకూ 3396 మద్యం షాపుల టెండర్ల కోసం 65424 దరఖాస్తులు వచ్చినట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఇవాళ సాయంత్రం గడువు ముగిసిన తర్వాత వీటి సంఖ్య మరింత పెరగనుంది. ఇప్పటికే వీటి ద్వారా రూ.1300 కోట్లు ఆర్జించిన ప్రభుత్వం.. ఇవాళ రాత్రి కల్లా మరింత ఆదాయం సంపాదించబోతోంది. రాత్రి 7 గంటల కల్లా క్యూలైన్ లో ఉన్న వారికి మాత్రమే టెండర్ దరఖాస్తు దాఖలుకు అవకాశం కల్పించనున్నారు. ఈసారి ఏపీతో పాటు ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి కూడా దరఖాస్తులు వచ్చాయి. వాస్తవానికి రాష్ట్రంలో మద్యం షాపుల లైసెన్స్ ల కోసం ఈ నెల 10 వరకే దరఖాస్తుల గడువు ఉంది. 11న మద్యం షాపుల టెండర్ల వేలం నిర్వహించి 12 నుంచి కొత్త విధానం అమల్లోకి తేవాలని ప్రభుత్వం భావించింది. కానీ అనూహ్యంగా పెరిగిన డిమాండ్ తో టెండర్ల దాఖలు గడువును ఇవాళ్టి వరకూ పెంచడంతో పాటు వేలం తేదీనీ 14కు మార్చింది.



# బంగాళాఖాతంలో ఆవర్తనం

● వాయుగుండంగా మారే చాన్స్ ● 17 నాటికి తీరం దాటే అవకాశం
● పలు జిల్లాల్లో భారీ వర్షాలు ● వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి ఏపీకి తుపాను ముప్పు పొంచి ఉంది. దక్షిణ బంగాళాఖాతంలో శనివారం నాటికి ఉపరితల ఆవర్తనం ఏర్పడే అవకాశం ఉంది. తర్వాత పశ్చిమ దిశగా పయనించి, నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనంగా బలపడనుంది. అది ఈ నెల 13 నుంచి 15 మధ్య వాయుగుండంగా రూపాంతరం చెందుతుందని వాతావరణ నమూనాలు (మోడల్స్) అంచనా వేస్తున్నాయి.

**17న తీరం దాటే అవకాశం..** ఇక.. తీవ్ర వాయుగుండంగా బలపడి, ఈ నెల 17 నాటికి రాష్ట్రంలోని తీరం దాటవచ్చని భారత వాతావరణ శాఖ భావిస్తోంది. ఇది తుపానుగా బలపడి రాష్ట్రంలోని దక్షిణ కోస్తా, ఉత్తర తమిళనాడు రాష్ట్రం మధ్యలో ఈ నెల 15 నాటికి తీరాన్ని తాకవచ్చని అమెరికా నమూనా అంచనా వేస్తోంది. అల్పపీడనం ఏర్పడ్డాక దీనిపై స్పష్టత వస్తుందని వాతావరణ నిపుణులు అంటున్నారు.

**పలు జిల్లాలో భారీ వర్షాలు..** తుపాను ప్రభావంతో ఏపీలోని దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో ఈ నెల 14 నుంచి 16 వరకు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఇక.. అరేబియా సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర అల్పపీడనంగా బలపడింది. కర్నాటక, గోవా రాష్ట్రాల తీరాలకు సమీపంలో కేంద్రీకృతమై ఉంది. ఇది వాయవ్య దిశగా కదులుతూ 2 లేదా 3 రోజుల్లో మధ్య అరేబియా సముద్రంలో వాయుగుండంగా బలపడుతుందని వాతావరణ శాఖ తెలిపింది. ఏలూరు, ప్రకాశం, పశ్చిమ గోదావరి, పల్నాడు, శ్రీసత్యసాయి తదితర జిల్లాల్లో గురువారం తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిశాయి.

# గోదావరి పుష్కరాలకు రూ. 100 కోట్లు

● భారీగా నిధులు విడుదల చేసిన కేంద్ర ప్రభుత్వం



అమరావతి : ఏపీలోని కూటమి ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఏపీలో జరగబోయే గోదావరి పుష్కరాలకు కేంద్ర ప్రభుత్వం 100 కోట్ల రూపాయలు విడుదల చేసింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. 2027లో జరగనున్న గోదావరి నది పుష్కరాలకు కేంద్ర ప్రభుత్వం 100 కోట్ల రూపాయలు నిధులు విడుదల చేసింది. తూర్పుగోదావరి జిల్లాకు గోదావరి పుష్కరాలు నిర్వహించడం కోసం 100 కోట్ల రూపాయలు నిధులు కేటాయింపులు జరిగాయి. 2027 గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని అఖండ గోదావరి ప్రాజెక్ట్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం తూర్పు గోదావరి జిల్లాకు ఈ నిధులు కేటాయించారు. ఈ దిశగా టూరిజం శాఖ అధికారులు పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. మరోవైపు.. 2027లో జరిగే గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలోనే చేపట్టాల్సిన పనులపై ప్రతిపాదనలు సిద్ధం చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. దీనికి సంబంధించి ఏపీ మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ నివేదిక రూపొందించాలని ఇప్పటికే అధికారులను ఆదేశించారు.

# టాటా ట్రస్ట్స్ చైర్మెన్‌గా నోయెల్ టాటా

● 2014 నుంచి ట్రెంట్ లిమిటెడ్ కు చైర్మెన్‌గా వ్యవహరిస్తున్న నోయెల్ ● ఇప్పటికే అనేక లిస్టెడ్ టాటా సంస్థల బోర్డుల్లో మెంబర్

ముంబై : టాటా గ్రూప్నకు చెందిన దాతృత్వ విభాగం టాటా ట్రస్ట్స్ ఛైర్మెన్ గానోయెల్ టాటా నియమితులయ్యారు. అక్టోబర్ 11న ముంబయి లో జరిగిన సమావేశంలో ఆయన నియామకం ఏకగ్రీవంగా జరిగిందని సమా చారం. రతన్ టాటా మరణించిన నేపథ్యంలో ఆయన టాటా ట్రస్ట్ పగ్గాలు చేపట్టారు. రతన్ టాటాకు నోయెల్ టాటా సవతి సోదరుడు అవుతారు. ఆయన 2014 నుంచి ట్రెంట్ లిమిటెడ్కు ఛైర్మెన్ గ్గా వ్యవహరిస్తున్నారు. ఆ రిటైల్ దుస్తుల వ్యాపారన్ని విజయవంతంగా నడిపిస్తున్నారు కూడా. గత దశాబ్ద కాలంలో నోయెల్ హయాంలో సదరు కంపెనీ షేర్ విలువ 6000 శాతం పెరిగింది. దీనిని బట్టి అతని వ్యాపార దక్షత ఏమిటో అర్థం చేసుకోవచ్చు. అయితే ఇప్పటి వరకు టాటా ట్రస్టులు అన్నింటినీ రతన్ టాటానే చూసుకునేవారు. కానీ ఆయన తన తరువాత ఎవరు వీటిని నడపాలో చెప్పకుండానే 86 ఏళ్ల వయస్సులో మరణించారు. దీనితో రతన్ టాటా ఎప్పుడూ చెప్పే 'ముందుకు వెళ్తూనే ఉండాలి' విధానాన్ని అనుసరించి, టాటా గ్రూప్ నోయెల్ టాటాను టాటా ట్రస్టులకు ఛైర్మన్గా నియమించింది.




**నోయెల్ ప్రస్థానం** నోయెల్ టాటా 2010 నుంచి 2021 వరకు టాటా ఇంటర్నేషనల్ లిమిటెడ్కు నాయకత్వం వహించారు. ఆ సమయంలో సదరు కమోడిటీ ట్రేడింగ్ సంస్థ ఆదాయం 500 మిలియన్ డాలర్ల నుంచి 3 బిలియన్ డాలర్లకు పెరిగింది. టాటా ట్రస్ట్స్ వైబ్సైట్ ప్రకారం, నోయెల్ టాటా – టాటా స్టీల్ లిమిటెడ్, వోల్టాస్ లిమిడెడ్ సహా అనేక లిస్టెడ్ టాటా సంస్థల బోర్డుల్లో మెంబర్గా ఉన్నారు. అంతేకాదు ఆయన పిల్లలు – మాయ, నెవిల్లే, లేహ్ కూడా టాటాలకు చెందిన స్వచ్ఛంద సంస్థలకు ధర్మకర్తలుగా ఉన్నారు. నావల్ టాటాకు ఇద్దరు భార్యలు. ఒక భార్య కుమారుడు రతన్ టాటా, సిమోన్ టాటా. మరో భార్య కుమారుడు నోయెల్ టాటా. ఈ విధంగా రతన్ టాటాకు నోయెల్ టాటా సవతి సోదరుడు అవుతారు. ఇప్పటికే ఆయన రతన్ టాటా ట్రస్ట్, సర్ దొరాబ్జీ టాటా ట్రస్టు బోర్డుల్లో సభ్యునిగా ఉన్నారు. ఇప్పుడు వాటికి కూడా ఛైర్మన్ అయ్యారు.

## సీఎం బాబు దసరా శుభాకాంక్షలు

అమరావతి :విజయదశమి సందర్భంగా దేశ, విదేశాల్లోని తెలుగు ప్రజలకు శుభాకాంక్షలు. ప్రజలంతా సుఖ శాంతులతో వర్ధిల్లేలా చూడాలని ఆ కనకదుర్గమ్మ తల్లిని వేడుకుంటున్నానని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. శుక్రవారం ఆయన ట్విట్టర్లో ఓ ట్వీట్ను చేస్తూ . చెడు పై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిర్వహించుకునే దసరా పండుగ మన జీవితాల్లో కొత్త వెలుగు నింపాలని ఆకాంక్షిస్తు, అందరికి మనస్ఫూర్తిగా దసరా శుభాకాంక్షలు తెలుపుతున్నానని తెలిపారు.

# వచ్చే నెలలో బడ్జెట్ సమావేశాలు




ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధిః రాష్ట్ర వార్షిక బడ్జెట్ (2024–25) సమావేశాలు వచ్చేనెలో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎన్నికల ముందు వైసీపీ ప్రభుత్వం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ఆమోదించింది. తరువాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థలో లోటుపాట్లకు అనుగుణంగా మరో విడత ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌నే ఆమోదించింది. వచ్చే నెలాఖరుతో గడువు ముగియనుంది. గత ప్రభుత్వ నిర్వాకంతో ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైన నేపథ్యంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో నిధులు మళ్లింపు జరిగింది. ఆయా శాఖల పరిధిలో గతంలో జరిగిన ఆర్థిక లావాదేవీలను గుర్తించడంతో పాటు ఈ ఆర్థిక సంవత్సరానికి అంచనా బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ ఏడ్మాది జూలై నెలాఖరులోగానే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆర్థికశాఖ సర్క్యులర్ కూడా జారీ చేసింది. అయితే పూర్తి స్థాయిలో సమగ్రమైన సమాచారం లేకపోవటంతో పాటు ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలు.. కొత్తగా పునరుద్ధరణ పథకాలకు అయ్యే ఖర్చులు.. ఆదాయం అంచనాలపై స్పష్టత రాలేదు. దీంతో డిసెంబర్ నుంచి వచ్చే ఏడాది మార్చి నెలాఖరు వరకు చివరి విడత కూడా ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌కు ఆర్డినెన్స్ తెచ్చి 2025–26 బడ్జెట్ సమావేశాల్లో రెండేళ్ల బడ్జెట్‌కు ర్యాటిఫై చేసుకునే అంశాన్ని పరిశీలన జరిపింది.

# ఇళ్లు లేని పేదలు అందరికీ ఐదేళ్లలో శాశ్వత గృహాలు

● రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి రాష్ట్రంలో ఏ పేదవాడు కూడా నాకు ఇల్లు లేదు అనే మాట అనకుండా వచ్చే ఐదేళ్లలో నిరుపేదలు అందరికీ శాశ్వత గృహ వసతి కల్పించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు దిశా నిర్ధేశం చేశారని, ఆ లక్ష్య సాధన దిశగా గృహనిర్మాణ శాఖ ముందుకు అడుగులు వేస్తున్నదని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార %డ% పౌర సంబంధాలా శాఖ మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. రాష్ట్ర సచివాలయం నాల్గోబ్లాక్ మొదటి అంతస్తులో ఆధునీకరించబడిన తన చాంబరులో శాస్త్రోత్తంగా శుక్రవారం ఆయన ప్రవేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు మంత్రిగా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, నారా లోకేష్ కు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్కు మరియు దేశ ప్రధాని నరేంద్ర మోడీకి ధన్యవాదములు తెలిపారు. ప్రజలకు మేలు చేయడానికి, పాదర్శకంగా పాలన అందజేయడానికి తమ ప్రభుత్వం కంకణం కట్టుకుందని, ఆ దిశలోనే రాష్ట్రంలోని నిరుపేదలు అందరికీ ఎంతో పారదర్శకంగా నాణ్యమైన ఇళ్లు నిర్మించి ఇచ్చేందుకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ఎస్సీలకు, బీసీలకు మేమే చాంఫియన్లు అని చెప్పుకునే గత పాలకుల హయాంలో గృహ నిర్మాణ శాఖలో ఎన్నో అవకతవకలు జరిగాయని, నిరుపేదల గృహ నిర్మాణాలకై కేంద్రం ఇచ్చిన దాదాపు రూ.4,500 కోట్ల నిధులను ప్రక్కదోవ పట్టించి నిరుపేదలకు అన్యాయం చేయడం జరిగిందన్నారు. గతంలో నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఒక్కొక్క యూనిట్ కు రూ.2.50 లక్షల ఋణ సహాయాన్ని అందజేస్తే, దాన్ని రూ.1.80 లక్షలకు తగ్గించడమే కాకుండా ఎస్సీ, ఎస్టీల గృహ నిర్మాణానికై రూ.50 వేల నుండి లక్ష రూపాయల వరకు అదనంగా అందజేసే ఆర్థిక సహాయాన్ని కూడా పూర్తిగా రద్దు చేసిన ఘనత గత ప్రభుత్వానిదే అన్నారు. రాష్ట్రాభివృద్దిలో కీలక పాత్ర పోషిస్తున్న జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చే విషయంలోనే కాకుండా, ఇంకా వారికి ఏ విధంగా మేలు చేకూర్చగలమో అనే కోణంలో ఆలోచించి ప్రతిపాదనలు రూపొందించాలని ఈ మధ్య జరిగిన సమీక్షా సమావేశంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించినట్లుగా తగు చర్యలు చేపట్టడం జరిగిందని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఎన్నో తప్పిదాలు జరిగాయని, రాష్ట్రాన్ని రూ.10.50 లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి దింపడమే కాకుండా, ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితికి రాష్ట్రాన్ని తీసుకు రావడం జరిగిందన్నారు. రాష్ట్రంలో ఎటు వంటి ఆదాయ వనరులు, అభివృద్ది లేకుండా చేయడం జరిగిందని, గతంలో జరిగిన ఇటు వంటి తప్పిదాలు అన్నింటనీ చక్కదిద్ది రాష్ట్రాన్ని ఒక గాడిలో పెట్టేందుకు తమ ప్రభుత్వ వంద రోజుల పాలనలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంతగానో కృషిచేస్తున్నట్లు మంత్రి తెలిపారు. యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు లేకుండా చేశారని, అభివృద్దిని అందిపుచ్చుకునేలా యువతీ యువకులను సిద్ధం చేయాలనే లక్ష్యంతో రాష్ట్రంలో స్కిల్ సెన్సెస్ ద్వారా ఉపాధి అవకాశాలు పెంచేందుకు కృషి చేయడం జరుగుచున్నదన్నారు. ప్రజలు కేవలం సంక్షేమ పథకాలపైనే ఆధారపడకుండా వారికి బంగారు భవిష్యత్తును ఏర్పాటుచేసే దిశగా కృషి జరుగుచున్నదని, 2029 నాటికి రాష్ట్ర జిడిపి, ప్రతి పౌరుడి తలసరి ఆదాయం పెంచాలనే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని అన్నింటినీ దశల వారీగా అమలు చేయడం జరుగుచున్నదని, సామాజిక భద్రతా పింఛన్లను రూ.4 వేలకు పెంచి, మూడు నెలల బకాయిలను కలిపి రూ.7 వేలు చెల్లించండ జరిగిందన్నారు. రాష్ట్రానికి మంచి నాయకత్వం ఉంటే ప్రభుత్వ ఉద్యోగులు కూడా మంచి ఫలితాలు చూపగలరు అనే విధంగా ఒకే రోజున 65 లక్షల మందికి పెన్షన్ ను ప్రభుత్వోద్యోగులు పంపిణీ చేశారన్నారు. గత ప్రభుత్వ బకాయిలతో మాకు సంబందం లేదు అని భావించ కుండా గత ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.1600 కోట్ల ధాన్య కొనుగోలు బకాయిలను రైతులకు చెల్లించడం జరిగిందన్నారు. కేంద్రం మంచి ఉద్దేశంతో భూ హక్కుల చట్టాన్ని తేవాలని ఆలోచన చేస్తే ఆ చట్టంలో అన్ని తమకు నచ్చేలా నిబంధనలను మార్చుకుని దోపిడీకి రాచమార్గంవేస్తే, వారి దోపిడీకి అడ్డుకట్ట వేసేందుకే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ను రద్దుచేయడం జరిగిందన్నారు. విద్య అంటే భవనాలు నిర్మించడం, రంగులు దిద్దడమే కాదని, విద్యార్థులకు చక్కని చదువు, జ్ఞానం, విజ్ఞానం అందజేయాలనే లక్ష్యంతో 16,700 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ నిర్వహించడం జరుగుచున్నదన్నారు. ఈ దీపావళి నుండి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్ల పంపిణీని అమలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు.

### దసరా, దీపావళికి 1,400 ప్రత్యేక రైళ్లను నడపనున్న

# దక్షిణ మధ్య రైల్వే

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి దసరా, దీపావళి పండుగల రద్దీ దృష్ట్యా దక్షిణ మధ్య రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. తెలుగు రాష్ట్రాలతో పాటు బీహార్, యూపీ, పశ్చిమ బెంగాల్‌కు రద్దీ ఎక్కువ ఉంటుంది. దీనిని దృష్టిలో ఉంచుకొని రైల్వే శాఖ రోజువారీ రైళ్లతో పాటు ప్రత్యేకంగా 1400 రైళ్లను నడుపనున్నట్లు ప్రకటించింది. ఈ రైళ్లను నవంబర్ 30 వరకు నడపనుంది. ప్రయాణీకుల సౌకర్యార్థం అదనపు బుకింగ్ కౌంటర్లను కూడా ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

# అక్టోబర్ 30 నుంచి 'లక్కీ భాస్కర్' ప్రీమియర్ షోలు



వివిధ భాషలలో సినిమాలు చేస్తూ, దేశవ్యాప్తంగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు మలయాళ స్టార్ దుల్కర్ సల్మాన్. తెలుగులోనూ "మహానటి", "సీతా రామం" వంటి ఘన విజయాలను సొంతం చేసుకున్న ఆయన, ఇప్పుడు "లక్కీ భాస్కర్" అనే మరో వైవిధ్యమైన చిత్రంతో అలరించడానికి సిద్ధమవుతున్నారు. బ్లాక్ బస్టర్ డైరెక్టర్ వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని.. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్‌ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. మీనాక్షి చౌదరి కథానాయిక. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రం దీపావళి కానుకగా అక్టోబర్ 31వ తేదీన ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల కానుంది. నిర్మాత నాగవంశీ మాట్లాడుతూ.. "దేవర మరియు ఇతర దసరా సినిమాల హడావుడి పూర్తయ్యాక ప్రచార కార్యక్రమాలు మొదలుపెట్టాలని ఉద్దేశంతో ఇప్పటిదాకా ఆగాము. ఇక నుంచి వరుసగా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తాము. అక్టోబర్ 21న ట్రైలర్ విడుదల చేస్తాము. అక్టోబర్ 26 లేదా 27 తేదీల్లో ప్రీ రిలీజ్ ఈవెంట్ ను నిర్వహించనున్నాము. అక్టోబర్ 30 నుంచి ప్రీమియర్లు ప్రదర్శించనున్నాము. సినిమా పట్ల చాలా నమ్మకంగా ఉన్నాము. అందుకే ముందు రోజు సాయంత్రం నుంచే తెలుగు రాష్ట్రాల వ్యాప్తంగా ప్రీమియర్ షోలు వేయాలని నిర్ణయించాము." అన్నారు.

# 'లెవెన్' కోసం శ్రుతిహాసన్ పాట

నవీన్ చంద్ర హీరోగా లోకేశ్ అజ్ల్స్ దర్శకత్వంలో రూపొందిన రేసీ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ 'లెవెన్'. ఎఆర్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్ పై అజ్మల్ ఖాన్, రేయా హరి ఈ చిత్రాన్ని నిర్మిస్తు న్నారు. ఈ మూవీని తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో రూపొందించారు. ఇప్పటికే విడుదలైన టీజర్ కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. తాజాగా ఈ సినిమా కోసం మల్టీ ట్యాలెంటెడ్ శ్రుతిహాసన్ పాడిన 'ది డెవిల్ ఈజ్ వెయిటింగ్' సాంగ్ ని రిలీజ్ చేశారు. ఉలగనాయగన్ కమల్ హాసన్ ఈ సాంగ్ ని లాంచ్ చేసి మూవీ టీంకి బెస్ట్ విషెస్



అందించారు. కంపోజర్ డి.ఇమ్మాన్ ఈ సాంగ్ ని ఎలక్ట్రిఫైయింగ్ బీట్స్ తో టెర్రిఫిక్ నెంబర్ గా ట్యూన్ చేశారు. లోకేశ్ అజ్ల్స్ రాసిన లిరిక్స్ స్టొరీ, హీరో క్యారెక్టర్ ఎసెన్స్ ని ప్రజెంట్ చేశాయి. శ్రుతిహాసన్ తన ఎనర్జిటిక్ వోకల్స్ తో మెస్మరైజ్ చేశారు. ఆమె వాయిస్ లిజనర్స్ ని కట్టిపడేసింది. ప్రస్తుతం ఈ సాంగ్ సోషల్ మీడియా, మ్యూజిక్ చార్ట్స్ లో ట్రెండ్ అవుతోంది. 'సిల నెరంగళిల్ సిల మణిధర్గళ్' చిత్రంలో నటించిన రేయా హరి కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో 'విరుమండి' ఫేమ్ అభిరామి, 'వత్తికూచి' ఫేమ్ దిలీపన్, 'మద్రాస్' ఫేమ్ రిత్విక కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

# స్టోరీకే రెండేళ్లుపడితే



సూపర్ స్టార్ మహేష్ బాబు, అగ్ర దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి సినిమా కోసం యావత్ సినీ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అధికారిక ప్రకటన రాకముందే ఈ ప్రాజెక్ట్ పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. తాజాగా రచయిత కేవీ విజయేంద్ర ప్రసాద్ ఈ మూవీ గురించి ఓ బిగ్ అప్డేట్ అందించారు. మహేష్‌బాబు29 అనే వర్కింగ్ టైటిల్ తో పిలవబడుతున్న ఈ సినిమా ఎప్పుడు సెట్స్ మీదకి వెళ్తుందనే దానిపై అనేక వార్తలు వచ్చాయి. వాటన్నిటికీ ఫుల్ స్టాప్ పెడుతూ 2025 జనవరి నెలలో ఈ మూవీ షూటింగ్ ప్రారంభం అవుతుందని విజయేంద్ర ప్రసాద్ క్లారిటీ ఇచ్చేశారు. అలానే స్టోరీ గురించి చెబుతూ.. మామూలుగా తాను ఓ కథ రాయడానికి 3-4 వారాల సమయం సరిపోతుందని, కానీ మహేష్ బాబు కోసం కథ రెడీ చేయడానికి 2 సంవత్సరాలు పట్టిందని అన్నారు. ఎన్నో బ్లాక్ బస్టర్ సినిమాలకు కథలు అందించిన సుదీర్ఘమైన అనుభవమున్న సీనియర్ రైటర్.. మహేష్ కోసం స్టోరీ సిద్ధం చేయడానికి 2 ఏళ్లు టైమ్ తీసుకున్నారంటే అది ఎలాంటి సబ్జెక్ట్ అయ్యుంటుందో ఊహించుకోవచ్చు. అందులోనూ ఆర్ఆర్ఆర్ వంటి గ్లోబల్ హిట్ తర్వాత రాజమౌళి నుంచి రాబోతున్న సినిమా ఇది. గ్లోబ్ ట్రాటనింగ్ మూవీ అని, తన కెరీర్ లోనే బిగ్గెస్ట్ ప్రాజెక్ట్ అని జక్కన్న ఇప్పటికే ప్రకటించారు. కాబట్టి విజయేంద్రప్రసాద్ కథ విషయంలో ఎక్కువ కసరత్తులు చేశారని అనుకోవచ్చు. మహేష్ బాబుతో ఆఫ్రికన్ ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్ అడ్వెంచర్ స్టోరీ చేయబోతున్నట్లు విజయేంద్ర ప్రసాద్ చాలా ఇంటర్వ్యూలలో చెప్పారు. దీని కోసం బ్రిటీష్-ఆఫ్రికన్ రచయిత విల్బర్ స్మిత్ రాసిన నవలను రీసెర్చ్ చేసినట్లు తెలుస్తోంది. కాకపోతే స్క్రిప్ట్ రెడీ చెయ్యడానికే రెండేళ్ల సమయం తీసుకుంటే, ఇంక ఈ కథను తెరకెక్కించడానికి రాజమౌళి ఇంకెన్నేళ్ళు సమయం తీసుకుంటారో అని అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. జక్కన్న సినిమా అంటే ఎప్పుడు కంప్లీట్ అవుతుందో ఎవరూ చెప్పలేరనే సంగతి అందరికీ తెలుసు. ఇప్పుడు మహేష్‌బాబు29 సినిమా కూడా ఎప్పుడు పూర్తవుతుందో ఊహించలేమని అంటున్నారు. కానీ ఎప్పుడొచ్చినా ఈ మూవీ గ్లోబల్ బాక్సాఫీస్ ను షేక్ చెయ్యడం గ్యారంటీ అని నమ్ముతున్నారు. దర్శక ధీరుడు రాజమౌళి విజయాల వెనుక ఆయన తండ్రి విజయేంద్ర ప్రసాద్ కూడా ఉన్నారనే విషయం ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. డెబ్యూ మూవీ 'స్టూడెంట్ నెం.1', 'మర్యాద రామన్న' మినహా మిగతా అన్ని చిత్రాలకు ఆయనే కథలు అందించారు. ఇప్పుడు మహేశ్ బాబు మూవీకి సైతం అద్భుతమైన కథ సిద్ధం చేసి ఉంటారని ఫ్యాన్స్ భావిస్తున్నారు. అది ఎలాంటి స్టోరీ లైన్ తో రూపొందునుందో తెలియాలంటే, ఎప్పటిలాగే జక్కన్న ప్రెస్ మీట్ పెట్టి సినిమా వివరాలు వెల్లడించే వరకూ ఆగాల్సిందే. మహేష్‌బాబు29 సినిమాని దుర్గా ఆర్ట్స్ బ్యానర్ లో కెఎల్ నారాయణ నిర్మించను న్నారు. ఓ ప్రముఖ హాలీవుడ్ సంస్థ నిర్మాణంలో భాగస్వామిగా చేరే అవకాశం ఉందని సమాచారం. ఎంఎం కీరవాణి సంగీతం సమకూర్చనున్న ఈ సినిమా కోసం టాప్ టెక్నీషియన్స్ వర్క్ చేయనున్నారు.



# 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో' టీజర్

కార్తికేయ2 చిత్రంతో నేషనల్ రేంజ్ పాపులారిటీని సంపాదించుకున్న హీరో నిఖిల్ ఇప్పుడు పలు క్రేజీ ప్రాజెక్ట్స్‌తో బిజీగా ఉంటోన్న సంగతి తెలిసిందే. అందులో భాగంగా నిఖిల్ కథానాయకుడిగా వైవిధ్యమైన సినిమాలతో తనదైన గుర్తింపు సంపాదించుకున్న దర్శకుడు సుధీర్ వర్మ దర్శకత్వంలో నటిస్తోన్న యాక్షన్ ఎంటర్‌టైనర్ అప్పుడో ఇప్పుడో ఎప్పుడో. స్వామి రారా, కేశవ వంటి బ్లాక్ బస్టర్ చిత్రాల తర్వాత వీరిద్దరి కాంబోలో రాబోతున్న సినిమా కావటంతో సినిమాపై భారీ ఎక్స్‌పెక్టేషన్స్ ఉన్నాయి. ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర ఎల్ఎల్‌పి బ్యానర్‌పై ఎన్నో బ్లాక్ బస్టర్ చిత్రాలను అందించిన సీనియర్ నిర్మాత బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ దీన్ని నిర్మిస్తున్నారు. ఇటీవలె విడుదల చేసిన సినిమా ఫస్ట్ లుక్‌కి చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ క్రమంలో దసరా సందర్భంగా మేకర్స్ ఈ మూవీ టీజర్‌ను విడుదల చేశారు. ఈ సినిమాలో నిఖిల్ రిషి అనే పాత్రలో కనిపించనున్నారని టీజర్ చూస్తుంటే తెలుస్తోంది. తనకు, హీరోయిన్ రుక్మిణి వసంత్‌కు మధ్య లవ్ ట్రాక్, వారి మధ్య కెమిస్ట్రీ చక్కగా ఉంది. అలాగే ఇద్దరి మధ్యలో తెలియని మరో సీక్రెట్ లవ్ స్టోరీ ఏదో ఉందనే క్యూరియాసిటీ కూడా కలుగుతోంది. అదే హీరోయిన్ దివ్యాంశ కౌశిక్. అసలు వీరి ముగ్గురు మధ్య లవ్ ట్రాక్ ఎలా ఉండబోతుందో తెలియాలంటే సినిమా రిలీజ్ వరకు ఆగాల్సిందే. అలాగే టీజర్‌లోని యాక్షన్ ఎలిమెంట్స్ ఆసక్తికరంగా ఆకట్టుకంటున్నాయి.

# రోలర్‌కోస్టర్ రైడ్‌గా 'నరుడి బ్రతుకు నటన' ట్రైలర్



శివ కుమార్ రామచంద్రవరపు, నితిన్ ప్రసన్న ప్రధాన పాత్రల్లో నరుడి బ్రతుకు నటన అనే చిత్రం రాబోతోంది. ఇప్పటి వరకు వదిలిన కంటెంట్‌కు మంచి స్పందన వచ్చింది. శృతి జయన్, ఐశ్వర్య అనిల్ కుమార్, వైవా రాఘవ్ ఇతర ప్రముఖ తారాగణంతో రాబోతోన్న ఈ చిత్రానికి రిషికేశ్వర్ యోగి దర్శకత్వం వహించారు. టిజి విశ్వ ప్రసాద్, సుకుమార్ బోరెడ్డి, డాక్టర్ సింధు రెడ్డి ఈ సినిమాను నిర్మించగా.. వివేక్ కూచిభొట్ల సహ నిర్మాతగా వ్యవరించారు. సుధీర్ కుమార్ ప్రాజెక్ట్ హెడ్. ఈ సినిమా థియెట్రికల్ ట్రైలర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. మెగా డాటర్ నిహారిక కొణిదెల ఈ మూవీ ట్రైలర్ విడుదల చేసి.. యూనిట్ కి అల్ ది బెస్ట్ తెలిపారు. ఈ ట్రైలర్.. శివ కుమార్ నటుడు అవ్వాలని ఆడిషన్స్ ఇస్తూ ఫెయిల్ అయ్యే సీన్ తో ఓపెన్ అవుతోంది. అందరూ అతడ్ని నిరుత్సాహ పరుస్తూనే ఉంటారు. జీవితం అంటే ఏంటో తెలిస్తేనే.. నటన తెలుస్తుందని చెప్పడంతో.. ఓ తెలియని ఊరికి వెళ్తాడు. అలా కథ హైద్రాబాద్ నుంచి కేరళకు షిఫ్ట్ అవుతుంది. ట్రైలర్ లో చూపించిన కేరళ అందాలు, సినిమాలోని ఎమోషన్స్ ప్రధాన ఆకర్షణగా నిలిచేలా ఉన్నాయి. హాస్యం, ప్రేమ, ఎమోషన్ ఇలా అన్ని రకాల అంశాలను జోడించి ఈ చిత్రాన్ని తీశారని ట్రైలర్ చెబుతోంది.



నభా దేవి సోగసు

# డబ్ల్యూటీసీ టాప్‌లో భారత్

- చివరి స్థానానికి దిగజారిన పాకిస్థాన్
- టాప్ -3లో భారత్ (74.24), ఆస్ట్రేలియా (62.50), శ్రీలంక (55.56)



లండన్: పాకిస్థాన్ను తొలి టెస్టులో ఓడించిన ఇంగ్లండ్కు ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో పెద్ద మార్పు రాలేదు. గతంలో ఉన్న నాలుగో స్థానంలోనే ఇంగ్లండ్ ఇప్పుడూ కొనసాగుతోంది. అయితే, పర్సంటేజీని 42.19 నుంచి 45.59 వరకు పెంచుకోగలిగింది. మరోవైపు స్వదేశంలో మరో ఓటమిని చవిచూసిన పాకిస్థాన్ మాత్రం పాయింట్ల పట్టికలో చివరి స్థానానికి దిగజారింది. ఈ మ్యాచ్ ముందు వరకు 19.05 శాతంతో ఎనిమిదిలో ఉన్న పాక్.. సవరించిన గణాంకాల ప్రకారం 16.67 శాతంతో తొమ్మిదో ప్లేస్కు పడిపోయింది. టాప్ -3లో భారత్ (74.24), ఆస్ట్రేలియా (62.50), శ్రీలంక (55.56) ఉన్నాయి. వచ్చే ఏడాది మార్చి - ఏప్రిల్నాటికి తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు డబ్ల్యూటీసీ ఫైనల్లో తలపడతాయి.

కేవలం రెండే టెస్టుల్లో విజయం..

డబ్ల్యూటీసీ 2023-25 సీజన్లో పాకిస్థాన్ 8 మ్యాచ్లు ఆడింది. కేవలం రెండింట్లోనే విజయం సాధించింది. మిగతా ఆరూ ఓడిపోవడం గమనార్హం. మరోవైపు ఇంగ్లండ్ అన్ని జట్ల కంటే 17 టెస్టులు ఆడగా.. 9 మ్యాచుల్లో గెలిచింది. మరో ఏడింట్లో ఓడి, ఒక మ్యాచ్ను డ్రా చేసుకుంది. బజ్బాల్ క్రికెట్తో ఫలితం తేలడమే లక్ష్యంగా గత కొన్నేళ్లుగా ఇంగ్లండ్ దూకుడు ప్రదర్శిస్తోంది. ఈ క్రమంలో వరుసగా మ్యాచుల్లో గెలుస్తూ వస్తోన్న ఇంగ్లండ్ ఫైనల్కు చేరాలంటే మిగతా నాలుగు మ్యాచుల్లోనూ గెలవాల్సి ఉంది. అప్పుడు ఇతర జట్ల సమీకరణాలనుబట్టి టాప్-2లోకి వచ్చేందుకు వీలుంది. ఇప్పుడు పాక్తో మరొక టెస్టు.. ఆ తర్వాత న్యూజిలాండ్తో మూడు టెస్టుల సిరీస్ ఆడనుంది. మరోవైపు భారత్కు 8 మ్యాచుల్లో 3, ఆసీస్కు ఏడు మ్యాచుల్లో 4 విజయాలు దక్కితే చాలు మరోసారి డబ్ల్యూటీసీ ఫైనల్కు చేరతాయి.

బౌలింగ్లో విఫలమయ్యాం: షాన్ మసూద్

తొలి ఇన్నింగ్స్లో 550కిపైగా పరుగులు బోర్డుపై ఉంచినప్పుడు.. బౌలర్లు పది వికెట్లు తీసి అండగా ఉండాల్సింది. కానీ, ప్రత్యర్థికి 220కిపైగా ఆధిక్యం ఇచ్చాం. కానీ, ఇంగ్లండ్ బౌలర్లు మాత్రం మా 20 వికెట్లను పడగొట్టగలిగారు. సొంతం పిచ్లపై ఉన్న అడ్వాంటేజ్ను మా బౌలర్లు సరిగ్గా వాడుకోలేకపోయారు. మున్ముందు జరిగే మ్యాచుల్లో వీటిపై మరింత దృష్టిపెడతాం అని పాక్ కెప్టెన్ షాన్ మసూద్ వ్యాఖ్యానించాడు.

# నేడు ఉప్పల్ మైదానంలో మూడో టీ20


- టీమిండియాలో భారీ మార్పులు
- మరికొందరు తెలుగు ఆటగాళ్లకు ఛాన్స్
- రాత్రి 7 నుంచి మ్యాచ్



హైదరాబాద్: మరో మ్యాచ్ మిగిలుండగానే బంగ్లాదేశ్‌పై టీ20 సిరీస్ను 2-0తో భారత్ కైవసం చేసుకుంది. మూడు టీ20ల సిరీస్లో నామమాత్రమైన ఆఖరి మ్యాచ్ హైదరాబాద్ ఉప్పల్ మైదానంలో శనివారం జరగనుంది. రాత్రి 7 గంటలకు మ్యాచ్ ఆరంభం కానుంది. ఇప్పటికే టీ20 సిరీస్ గెలవడంతో.. బెంచ్ బలాన్ని పరీక్షించుకోవాలని కోచ్ గౌతమ్ గంభీర్, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో మూడో టీ20లో భారత తుది జట్టులో భారీ మార్పులు చోటుచేసుకునే అవకాశాలు ఉన్నాయి. సంజూ శాంసన్, అభిషేక్ శర్మలు ఓపెనర్లుగా కొనసాగనున్నారు. రెండో టీ20లో అభిషేక్ మంచి ఇన్నింగ్స్ ఆడగా.. సంజూ భారీ ఇన్నింగ్స్ బాకీ ఉన్నాడు. సూర్యకుమార్ యాదవ్ మూడో స్థానంలో ఆడనుండగా.. మెరుపు హాఫ్ సెంచరీ చేసిన తెలుగు ఆటగాడు నితీశ్ కుమార్ రెడ్డి కొనసాగనున్నాడు. స్టార్ ఆల్రౌండర్ హార్దిక్ పాండ్యాకు విశ్రాంతి ఇవ్వాలని మేనేజ్మెంట్ భావిస్తోంది. హార్దిక్ స్థానంలో తెలుగు కుర్రాడు తిలక్ వర్మకు అవకాశం దక్కనుంది. ఇదే జరిగితే ఉప్పల్ స్టేడియంలో ఇద్దరు తెలుగు ప్లేయర్లు భారత్ తరపున ఆడతారు.

# కోహ్లీని ఆపడం మా వల్ల కాలేదు

- విరాట్ భారీ ఇన్నింగ్స్‌కు మా దగ్గర సమాధానం లేదు
- ఐసీసీ టోర్నీల్లో టీమిండియా దూకుడుపై మిస్బా కామెంట్స్



లాహోర్: భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ వన్డేల్లో అత్యధిక స్కోరు 183. పాకిస్థాన్పై 2012 ఆసియా కప్లో విరాట్ భారీ శతకం సాధించాడు. ఆ మ్యాచ్లో సచిన్, రోహిత్ హాఫ్ సెంచరీలు సాధించారు. పాక్ బౌలింగ్ ఎటాక్ అత్యంత బలంగా ఉండే రోజుల్లో విరాట్ విజృంభించాడు. తొలి ఓవర్లోనే కీలక వికెట్ను తీసిన తమను ఆ తర్వాత ముగ్గురు బ్యాటర్లు ఓడించారని పాక్ మాజీ కెప్టెన్ మిస్బా ఉల్ హక్ వ్యాఖ్యానించాడు.

తీవ్ర ఒత్తిడి ఉండే మ్యాచ్లో అద్భుతంగా ఆడిన భారత్ను అభినందించాలి. పరిస్థితులు ఎలా ఉన్నా సరే 329 లక్ష్యమంటే తేలికైన విషయం కాదు. కానీ, ఎలాంటి ఇబ్బంది పడకుండా టీమ్ఇండియ బ్యాటర్లు ఆడిన తీరు బాగుంది. ఒకవేళ 350కిపైగా పరుగులు చేసినా ఒక్కోసారి అవి కూడా సరిపోవు. మా బౌలింగ్ సత్తాను బట్టి 320 పరుగులు అనేవి ఎక్కువ అని నా అభిప్రాయం. కానీ, భారత బ్యాటర్ల దూకుడు ముందు తక్కువయ్యాయి. మరీ ముఖ్యంగా విరాట్ కోహ్లీని ఆపడం మా వల్ల కాలేదు. కోహ్లీ బ్యాటింగ్ దెబ్బకు మా వద్ద సమాధానం లేదు అని మిస్బా తెలిపాడు.

ఆ ముగ్గురు కలిసి..

తొలుత బ్యాటింగ్ చేసిన పాక్ 329/6 స్కోరు చేసింది. ఓపెనర్లు మహమ్మద్ హఫీజ్ (105), నసీర్ జంషెడ్ (112) సెంచరీలు బాదారు. యూనిస్ ఖాన్ (52) అర్ధశతకం చేశాడు. అనంతరం లక్ష్య ఛేదనలో రెండు బంతులే ఎదుర్కొన్న ఓపెనర్ గౌతమ్ గంభీర్ డకౌట్గా పెవిలియన్కు చేరాడు. అయితే, సచిన్ తెందూల్కర్ (52)తో కలిసి కోహ్లీ రెండో వికెట్కు 133 పరుగులు జోడించాడు. సచిన్ ఔటైన తర్వాత క్రీజ్లోకి వచ్చిన రోహిత్ శర్మ (68)తో కలిసి కోహ్లీ మూడో వికెట్కు 172 పరుగుల భాగస్వామ్యం నిర్మించాడు. మరో 24 పరుగులు చేయాల్సి ఉండగా రోహిత్ ఔటయ్యాడు. సురేశ్ రైనా (12★), కోహ్లీ కలిసి ముందుకు నడిపించారు. మరో 11 పరుగులు చేస్తే విజయం మనదే అన్నప్పుడు కోహ్లీ (183) పెవిలియన్కు చేరాడు. ఆ వెంటనే ఎంఎస్ ధోనీ (4) జట్టును గెలిపించాడు. భారత్ 47.5 ఓవర్లలోనే 330 పరుగులు విజయం సాధించింది.

నమ్మశక్యంగా లేదన్న కోహ్లీ

ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచిన కోహ్లీ ఆ మ్యాచ్ అనంతరం స్పందిస్తూ.. అసలు ఏం జరుగుతుందో అర్థం కాలేదు. మేం 15 పరుగులు చేయడానికే నాలుగు ఓవర్లను తీసుకున్నాం. రోహిత్ బ్యాటింగ్ను చూడటం నాకిష్టం. అతడితో కలిసి ఆడే అవకాశం వచ్చింది. నేను రోహిత్కు అభిమానిని. పాక్ వంటి భీకర బౌలింగ్ ఎటాక్ను ఎదుర్కొని మేం 330 పరుగుల టార్గెట్ను ఛేదించడం ఆనందంగా ఉంది అని విరాట్ వ్యాఖ్యానించాడు.

PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044.



దసరా పండుగ దేశవ్యాప్తంగా ప్రతి సంవత్సరం ఘనంగా జరుగుతున్నాయి. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా , మహిషాసురుడిపై దుర్గామాత విజయం, రావణుడిపై శ్రీరాముడు సాధించిన విజయానికి గుర్తుగా దసరాను నిర్వహించుకుంటారు. నవరాత్రులు చివరి రోజు దసరా. దసరాలో దుర్గాపూజ వేడుకలు ఘనంగా నిర్వహిస్తారు. ఈ ఏడాది దసరా ఎప్పుడు నిర్వహించుకోవాలో సరైన తేదీపై కొంత సందిగ్ధత నెలకొంది. దసరాను ఏ రోజు నిర్వహించుకోవాలో చాలా మందికి తెలియడం లేదు. ఈ ఏడాది దశమి తిథి రెండు రోజుల పాటు ఉంటుంది. అందువల్ల అక్టోబర్ 12 లేదా 13న కూడా దశమి తిథి ఉంటుంది. కాబట్టి ఆ రెండు రోజుల్లో దసరా ఎప్పుడు నిర్వహించుకోవాలనే సందిగ్ధత నెలకొంది. పంచాంగం ప్రకారం అక్టోబర్ 12 శనివారం విజయదశమి నిర్వహించుకోవాలన్నది పండితుల సూచన.

# ఆనందకోలాహలాల నడుమ

# నేడు దసరా

## వాడవాడలా వేడుకలకు సిద్ధమైన వేళ

హిందూ సంస్కృతిలో దసరాకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. చెడు ఎంత శక్తివంతమైనదిగా కనిపించినా, చివరికి ధర్మమే గెలుస్తుందనే విశ్వజనీన సందేశాన్ని దసరా పండుగ బలపరుస్తుంది. పురాణాల ప్రకారం లంకను పాలించిన రావణుడు%ొ% రాముడి భార్య సీతను అపహరించాడు. శ్రీరాముడు, లక్ష్మణుడు, హనుమంతుడు, వానరసేన కలిసి సీతామాతను రక్షించారు. రావణుడితో వీరు భీకర యుద్ధం చేశారు. పది రోజుల పాటూ రాముడు, రావణుడితో పోరాడి ఓడించాడు. ఇది చెడుపై మంచి గెలుపుకు చిహ్నం. ఈ ఉత్సవాలకు గుర్తుగా దేశంలోని చాలా ప్రాంతాల లో రావణుడు, కుంభకర్ణుడు, వేంఘనాధ్ దిష్టిబొమ్మలను దహనం చేస్తారు. విజయదశమి సందర్భంగా దుర్గామాత మహిషాసురునిపై సాధించిన విజయాన్ని కూడా స్మరించుకుంటారు. బెంగాల్‌లో విజయ దశమి సందర్భంగా సింధూర్ ఖేలా, ధునుచి నృత్యాలతో జరుపుకుంటారు. అదనంగా, దుర్గా విగ్రహాల నిమజ్జనం (దుర్గా విసర్జన) శక్తివంతమైన ఊరేగింపులతో జరుగుతుంది, ఇది దేవత స్వర్గంలో ఉన్న తన నివాసాని కి తిరిగి రావడాన్ని సూచిస్తుంది.



చెడు మీద మంచిని సాధించిన విజయానికి గుర్తుగా ఈ పండుగను విజయదశమి అని పిలుస్తారు. మనిషి తనలోని కామ, క్రోద, మధ, మత్సర, మోహ, లోభ, స్వార్ధ, అన్యాయ, అమానవత, అహంకార అనే పది దుర్గుణాలను ఈ నవరాత్రులలో అమ్మ వారి శరణుజొచ్చి తమలో ఉన్న దు-ర్గుణాలను తొలగించు కునుటకు ఆధ్యాత్మికంగా ఉత్తమైన మార్గం ఈ శరన్నవరాత్రులు. దీనిని పది రోజులపాటు జరుపుకుంటారు. ముం దు నవరాత్రులు దుర్గ పూజ ఉంటుంది. చరిత్ర చెబుతున్నదేమిటి..? విజయదశమి రోజున చరిత్ర ప్రకారం రాముడు రావణుని పై గెలిచిన సందర్భమే కాక పాండవులు వనవాసం వెళ్తూ జమ్మి చెట్టు పై తమ ఆయుధాలను తిరిగి తీసిన రోజు. ఈ సందర్భమున రావణ వధ, జమ్మి ఆకుల పూజా చేయటం ఆచారం. జగన్మాత అయిన దుర్గా దేవి, మహిషాసురుడనే రాక్షసునితో తొమ్మిది రాత్రులు యుద్ధము చేసి అతనిని వధించి విజయాన్ని పొందిన సందర్భమున 10వ రోజు ప్రజలంతా సంతోషముతో పండగ జరుపుకున్నారు.

**విజయదశమి రోజునే శమీ పూజ**

ఈ యుద్ధములో ఆదేవి వాహనమైన సింహం శత్రువులను చీల్చి చెండా డింది. దేవితో తలపడిన అసురుడు మహిషిరూపము, సింహరూ పము, మానవ రూపముతో భీకరముగా పోరు. చివరకు మహిషిరూపము లో దేవిచేతిలో హతుడైనాడు. ఈవిధంగా అప్పటి నుండి మహిషుని సంహ రిం చిన దినము దసరా పర్వదినంగా పిలవబడింది. అదే విజయదశమి కూడా. విజయదశమి రోజునే శమీ పూజ కుడా నిర్వహిస్తారు. శ్రీరాముని వనవాస సమయంలో కుటీరం జమ్మి చెట్టు చెక్కతోనే నిర్మించారని చెబు తారు. శమి అంటే పాపాల్ని, శత్రువుల్ని నశింపజేసేది. పంచ పాం డవులు అజ్ఞాత వాసానికి వెళ్ళే ముందు తమ ఆయుధాలని శమీ చెట్టుపై పెట్టడం జరిగింది. సామాన్యులే గాక యోగులు నవరాత్రులలో అమ్మవా రిని పూజిస్తారు. ఆలయాలలో అమ్మవారికి విశేష అలంకరణలు చేసి పూజిస్తారు. దీని ఆకులను పరమశివుడికి.. జగన్మాత దుర్గాదేవికి.. సిద్ధి ప్రదాత వినాయకుడికి సమర్పిస్తారు. రుషులు.. మహర్షులు.. య్జ్ఞు లు.. యాగాదుల క్రతువులు నిర్వహించే సమయంలో హోమం చేసే టప్పుడు ... జమ్మి చెట్టు బెరడల నుంచి అగ్నిని పుట్టించి ప్రారంభించే వారు. ఇప్పటికి కూడా దేవాలయాల ప్రతిష్టల సమయంలో ఇలా వచ్చిన అగ్నితోనేహోమం మొదలు పెడతారు. పండితులు తెలిపిన వివరాల ప్రకారం... శమీ వృక్షము (జమ్మి చెట్టు)ను పూజిస్తే పాపాలను తొలగుతా యని చెబుతున్నారు. పూర్వకాలంలో లాకర్లు.. బ్యాంకులు లాంటివి ఉండేవి కావు.. అందుకే జమ్మి చెట్టుపై ముఖ్యమైన వస్తువులను భద్రపరిస్తే సురక్షితంగా ఉంటాయి. అంతేకాదు.. వీటిని శత్రువుల నుంచి జమ్మి చెట్టు కాపాడుతుంది. అందుకే అర్జునుడి ధనువు ( బాణం) జమ్మి చెట్టు కాపాడినది మహర్షులు చెప్పారు. అందుకే నేటికి కూడా దసరా పండుగ రోజున పోలీసులు తమ ఆయుధాలకు పూజలు జరిపించే సంప్రదాయం కొనసాగుతుంది. రాముడు యుద్దానికి బయలు దేరేటప్పుడు జమ్మిచెట్టును దర్శించుకుని పూజించి వెళ్లాడం. అందుకే విజయదశమి రోజున జమ్మి చెట్టుకు పూజించి జమ్మి బంగారాన్ని. (జమ్మి ఆకులను) పంచుకుంటారు.

**శమీ శమియతే పాపం !/ శమీ శత్రు వినాశం !**

**అర్జునస్య ధనుర్ధారి ! / రామస్య ప్రియదర్శని!!**

దసరా పండుగ రోజున పై శ్లోకాన్ని పేపర్ పై రాసి ఆ కాగితాన్ని జమ్మి చెట్టు వద్ద ఉంచి పూజ చేస్తారు. సాయంకాలం .. సూర్యా స్తమం సమయంలో.. జమ్మి చెట్టుకు సకల దేవతలను ఆవాహన చేసి పూజలు చేస్తారు. ఇలా చేయడం వల్ల అమ్మవారి కృప కలుగుతుందని నమ్మకం. ఆ తరువాత టపాసుల శబ్దాలతో సంబరాలు జరుపుకుంటారు.

జమ్మి చెట్టును పూజించడం వలన లక్ష్మీదేవి అనుగ్రహం కలుగుతుందని పురాణాలు చెబుతున్నాయి. శమీ వృక్షం .. సువర్ణ వర్షం కురిపిస్తుందని శాస్త్రాల్లో ఉంది. విజయదశమి రోజున పూజలు అందుకున్న జమ్మి చెట్టు ఆకులను ఇంట్లోని పూజాస్థలంలో, ధన స్థానంలో ఉంచుతారు. దీనివల్ల ధనవృద్ధి జరుగుతుందని హిందువులు నమ్ముతుంటారు. సంపదకు అధిదేవుడు కుబేరుడు దసరా రోజున రఘురాజుకు జమ్మి ఆకులు ఇవ్వగా.. వెంటనే అవి బంగారంగా మారాయని పలువురు ఆధ్యాత్మిక వేత్తలు చెబుతున్నారు. జమ్మిచెట్టును పూజించే సంప్రదాయం ద్వాపర యుగం నాటినుంచి వచ్చింది. పాండవులు అరణ్యవాసానికి వెళ్లే సమయంలో తమ ఆయుధాలను ఈ చెట్టుపై ఉంచి .. జమ్మిచెట్టుకు మొక్కి.. తమ ఆయుధాలను రక్షించమని ప్రార్థించి వెళ్లారు. అరణ్యవాసం ముగిసిన తరువాత అంటే విజయదశమి రోజున పాండవులు.. జమ్మి చెట్టును పూజించి ఆయుధాలను తీసుకుంటారు. ఇదే ఆయు ధాలతో కౌరవులపై యుద్దం చేసి విజయం సాధించారు. అప్పటినుండి, రాజులు, సైన్యం తమ ఆయుధాలను దసరా రోజున పూజించేవారు. శ్రామికులు, కార్మి కులు, తమ పనిముట్లకు పూజా చేసి వారు, వాళ్ళ పిల్లలు, వారి గ్రామం అంతా బాగుండాలని అమ్మవారిని వేడుకుంటారు.

జమ్మి చెట్టు త్వరగా పుచ్చిపోదు, చెద పట్టదు. అందుకని, పాండవులు అక్కడ దాచారని చెబుతుంటారు. జమ్మి ఔషధ వృక్షం కూడా. జమ్మి చెట్టు చుట్టూ ప్రదిక్షణ చేస్తే దాని నుండి వెలువడే గాలి కొన్ని రోగాలకు ఔషధ చికిత్సగా చెబుతుంటారు. జమ్మి పూజ చేస్తే కొన్ని గ్రహదోషాలు తొలుగుతాయని జ్యోతిష్యం చెబుతోంది. గ్రామ పురోహితునితో జమ్మి చెట్టు వద్ద గ్రామ పెద్దలు, ముఖ్యులతో పూజలు చేస్తారు. అలా పూజలు చేసిన తరువాత ఆ జమ్మి ఆకును తీసుకొని వెళ్లి పెద్ద వారి చేతిలో పెట్టి వారి ఆశీర్వాదం తీసుకుంటారు.

**దసరా రోజున ఈ మంత్రాలను పఠించండి**

**రామ ధ్యాన మంత్రం**

ఆపదామప హర్తారం దాతారం సర్వ సంపద
లోకాభిరామం శ్రీరామం భూయో భూయో నమామ్యహమ్

**శ్రీ రామ గాయత్రీ మంత్రం**

ఓం దశరథాయ విద్మహే సీతా వల్లభాయ ధీమహి

**రామ మూల మంత్రం**

ఓం హ్రాం హ్రీం రామ రామాయ నమః

**– సత్యగోపాల్, హైదరాబాద్**



















## దసరా శుభ ముహూర్తం

పంచాంగం ప్రకారం గుర్తుంచుకోవలసిన ముఖ్యమైన తిథులు ఇక్కడ ఉన్నాయి:

విజయ్ ముహూర్తం – మధ్యాహ్నం 2:03 నుండి 2:49 వరకు

అపరాహణ పూజ సమయం – మధ్యాహ్నం 1:17 నుండి 3:35 గంటల వరకు

దశమి తిథి ప్రారంభం – అక్టోబర్ 12న ఉదయం 10:58 గంటలకు

దశమి తిథి ముగింపు – అక్టోబర్ 13న ఉదయం 9:09 గంటలకు

దసరా లేదా విజయదశమి ప్రాముఖ్యత రావణ రాక్షసునిపై శ్రీరాముడు సాధించిన విజయానికి గుర్తుగా, దుర్గా దేవి మహిషాసు-రుడిపై విజయం సాధించిన సందర్భంగా నిర్వహించుకుంటారు.

**దసరా శస్త్ర పూజ లేదా ఆయుధ పూజ శుభ సమయం, శుభ ముహూర్తం :** దసరా రోజున మధ్యాహ్నం 2:03 నుంచి 2:49 గంటల వరకు శస్త్రపూజ లేదా ఆయుధ పూజను నిర్వహించే శుభ సమయం. దీని ప్రకారం ఈ సంవత్సరం ఆయుధ పూజకు 46 నిమిషాల సమయం లభిస్తుంది.

**రావణ దహన కార్యక్రమం 2024 శుభ సమయం :** హిందూ విశ్వాసాల ప్రకారం ప్రదోష కాలంలో రావణ దహనం జరుగుతుంది. పంచాంగం ప్రకారం అక్టోబర్ 12 న రావణ దహనం శుభ సమయం సాయంత్రం 5:53 నుంచి 7:27 వరకు ఉంటుంది.